సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 6 - ఆదివారం 12 ఫిబ్రవరి, 2017 సంపుటి : 2 సంచిక 20 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

పేజీలు 2లో...

భావప్రకటన స్వేచ్ఛకు కట్టుబడి ఉన్నాం: జవదేకర్

పేజీలు 3లో...

ఆధార్ చెల్లింపుల విధానం అతిపెద్ద సాంకేతిక విప్లవం

పేజీలు 5లో...

75 ఏళ్ల స్వప్నం సాకారం చేస్తాం

పేజీలు 7లో...

అభిమానులకు మెగా న్యూస్

పేజీలు 8లో...

ప్రత్యేక 'ప్రేమంటే' ఇదేనా ?

### విశాఖ రైల్వేజోన్ కోసం

# వైఎస్సార్‌సీపీ పాదయాత్ర





**విశాఖపట్నం :** విశాఖ రైల్వేజోన్ కోసం పోరాటం ఉధృతం చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. విశాఖలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, కేంద్ర బడ్జెట్‌లో విశాఖ రైల్వేజోన్ ప్రకటన లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. మార్చి 9లోగా విశాఖ రైల్వే జోన్ ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బొత్స డిమాండ్ చేశారు. కేంద్రం రైల్వేజోన్‌పై ప్రకటన చేయకుంటే పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో అనకాపల్లి నుంచి భీమిలీ వరకు 250 కి.మీ. పాదయాత్ర చేపడతామన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల మనోభావాలను చంద్రబాబు పరిగణనలోనికి తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ కేటాయించకున్నా సీఎం చంద్రబాబు స్వీట్లు పంచుకోవడం దారుణమన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా టీడీపీ నేతలు కమీషన్లు దండుకుంటున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాపై బాబు సర్కార్ స్పందించకపోవడం శోచనీయమని,చంద్రబాబు వ్యక్తిగత ప్రయోజనాల కోసం హోదాను తాకట్టుపెట్టారని దుయ్యబెట్టారు. పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి హోదాపై ప్రశ్నిస్తే కమిటీ వేశామని చెప్పడం బాధాకరమని బొత్స అన్నారు. విశాఖ ఉత్సవ్ పండుగ కాదు ఒక జాతర అన్నారు. మీడియా సమావేశంలో గుడివాడ అమర్నాథ్, జిల్లాకు చెందిన పార్టీ నేతలు పాల్గొన్నారు.



## 21 నుంచి 27 వరకు అమరేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

### పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మలపాటి

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** శైవ క్షేత్రాలలో ప్రముఖమైన అమరావతిలో శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి బ్రహోత్సవాలను మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 21 నుంచి 27 వరకూ ప్రతిష్ఠాత్మకగా నిర్వహించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. అమరేశ్వరస్వామి అలయ ప్రాంగణంలో ఆర్డీవో శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా శ్రీధర్ ప్రసంగించారు. రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా రవాణా సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణా నదిలో భక్తులు సాన్నమాచరించే ప్రదేశం, ఆలయ ప్రాంగణాల్లో షామియానాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకూండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముందుస్తు ప్రణాళికలతో ఉత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ కె.వి. శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి, అమరావతి తహాశీల్దారు భాస్కరరావు, ఎంపీడీవో వై.రాజగోపాల్, అమరావతి సర్పంచ్ గుడిసె నిర్మాలాదేవి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ పి. రామకృష్ణ, సిఐ. మురళీకృష్ణ, ఎస్ఐ కె. వెంకట ప్రసాద్, సీఈవో వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్‌కె. జానీ, పల్నాటి కోటయ్య, బి బలారాం,చేకూరి జాబిబాబు ఆయాశాఖ ఉన్నతాధికారులు స్వచ్ఛంద, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం ఎమ్మెల్యే ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.



# దాసరి ఆరోగ్యం మెరుగు

**మరో 4 రోజులు ఐసీయూలోనే: వైద్యుల ప్రకటన**

**హైదరాబాద్ :** ప్రముఖ సినీ దర్శకనిర్మాత, కేంద్ర మాజీ మంత్రి దాసరి నారాయణరావు ఆరోగ్యం మెరుగైందని, అనుకున్న దానికంటే త్వరలో కోలుకుంటున్నారని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యలు ప్రకటించారు. 'ఊపిరితిత్తుల పనితీరు నిలకడగా ఉంది. ఇంకా వెంటిలేటర్ సపోర్ట్ ఇస్తున్నాము. మరో మూడు, నాలుగు రోజులు ఐసీయూలో ఉంటారు. అన్నవాహికకు శస్త్ర చికిత్స చేయడం వల్ల ఫ్లూయిడ్స్ మాత్రమే ఇస్తున్నాము. మధుమేహవ్యాధి కూడా ఉన్నందన దానిని కూడా అదుపులోకి తెస్తున్నాం. అని డాక్టర్ కృష్ణకుమార్ డాక్టర్ ప్రభాకర్‌లు హెల్త్ బులెటిన్‌లో తెలిపారు. ఇదిలావుండగా, దాసరిని ఏపీ సీఎం చంద్రబాబు పరామర్శించారు. 'దాసరి నాకు బాగా సన్నిహితుడు, కుటుంబ సభ్యుడిగా కలిసి ఉంటాం జన్మభూమిపాట రాసింది. దాసరే. ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసి..చీఫ్ విప్ కాల్వ శ్రీనివాసులును పంపించారు. కానీ ఎంతమందివచ్చినా నేనుచూస్తే వచ్చే ఆనందం ఇంకొకటి లేదు' అని అన్నారు. అంతకుముందు నటుడు చిరంజీవి కూడా దాసరిని పరామర్శించారు. జయప్రద, మోహన్‌బాబు, మురళీమోహన్, సి.కళ్యాణ్, వి.హనుమంతరావు, అంబటి రాంబాబు విజయ బాపినీడు, టి.సుబ్బి రామిరెడ్డి దాసరిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

**రామోజీకి చంద్రబాబు పరామర్శ**

**హైదరాబాద్ :** ఈనాడు' గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుని సీఎం చంద్రబాబు పరామర్శించారు. బేగంపేటలోని రామోజీ నివాసానికి వెళ్లి... పావుగంటసేపు అక్కడ గడిపారు. రామోజీరావు ఇటీవల శ్వాసకోశ సంబంధిత సమస్యలతో అనారోగ్యానికి గురుయ్యారు. కొద్ది రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకొని కోలుకొన్నారు. ఆయన ఆరోగ్య గురించి చంద్రబాబు వాకబు చేశారు.

## అమరావతికి రానున్న 62 సంస్థలు



**విశాఖపట్నం :** నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి సీఐఐ సదస్సులో అగ్రతాంబూలం దక్కింది. రాజధాని చుట్టూ రెండు ఔటర్ రింగురోడ్లు కృష్ణానదిపై విజయవాడ నుంచి రాజధానికి అద్భుతమైన వంతెన నిర్మాణాలకు ఒప్పందాలు కుదిరాయి. సాగరమాల, వాటర్‌వేస్ ప్రాజెక్టులపై చర్చించారు. అమరావతి సీఆర్‌డీఏ ప్రాంతం 217 చదరపు కిలోమీటర్లు ఉంది. దాని చుట్టూ రెండు రింగు రోడ్లను నిర్మించనున్నారు. వాటిలో ఒకటి 186 కిలోమీటర్లు కాగా, దానిని కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.20వేల కోట్లతో నిర్మించనుంది. మరో రింగురోడ్డు 125 కిలోమీటర్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించడానికి డీపీఆర్ తయారవుతోంది. ఈ రెండు రింగురోడ్లకు సంబంధించి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి సమక్షంలో కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకుంది. రాజధానిని కలుపుతూ రూ.1,24,532 కోట్లతో 62 కంపెనీలు సీఆర్‌డీఏ పరిధిలో ఏర్పాటు చేసేందుకు .. 2.1 లక్ష మందికి ఉపాధి కల్పించేందుకు ఒప్పందాలు జరిగాయి.

# నమ్మేదెలా బాబూ ?...

**రాజధాని డెస్క్ :** రాష్ట్ర ప్రయోజనాలకోసమే బీజేపీతో పొత్తుపెట్టుకున్నానని, ముస్లింలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నామని చెప్పుకొచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంతవరకు రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు కమిటీని ఎందుకు ఏర్పాటు చేయలేదని రాష్ట్ర ముస్లిం సంఘాలు నిలదీస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకోసం నమ్మకంగా, నిజాయితీగా పనిచేస్తున్న నర్సాపురం నియోజక వర్గ ఎమ్మెల్సీ అహ్మద్ షరీఫ్, వైసీపీనుంచి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్న విజయవాడ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, పుట్టింటికి తిరిగి వచ్చిన కదిరి ఎమ్మెల్యే చాంద్‌బాషా, గుంటూరు మాజీ ఎమ్మెల్యే జియా ఉద్దీన్, నంధ్యాల ఎమ్మెల్యే ఫరూక్‌లు అధికార పార్టీలో ఉండగా, మైనార్టీ వర్గానికి చెందని పల్లెరఘునాథరెడ్డిని మంత్రిగా నియామకం జరగటంపై ఔచిత్యమేమిటని పలు ముస్లిం సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. రెండున్నర ఏళ్ల పాలనలో ఇంతవరకు

**ముస్లిం సంఘాలు**

వక్ఫ్‌బోర్డును ఏర్పాటు చేయలేదని, దీంతో ముస్లిం సంస్థల ఆస్తులను కాపాడేందుకు చర్యలు లేకుండా పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతో అనేక సంక్షేమ పథకాలు నిర్వహించే అవకాశం లేకుండా పోయిందని, దీంతో పేద ముస్లింలకు అన్యాయం జరుగుతుందని ముస్లిం పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు. ముస్లింల అభివృద్ధి కోసం ఇప్పటికైనా వక్ఫ్‌బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని, ముస్లింలకు విద్యలోనే కాకుండా ఉద్యోగాల్లో సైతం 4 శాతం రిజర్వేషన్‌కు చంద్రబాబు కట్టుబడి ఉండాలని పలు ముస్లిం సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికైనా ముస్లిం ఎమ్మెల్యేలకు తగిన పాతినిధ్యం ఇస్తూ మంత్రి పదవులు ఇచ్చినప్పుడే ముఖ్యమంత్రి వాగ్ధానాలకు విలువ ఉంటుందంటున్నారు.



## ఈవారం రాజధాని

- రాజధాని రైతులకు మూలధన లాభాలపై పన్ను మినహాయింపు
- అమృతా యూనివర్సిటీకి రాజధానిలో స్థల కేటాయింపు
- అమరావతిలో 10 ఎకరాలలో రానున్న సాంస్కృతిక భవనం
- కనకదుర్గ ఫ్లై ఓవర్‌ను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయండి : ముఖ్యమంత్రి
- రాజధాని ప్రజలకు ఉచిత వైద్య కార్డులు జారీ
- అమరావతి రైలు మార్గానికి రూ. 2680 కోట్లు
- పన్ను మినహాయింపుపై కాలపరిమితి వద్దన్న రాజధాని రైతులు
- ఫిబ్రవరి 9న సచివాలయ ఉద్యోగ సంఘం ఎన్నికలు
- 22 న రానున్న అమరావతి నగర ఆకృతి పరిపాలన నిర్మాణ భవనాల ప్రణాళిక
- ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఏపీ : సిఎం
- ఫిబ్రవరి 10 నుండి మహిళా పార్లమెంటు : కోడెల
- తుళ్లూరులో సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభించిన : కె.ఈ. కృష్ణమూర్తి
- నాగార్జున సాగర్‌లో రూ. 500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎమ్యూజ్ మెంట్ పార్క్
- వెలగపూడిలో అమరావతి హాస్పటల్ ప్రారంభం.

# లోకేష్‌కు ఏ శాఖ కేటాయిస్తారు ?



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ పునర్వవస్థీకరణలో లోకేష్‌కు ఏ శాఖ కేటాయిస్తారు ? అనే విషయంపై చర్చలు జరుగుతున్నాయి. నూతన రాష్ట్రంలో ఐటీకి తగిన ప్రాతినిధ్యం లేనందున ఆశాఖ లోకేష్‌కు సూటవుతుందని సీనియర్ మంత్రులు చెబుతున్నారు. అయితే భారీ పరిశ్రమల శాఖ కేటాయించే అవకా శాలు లేకపోలేదని తెలుస్తోంది. కొత్తవారికి ఎవరెవరికి అవకాశం లభిస్తుందనే అంశాలపై పార్టీ వర్గాల్లో రసవత్తర చర్చలు సాగుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గంలో మృణాళిని, రావెల కిషోర్‌బాబు, మరి కొందరి పనితీరు పట్ల ముఖ్యమంత్రి అసంతృప్తితో వున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎంతో పాటు 20 మంది మంత్రులున్నారు. రాష్ట్ర శాసనసభ సభ్యుల సంఖ్య ఆధారంగా దీనిని 26 మందికి పెంచుకునే అవకాశం వుంది. అందువల్ల ఎవరినీ తొలగించకుండా కూడా కొందరికి అవకాశం కల్పించే అవకాశాలున్నాయి. అయితే ఒకరిద్దరిపై వేటు వేయడం ద్వారా రాబోవు రెండేళ్ళపాలనలో మిగిలిన మంత్రులు మరింత సమర్థవంతంగా పనిచేసే పరిస్థితి వుంటుందని ముఖ్యమ ంత్రి యోచన. సీనియర్ శాసనసభ్యుల్లో శ్రీకాకుళం నుండి గౌతుశ్యాంసుందర్ శివాజీ, విజయనగరం జిల్లాలో పతివాడ నారాయణస్వామి, విశాఖలో బండారు సత్యనారాయణమూర్తి, తూర్పుగోదావరిలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గొల్లపల్లి సూర్యారావు, తోట త్రిమూర్తులు, కృష్ణాలో కాగిత వెంకట్రావు, గుంటూరులో దూళిపాళ్ళ నరేంద్ర చౌదరి, ప్రకాశంలో దామచర్ల జనార్ధన్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అనంతపురంలో పార్థసారధి తదితరులు మంత్రి పదవులు ఆశిస్తున్నారు.

### క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ మినహాయింపుతో

# చేతులు దులుపుకున్న కేంద్రం



**రాజధాని ప్రతినిధి-అమరావతి :** రాజధాని నిర్మాణానికి భూసమీకరణ పథకంలో భూములిచ్చిన రైతులకు పరిహారం కింద సీఆర్‌డీఏ ఇచ్చే స్థలాలను (ప్లాట్లను) విక్రయించగా వచ్చే సొమ్ముకు క్యాపిటల్ గెయిన్స్ (మూలధన పన్ను) మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్ర ప్రకటించింది. అయితే, 2014 జూన్ 2నాటికి భూములు కలిగి ఉన్నవారికి మాత్రమే ఈ ప్రయోజనం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఇంతకు మించి కేంద్రం రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదు. వాస్తవానికి వ్యవసాయ భూముల అమ్మకం ద్వారా వచ్చే సొమ్ముకు క్యాపిటల్ గెయిన్స్ పన్నులేదు. ఇప్పుడు ఈ భూములను ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయించడం వల్ల క్యాపిటల్ గెయిన్స్ పన్ను పడుతుంది. అయితే, ప్రభుత్వం అవసరాల కోసం భూమిని ఇచ్చినందున దీనికి మూలధన పన్ను మినహాయింపు ఇచ్చింది. దీనివల్ల రైతులకు ప్రయోజనం ఉండదు. ఎందుకంటే రైతులు ఎకరాభూమికి భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇస్తే సీఆర్‌డీఏ 800 గజాల నుంచి 1,450 గజాల చొప్పున ప్లాట్లను రైతులకు ఇచ్చింది. ఇప్పుడు ఎకరాభూమిని అమ్మితే వచ్చే ఆదాయం కంటే సీఆర్‌డీఏ ఇచ్చిన ప్లాట్ల విక్రయిస్తే ఎక్కువేమీ రాదు. భూ సమీకరణ పథకంలో రైతుల నుంచి 32,221 ఎకరాల ను ప్రభుత్వం సేకరించింది. 29 గ్రామాలకు చెందిన 25,614 మంది రైతులు భూములిచ్చారు. అయితే, రాజధాని ప్రకటన కంటే ముందే అధికార నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అన్నదాతల భూములను తక్కువ ధరలకే కొట్టేశారని ఆరోపణలు ఉన్నాయి. అమరావతి ప్రాంతంలో 2014 జూన్ 2నుంచి 2016 మార్చి 6 వరకు 9,231 ఎకరాలు పలవురి చేతులు మారాయని రికార్డులు తెలుపుతున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరలకు కొనేసిన భూములను అధికారి పార్టీ నేతలు, స్థిరాస్తి వ్యాపారులు ప్రభుత్వానికి ఇచ్చారని, పరిహారం కింద ప్రభుత్వం ఇస్తున్న ఖరీదైన ప్లాట్లను తీసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



# రాజధాని వార్తలు

కలం

## వారసులు సామరస్యంగా మెలగాలి

పేరుకు ప్రజాసామ్యమే అయినా రాజరికం దారిలోనే భారతదేశం నడుస్తోంది. జాతీయ పార్టీల నుంచి ప్రాంతీయ పార్టీలవరకు కుటుంబ వ్యక్తులే పరిపాలనా బాధ్యతలు చేపడుతున్నారు. ఇక్కడి ప్రజలు కూడా ఆ తంతుకు పూర్తిగా అలవాటు పడ్డారు. ఏ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ చూసినా కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్ల చేతుల్లోనే ఉండటం పరిపాటి అయ్యింది. ఇదే పరిస్థితి మన రాష్ట్రంలో కూడా చోటు చేసుకుంటుందని వార్తా కథనాలు వస్తున్నాయి. నిజానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వారసులెవరినీ రాజకీయాల్లోకి తీసుకురానని వారు వ్యాపారాలు చేసుకుంటారని, ఈ విషయంలో తనకు ఆదర్శం అప్పటి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసని చాటి చెప్పారు. అయితే పరిస్థితులు చాలా మారాయి. దాంతో పాటే ఆయన కూడా మారారు. రాజకీయన వారసుడిగా నారా లోకేష్‌ను తెరపైకి తెచ్చారు. దానిలో భాగంగా పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా నియమించారు. పార్టీ సభ్యత్వాలను , కార్యకర్తల నమోదును చేపట్టిన లోకేష్ పార్టీ నేతలను ఆకర్షించి, ఏడాది కాలంగా మంత్రి పదవికోసం చూస్తున్నారు. కుటుంబసభ్యులు కూడా దానికి వత్తాసు పలకడం, మిగతా మంత్రులంతా ముఖ్యమంత్రి మీద వత్తిడి తీసుకురావడంతో చంద్రబాబు ఎట్టకేలకు ఒప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలను చినబాబు పోటీ చేయడానికి ఇచ్చి తమ స్వామి భక్తిని నిరూపించుకోవడానికి రెడిగా ఉన్నారు. లేదంటే ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికై పదవి చేపట్టే అవకాశం ఉంది.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రెండు ప్రాంతీయ పార్టీల్లోనూ వారసులే పగ్గాలు చేపడుతున్నారు. పార్టీ వ్యవస్థాపకుల తీరుకు వీరికి చాలా తేడా ఉంటోంది. వారంతా మధ్య తరగతి నుంచి లేదా ప్రజల మధ్య నుంచి వచ్చినవారు కావడంతో ప్రజలతో మమేకమై, నాయకులకు గౌరవాన్ని ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం ఉన్న తరానికి మొదటి నుంచి గోల్డు స్పూన్ అలవాటైంది. వీరికి కార్యకర్తలు, లేదా నాయకులంటే పెద్ద పట్టింపు ఉండదు. తామే సుప్రీం అనుకుంటూ ఉంటారు. దీనికి కారణం వారు పుట్టి, పెరిగినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో సీనియర్ నాయకులంటే వారి దృష్టిలో పెద్ద పట్టింపులుండవు. వైసీపీనేత జగన్ తన తండ్రితో పనిచేసిన మంత్రులను కూడా పట్టించుకోలేదని, వారితో నిష్కర్షగా వ్యవహరించేవారని ప్రజల అభిమానం ఉంటే చాలన్నట్లుగా వ్యవహరించడమే ఆయన ఓటమికి కారణమని ఎన్నికల పరిశీలకు తేల్చి చెప్పారు. ఇలాంటి మనస్థత్వమే తెలుగుదేశం పార్టీ నేత లోకేష్‌లో కూడా ఉంది. అయితే జగన్ ఇదివరకటి మనస్థత్వాన్ని వదులుకొని ప్రతిపక్షనాయకులను కూడా అన్నా అంటూ పలకరిస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

తెలుగుదేశం పార్టీ శిక్షణా తరగతుల్లో తెలుగుదేశం సీనియర్ నాయకుడు, ఉపముఖ్యమంత్రి నిమ్మకాయ చినరాజప్పను లోకేష్ హెడ్మాస్టర్‌లా గద్దిస్తుంటే, ఆయన భయపడుతూ నుంచున్న వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే.. ఆయన వ్యవహార తీరు బాగోలేదని పార్టీలోని చాలా మంది సీనియర్లు చంద్రబాబుకు నివేదించాలని అనుకున్నా ఆ వ్యవహారం తమకే ముప్పుతెస్తుం దేమో అని భయపడి ఊరుకున్నట్లు తెలిసింది. ఈ పరిస్థితిలో చంద్రబాబు నాయుడు మంత్రిపదవిని లోకేష్‌కు ఇస్తే వ్యవహార శైలి ఎలా ఉంటుందోనన్న భయం సీనియర్ పార్టీ నేతల్లో ఉంది. ముఖ్యమంత్రి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే సమీక్షా సమావేశాలతో విసిగిపోయిన రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారులంతా కేంద్ర సర్వీసుల్లో చేరడానికి వరుసలో నిలబడ్డారు. కొందరు ఈ ప్రయత్నంలో కృతకృత్యులయ్యారు కూడా. ఈ సమయంలో లోకేష్ కొత్తగా మంత్రి వర్గంలో చేరితే స్వంయమనంతో వ్యవహరించి, మంత్రులు, అధికారులతో పనిచేయించాల్సి ఉంటుంది. నియంతృత్వంగా వ్యవహరించడం, దబాయించడం వంటి పనులతో అధికారులు మొండికేసే ప్రమాదం ఉంది. పార్టీ అధినేతల వారసులు అధికారం చేపడితే లౌక్యంగా , సంయమనంగా వ్యవహరించి, సామరస్యంగా మెలిగినప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్న విషయం గమనించాలి.



పల్స్ పోలియో చుక్కలను వేస్తున్న కానూరు గ్రామ ఉప సర్పంచి లతీఫ్

## ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించిన మంత్రి

**రాజధాని ప్రతినిధి - మచిలీపట్నం :** ఆర్ & బి అతిథి గృహంలో మంత్రి కొల్లు రవీంద్ర, మడ అధికారులు కలసి ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మడ అధికారులు బందరు పోర్టు అభివృద్ధికి మడ ద్వారా చేపట్టిన భూసమీకరణ ప్యాకేజి గురించి ఆక్వారైతులకు వివరించారు. ఆక్వారైతులు తమ సమస్యలను సమావేశంలో వివరించారు. చేపలు, రొయ్యలు సాగులో పెట్టుబడులు అధికంగా పెట్టామని, చెరువు త్రవ్వడం, గట్లు వేయడం, షెడ్లు నిర్మించడం, మోటార్లు ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ఖర్చు అవుతుందని, ఆ అంశాలు పరిగణలోకి తీసుకుని మెరుగైన ప్యాకేజి ఇచ్చే విధంగా కృషి చేసి అసైన్డ్ భూముల విషయంలో మరింత స్పష్టత ఇవ్వాలని, తగిన న్యాయం చేయాలని ఆక్వా రైతులు సమావేశంలో మంత్రికి మరియు అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు మచిలీపట్నం పోర్టు అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయడం, టౌన్‌షిప్ అభివృద్ధి చేయడానికి భూ సమీకరణ మడ ద్వారా చేపట్టామని తెలిపారు. రైతులు తెలియజేసిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఆక్వా రైతులతో మరోసారి సమావేశం నిర్వహించి భూ సమీకరణ ప్యాకేజి విషయాల్లో తగిన అవగాహన కల్పించాలని మడ అధికారులకు సూచించారు. బందరు పోర్టు అభివృద్ధికి వచ్చిన అవకాశాన్ని వినియోగించు కోవాలని మంత్రి ఆక్వారైతులను కోరారు. చెన్నై-విశాఖ కారిడార్ అభివృద్ధిలో మచిలీపట్నంను చేర్చిందని ఈ ప్రాంతంలో 3వేల కోట్ల రూపాలయు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు. విశాఖ సమ్మిట్‌లో శుక్రవారం మొదటిరోజు 4.68కోట్ల రూ. పెట్టుబడులు ఎంఓయు కుదిరిందని, రెండవ రోజు శనివారం 10వేల లక్షల కోట్ల రూ. పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా బందరు పోర్టు అభివృద్ధికి చేపట్టిన భూ సమీకరణలో ఆక్వా రైతులు సహకరించాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. ఈ సమావేశంలో బందరు జడ్‌పిటిసి లంకె నారాయణప్రసాద్, మడ విసి ఎం.వేణుగోపాల రెడ్డి, ఆర్‌డిఒ సాయిబాబు, తహసీల్దార్ నారదముని, ఆక్వారైతులు మంతెన రామరాజు, శివరామరాజు, పూర్ణ, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

## భావప్రకటన స్వేచ్ఛకు కట్టుబడి ఉన్నాం: జవదేకర్



**గౌహతి :** భావప్రకటన స్వేచ్ఛకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి ప్రకాష్ జవదేకర్ అన్నారు. 'ప్రజాస్వామ్యంలో రచనలు, భావ వ్యక్తీకరణ ద్వారా ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించవచ్చు. ఎన్‌డీఏ ప్రభుత్వం భావప్రకటన స్వేచ్ఛకు కట్టుబడి ఉందని' జవదేకర్ అన్నారు. గౌహతిలో ప్రారంభమైన మూడు రోజుల బ్రహ్మపుత్ర లిటెరరీ ఫెస్టివల్' కార్యక్రమంలో ఆయన ప్రసగించారు. ఎమర్జెన్సీ రోజుల్లో భావప్రకటన స్వేచ్ఛకు భంగం వాటిల్లిదని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని జైలుపాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు.

# అలరించిన నౌకా విన్యాసాలు

### పున్నమిఘాట్‌లో సందర్శకుల సందడి






**రాజధాని ప్రతినిధి,(విజయవాడ) :** ఈ నెల 4వ తేదీన భవానీపురంలోని పున్నమిఘాట్‌లో నిర్వహించనున్న నౌకాదళ విన్యాసాలకు రెండు రోజులపాటు చేపట్టిన రిహార్సల్స్ (డెమో) సాయంత్రం ప్రారంభమయ్యాయి. దాదాపు గంటసేపు పలు అంశాలను ప్రదర్శించారు. తొలుత చేతక్ సైనిక్ విమానంతోపాటు మరో విమానం జాతీయ పతాకాన్ని ఎగరవేస్తూ కృష్ణానదిపై విహరించాయి. అనంతరం ప్రమాదంలో ఉన్న నౌకా సిబ్బందిని రక్షించేందుకు విమానంలో నుంచి తాడు సాయంతో సిబ్బంది ఉన్న బోటులోకి దిగటం, ఆ సిబ్బందిని తాడుతోనే విమానంలోకి తీసుకెళ్లడం ప్రదర్శించారు. శత్రువులను తుదముట్టించేందుకు విమానంలో నుంచి తాడుతో బోట్‌లోకి దిగటం. అక్కడ ఉన్న శత్రువుల ఆయిల్ రిగ్‌ను ధ్వంసం చేసేందుకు టార్గెట్ చేయడం, అక్కడ నుంచి దూరంగా వెళ్లిపోయి టార్గెట్ పూర్తిచేసినట్లుగా తుపాకులతో ఆరెంజ్ పొగను విడుదల చేసి విమానంలో ఉన్నవారికి సిగ్నల్స్ ఇవ్వటం, విమానంలో నుంచి తాడు కిందకు వదలగానే తిరిగి వారంతా అందులోకి వెళ్లిపోవడం వంటి సన్నివేశాలను ప్రదర్శించారు. వాటర్ స్కీ డెమో. సీకింగ్ 42 చాప్లీ అనే హెలీకాప్టర్‌తో విన్యాసాలు,చాంపియన్ గ్రూప్ ఆధ్వర్యంలో లైఫ్‌బోర్డు (నదిపై నుంచి 6 మీటర్ల ఎత్తు నుంచి నదిలోపలకు డైవ్ చేయటం. సెయిలింగ్ బోట్ల నుంచి నావికాదళం దిగి శత్రువులపై ఎదురుదాడి చేయటం, శత్రు నౌకలపై బాంబింగ్ చేయడం వంటి ప్రదర్శనలు కూడా ఇందులో చోటుచేసుకున్నాయి. చివరిగా నేవీ బ్యాండ్ బృందం వినిపించిన వాయిధ్య సంగీతం సందర్శకులను అలరించింది. ఏపీ నావెల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ సంజీవ్ ఇస్సార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు కళాశాల విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున్న హాజరయ్యారు. సందర్శకుల కోసం పున్నమిఘాట్‌లో తగిన ఏర్పాట్లు చేశారు. కూడా ఇదే తరహాలో సాయంత్రం 4 గంటల నుంచి రిహార్సల్స్ ఉంటాయని ఈవెంట్ కో ఆర్డినేటర్ సుజిత్‌రెడ్డి తెలిపారు.

**నౌకా విన్యాసాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయండి....**

ఈ నెల 4వ తేదీన పున్నమిఘాట్‌లో నిర్వహించే నౌకాదళ విన్యాస ప్రదర్శన లకు ముఖ్యమంత్రి హాజరుకానున్న దృష్ట్యా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ గంధం చంద్రుడు అధికారులను ఆదేశించారు. ఆయన పున్నమిఘాట్‌లో వేదిక. సిట్టింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విన్యాసాలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు బారికేడింగ్, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. విన్యాసాలను అందరూ తిలకించే విధంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని దూరదర్శన్, కేబుల్ టీవీ నెట్‌వర్క్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయాలని చెప్పారు. ఏర్పాట్ల పరిశీలనలో సబ్ కలెక్టర్ డాక్టర్ సలోని సిదాన, నావెల్ కమాండర్ సంజీవ్ ఇస్సార్, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ రామకృష్ణ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్లికార్జున, అర్బన్ ఎమ్మార్ ఆర్ శివరావు, నావెల్ అధికారులు పాల్గొన్నారు.

**నేవీమేళాకు రూ.1.30 కోట్లు మంజూరు**

పున్నమి ఘాట్ వద్ద జరుగుతున్న నేవీమేళాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.30 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఖర్చు చేస్తారు. నేవీమేళా పూర్తయినా తరువాత ఏడు రోజుల్లోగా నిధులకు బిల్లులు చెల్లించాలని టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీకాంత్ తెలిపారు.

# దర్జాగా దారి మళ్లుతున్న "సబ్‌ప్లాన్" నిధులు

- చోద్యం చూస్తున్న టి.డి.పి. ఎస్సీ విభాగం నేతలు
- కనిపిస్తున్నా పట్టించుకోని ప్రతిపక్షాలు

**రాజధాని ప్రతినిధి - మచిలీపట్నం :** గత 60 ఏళ్ళుగా షెడ్యూల్‌కులాలకు వారు నివసించే ప్రాంతాలకు చెందవలసిన నిధులు గద్దలు తన్నుకు పోతున్నట్లు ప్రజా ప్రతినిధులు తరలించుకు పోవడం తెలిసిందే. ఈ పరిస్థితికి తెర దించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావటం తెలిసిందే. దీనికి సైతం తూట్లు పొదుస్తున్నారు ప్రస్తుత పాలకులు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు నూరుశాతం ఎస్సీలు నివసించే ప్రాంతాలలోనే ఖర్చు పెట్టాల్సి వుంది. అలా కుదరని పక్షంలో కనీసం 40శాతం ఎస్సీ జనాభా వున్న ప్రాంతాల్లో ఖర్చు చేయాలని చట్టం స్పష్టం చేస్తున్నా కనీస పరిజ్ఞానం లేని మన ప్రజా ప్రతినిధులు అధికారులపై ఒత్తిడి చేసి మరి మళ్ళించేస్తున్నారు. ఈ భాగోతాలు వెలుగులోకి వస్తే పోయేది అధికారులే కదా మనకు ఏమీ కాదని నేతల గట్టి నమ్మకం.

**అధికారులపై అధికంగా ఒత్తిళ్ళు...**

బందరు అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్ళింపు ఎక్కువగా జరుగుతుంది. నియోజకవర్గానికి గడిచిన రెండేళ్ళలో సుమారు రూ.7కోట్లు సబ్‌ప్లాన్ నిధులు వస్తే, దానిలో మూడు వంతుల నిధులు దారి మళ్ళాయని సమాచారం. బందరు పట్టణంలో 42వ వార్డులో ఒకేఒక్క ఎస్సీ కుటుంబం నివసిస్తుంటే ఆ కుటుంబం పేరుతో 38లక్షలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేయడం టిడిపి పాలక వర్గానికే దక్కింది. ఈ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టరు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అని ఆ పార్టీ నేతలే సెలవివ్వడం గమనార్హం.

**బీసీ నేతలున్న చోటుకే దారి మళ్ళుతున్న నిధులు...**

బందరు ఎంపి గా, బందరు శాసన సభ్యులుగా, వెనుకబడిన తరగతులకు చెందిన కొనకళ్ళ నారాయణరావు, కొల్లు రవీంద్రలు వున్న విషయం తెలిసిందే. అలాంటిది ఇక్కడ ఎక్కువగా ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళిస్తున్నట్లు దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. మండలంలో కూడా అదే పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. ఎంపిపిగా కాగిత వెంకటేశ్వరావు, జడ్‌పిటిసి సభ్యులుగా లంకె నారాయణప్రసాద్‌లు ప్రాతినిధ్యం వహిస్తుంటే తపసిపూడి గ్రామం ఎస్సీ కాలనీలో నిర్మించ వలసిన తుఫాను షెల్టర్‌ను ఏకంగా మంగినపూడి గ్రామంలో నిర్మించడానికి పనులు ప్రారంభించినట్లు సమాచారం. ఇలా చెప్పుకుంటూ పోతే సబ్‌ప్లాన్ నిధులు 6కోట్ల రూపాయలలో సగభాగం ఎస్సీల నివాస ప్రాంతాలకు దూరంగా ఖర్చు చేసినట్లు దళిత సంఘాల సర్వేలో తేలిందని సదరు నేతలు మండిపడుతున్నారు.

**చోద్యం చూస్తున్న టీడీపీ ఎస్సీ విభాగం నేతలు...**

ఎమ్మెల్యే, మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి సమస్యను తీసుకెళ్ళి పరిష్కరించాల్సిన టిడిపి ఎస్సీ విభాగం నేతలు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. తమకంటే అబాధ్యత ప్రతిపక్షాలకు ఎక్కువగా వుందంటూ తప్పించుకొన చూస్తున్నట్లు దళిత సంఘ నేతల ద్వారా తెలుస్తుంది. నామినేటెడ్ పదవుల కోసం పోటీపడే నేతలు ఈ అంశాన్ని చూసిచూడనట్లు వదిలేస్తున్నారంటూ దళితులు శాపనార్థాలు పెడుతున్నారు. ఎస్సీల పట్ల ఏమాత్రం గౌరవం లేకపోవడం వలన స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించు కోవడం లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

**కనిపిస్తున్నా పట్టించుకోని ప్రతిపక్షాలు...**

ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎస్సీ ఓట్లు పెట్టని కోట. అలాంటిది ఆవర్గాలకు అన్యాయం జరుగుతున్నా, సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్ళుతున్నా ఏమాత్రం పట్టించుకోక పోవడం శోచనీయం. పోర్టు భూములు, స్టేడియం భూములపై పదేపదే రోడ్డెక్కుతున్న వైసిపి నేతలకు ఈ సమస్య ఎందుకు పట్టడం లేదని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఎస్సీ నిధులు దారి మళ్ళించడంలో ఇద్దరిది ఒకే బాట అని అర్థం చేసుకోవలసి వస్తుంది అని దళిత నేతలు భగ్గుమంటున్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు, టిడిపి ఎస్సీ విభాగం నేతలు కళ్ళు తెరచి అడ్డుకోక పోతే భవిష్యత్తులో ఎస్సీ వర్గాల నుంచి చీత్కారాలు, ప్రతిఘటనలు ఎరుర్కొనక తప్పదు.

# కొల్లు ఫౌండేషన్ నిర్వహిస్తున్న "యువ కెరటాలు 2017"

**రాజధాని ప్రతినిధి - మచిలీపట్నం :** కొల్లు ఫౌండేషన్ నిర్వహిస్తున్న "యువ కెరటాలు 2017" కార్యక్రమాన్ని హిందూ కళాశాల గ్రౌండ్స్ లో శనివారం సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కెవి చౌదరి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చౌదరి మాట్లాడుతూ యువతను ఒక వేదిక పైకి తీసుకువచ్చి వారి ఆలోచనలను, సూచనలను ఆప్రాంత అభివృద్ధిలో భాగం చేయడానికి, యువతలో స్ఫూర్తి నింపేందుకు ఈ కార్యక్రమం చేపట్టినందుకు కొల్లు ఫౌండేషన్ అధినేత రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను అభినందించారు. ఇది ఒక విన్నూతమైన ఆలోచన ప్రయోగం అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించటం ద్వారా వారిలోని ప్రతిభ, నైపుణ్యం వెలికితీయడానికి దోహదపడుతుందన్నారు. మచిలీపట్నం ఒక పురాతన చారిత్రాత్మక పట్టణమని, ఇక్కడ ఉన్న కలక్టరేట్, జిల్లాకోర్టు భవనాలు ఈ ప్రాంత వారసత్వ సంపద అన్నారు. ఆంధ్రాబ్యాంకు, ఆంధ్రలక్ష్మీ భీమా కంపెనీలు ఇక్కడ పుట్టాయని అన్నారు. కళా రంగంలో, పత్రికా రంగంలో ప్రసిద్ధి గాంచిన పట్టాభి సీతారామయ్య, ముట్నూరు కృష్ణారావు వంటి మహనీయులను గుర్తుకు తెచ్చుకుని స్ఫూర్తి పొందాలని యువతకు సూచించారు. యువత ఉన్నత ఆశయాలు, కోరికలు కలిగి ఉండి వాటిని సాధించుటకు అవసరమైన విద్య, విజ్ఞానం సముపార్జనకు కృషి చేస్తే వారి ఆసయాలు, కోరికలు నెరవేరతాయన్నారు. యువకెరటాలు కార్యక్రమం యువతలో స్ఫూర్తి నింపుతుందని, ఆ ప్రాంతం కాకుండా జిల్లా స్థాయిలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించి యువతకు స్ఫూర్తి దాయకంగా నిలవాలని నిర్వాహకులకు సూచించారు. విశిష్ఠ అతిథిగా పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ "బందరు యువత బంగారు భవిత" నినాదంతో యువ కెరటాలు కార్యక్రమాన్ని గత 3 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. యువతకు చక్కని దశ, దిశ నిర్ధేశించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, యువత బంగారు భవిష్యత్తుకు ఇదొక వేదిక కావాలన్నారు. ఎంతో కాలంగా నిర్లక్ష్యం కాబడిన బందరు అభివృద్ధి కొరకు, బందరు పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం మడ ఏర్పాటు చేసిందన్నారు. 5కోట్లతో మంగినపూడి బీచ్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు, 26కోట్లతో బీచ్ రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. విశాఖ-చెన్నై కారిడార్ అభివృద్ధిలో మచిలీపట్నం చేరటం సంతోషదాయకం అన్నారు. ఉద్యోగం, ఉపాది అవకాశాలకోసం ఈ ప్రాంతం నుండి యువత వలస వెళ్ళే పరిస్థితిని అధిగమించి పరిశ్రమలు, పోర్టు, టూరిజం అభివృద్ధి ద్వారా ఇక్కడే ఉపాది అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు.

పెడన శాసన సభ్యులు కాగిత వెంకట్రావు మాట్లాడుతూ యువతలో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపి వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు యువకెరటాలు చక్కని వేదిక అన్నారు. బందరు నియోజక వర్గంలో 1,000 కోట్ల రూ. అభివృద్ధి పనులు చేసిన మంత్రి కొల్లు రవీంద్రను అభినందించారు. మడ విసి వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ యువత మానసిక ఉల్లాసానికి, వికాశానికి యువకెరటాలు కార్యక్రమం దోహద పడుతుందని, స్వామి వివేకానంద స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకుని దానిని సాధించే వరకు విశ్రమించ వద్దని వివేకానంద కొటేషన్ అన్నారు.

ఎస్‌బిఐ, ఎస్‌బిహెచ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, ఆంధ్రాబ్యాంకు, సిండికెట్ బ్యాంకు తదితర బ్యాంకులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి కొల్లు రవీంద్ర మరియు సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ చౌదరి ప్రారంభించి, నగదు రహిత విధానాలు పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా బిసి సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖలు కూడా స్టాల్స్ ఏర్పాటు చేశారు.

కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. వివిధ కళాశాలలు, పాఠశాలలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాబాప్రసాద్, జడ్‌పిటిసి లంకె నారాయణ ప్రసాద్, ఎంపిపి. కాగిత వెంకట్రావు, ఆర్‌డిఒ సాయిబాబు, మాజీ మంత్రి నడకుదుటి నరసింహారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యన్నారాయణ, జిల్లా టిడిపి అధ్యక్షులు బచ్చుల అర్జునుడు, పార్టీ నాయకులు గొర్రిపాటి గోపిచంద్, కొనకళ్ళ జగన్నాథరావు, బూరగడ్డ రమేష్ నాయుడు, ఇలియాజ్ పాషా, తలాది సోమశేఖర్, పల్లపాటి సుబ్రమణ్యం, హరిబాబు, నరేంద్ర పాల్గొన్నారు.

# జిల్లాపరిషత్‌లో జరిగిన సర్వసభ్య సమావేశం

**రాజధాని ప్రతినిధి - మచిలీపట్నం :** శుక్రవారం కృష్ణా జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం జిల్లా పరిషత్ హాలులో జిల్లాపరిషత్ చైర్ పర్సన్ గద్దె అనురాధ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ అనురాధ మాట్లాడుతూ 160కోట్ల వ్యయంతో అమరావతి విమానాశ్రమం ఆధునిక హంగులతో నూతన టెర్మినల్ ప్రారంభించుకున్నామని, ఇందుకు భూసమీకరణలో విశేష కృషి చేసిన గన్నవరం శాసన సభ్యులు వల్లభనేని వంశీకి జిల్లాపరిషత్ తరుపున అభినందనలు తెలిపారు. కృష్ణాజిల్లా లో అత్యధిక సోలార్ పంపుసెట్లు ఏర్పాటు,నగదు రహిత పిడిఎస్ విధానం జిల్లాలో అమలు చేసి కోట్లాది రూ. ఆదా చేసి కేంద్రం నుండి అవార్డు తీసుకున్న కలెక్టర్ బాబుకు అభినందనలు తెలిపారు. ఎన్ఆర్ఐ తెలుగు సొసైటీ వారు 50కోట్లతో 75 పరిశ్రమలు ఏర్పాటు చేయుటకు ముందుకు రావడం ముదావహం అన్నారు. మహిళ, శిశు అభివృద్ధి కోసం సఖి అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నదని అన్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ భవనాలకు జిల్లాలో శంకుస్థాపన చేసుకున్నామని, పుష్కరాలు, వరద, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వీరి సేవలు మరువలేనివని అన్నారు. అంగలూరుకు చెందిన త్రిపురనేని హనుమాన్ చౌదరికి పద్మశ్రీ పురస్కారం జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ప్రముఖ విద్యావేత్త ముఖ్యంగా మహిళల విధ్యకు కృషి చేసి పద్మశ్రీ పొందిన వి. కోటేశ్వరమ్మను అభినందించారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించి గ్రామీణ నీటిసరఫరా, ఉపాదిహామీ, పిఆర్ రహదారులు తదితర అంశాలపై చర్చ జరిగింది. జిల్లాలో అంగన్‌వాడి అద్దె భవనాల్లో ఉంటున్న వివరాలు ఇస్తే సొంత భవన కల నెరవేర్చడానికి కృషి చేస్తామని సభ్యులకు సూచించారు. మండలాల్లో ఉపాదిహామీ పనులులో జాప్యం జరుగకుండా ఎక్కువ మందికి ఉపాది కల్పించాలని సభ్యులు కోరగా కలెక్టర్ ఉపాదిహామీ పథకం క్రింద 5వేల కోట్లరూ. మేర పనులు చేయాలనే లక్ష్యంతో ఉన్నదని గత 2 ఏళ్లలో జిల్లాలో 550 కి.మి. సిసి రోడ్లు ఈ పథకం క్రింద నిర్మించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. 120కోట్లతో పుష్కరాలకు సంబంధించి ఉపాదిహామీ పనులు చేసామన్నారు. సభ్యులు ప్రతిపాదించిన పనులన్ని చేపట్టడానికి 96కోట్ల రూ. ఖర్చు అవుతుందన్నారు. ఘంటసాల మండలంలో శిధిలావస్థలో ఉన్న పంచాయితీ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలని, గ్రామంలో వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. వేసవిలో నీటి ఎద్దడి నివారించడానికి రామరాజు ఛానల్ క్రింద ఉన్న త్రాగునీటి చెరువు నింపాలని పెడన శాసన సభ్యులు కాగిత వెంకట్రావు తెలిపారు. నూజివీడు ఏరియాలో 70 ఎకరాల మామిడిసాగు జరుగుతుందని, నీటికొరత కారణంగా పూత రాలిపోతుందని సభ్యులు కోరగా కలెక్టర్ సమాధానంగా మామిడి రైతులందరూ పాంపాడ్స్ తప్పక ఏర్పాటు చేసుకుంటే నీటిఎద్దడి నివారణ జరుగుతుందన్నారు. జడ్‌పిటిసి తాతినేని పద్మావతి ఒకే ప్రశ్న పలుమార్లు అడగటం వలన సభలో గొడవ పడవద్దని, అజెండా లో ఉన్న అంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడగాలని, సభాసమయాన్ని వినియోగించుకోవాలని చైర్‌పర్సన్ సభ్యులకు సూచించారు. పోరంబోకు స్థలాలు, కాల్వగట్లు, చెరువుగట్లుపై నివసిడే కాలనీవాసులకు ప్రభుత్వం కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. సంవత్సరం రెండు నెలల్లో జిల్లాలో 76వేల మరుగుదొడ్లు నిర్మించి 116.30కోట్లరూ. చెల్లింపులు చేసి చరిత్రలో నిలిచామని, 50వేల మరుగుదొడ్లు నిర్మించ వలసి ఉండగా 18వేలు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలకు కేంద్రం నిదులు అందించనున్నదని తెలియజేశారు.



జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జిల్లాపరిషత్ చైర్ పర్సన్

గన్నవరం శాసన సభ్యులు వల్లభనేని వంశీమోహన్ మాట్లాడుతూ పౌరసరఫరాల అంశంలో ఆధార్ అనుసంధానం అయిన వేలిముద్రలు పడని వారికి థర్డ్‌పార్టీ అథంటికేషన్ ఇవ్వాలని తెలుపగా కలెక్టర్ మాట్లాడుతూ అసలైన లబ్ధిదారులకు నిత్యావసర సరఫరా అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆధార్ అనుసంధానం చేసి, బయోమెట్రిక్ నగదు రహిత విధానం అమలు చేస్తుందన్నారు. 2017 జూన్ నాటికి అన్ని రాష్ట్రాలలో ఈ విధానం అమలులోకి కేంద్రప్రభుత్వం తీసుకురానున్నదని తెలిపారు. భూమి సిస్తులు, నీటిపన్నులు చెల్లింపులు మీసేవ ద్వారా మరియు బ్యాంక్ కరస్పాండెంట్ల ద్వారా చెల్లించే సౌకర్యం ఉందని, జిల్లాలో 1000 మంది బ్యాంక్ కరస్పాండెంట్స్‌గా సేవలు అందిస్తున్నారని, వీరికి అదనంగా 300 మందిని నియమించనున్నట్లు తెలిపారు. ఆస్తుల పరిరక్షణలో భాగంగా ఆస్తుల సర్వేలో తహసీల్దారులు సహకరించాలని చైర్‌పర్సన్ సూచించగా కలెక్టర్ భారీ ప్రాజెక్టుల నిర్మాణాలు జరుగుతున్నాందున సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. 2016-17 సవరణ బడ్జెట్ అంచనాలు, 2017-18 అంచనాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయితీరాజ్ శాఖ, జిల్లాపరిషత్ డైరీ 2017, క్యాలండర్లను కలెక్టర్ బాబు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ అనురాధ, శాసన సభ్యులు వల్లభనేని వంశీ మోహన్ లాంఛనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సభలో తంగిరాల సౌమ్య, ఉప్పలేటి కల్పన, జడ్‌సి వైస్ చైర్మన్ శాయిన పుష్పావతి, జడ్‌పిటిసి సభ్యులు, జిల్లాపరిషత్ సిఇఒ దామోదర నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయం .. వైఫల్యం

**అందరికీ అన్నంపెట్టే అన్నదాత.. అన్ని రకాలుగా మునిగిపోతున్నాడు. రైతన్నను ఆడుకోవాల్సిన వ్యవసాయశాఖ. అనుబంధ శాఖలు అన్ని రకాలుగా వైఫల్యం చెందుతున్నాయి. రైతుల ఆదాయాన్ని పెంచ డానికి చేస్తున్న కృషి కాగితాలకే పరిమిత మవుతోంది. భూసార పరీక్షల నుంచి వ్యవసాయో త్పత్తుల అమ్మకాల వరకు వివిధ వ్యవసాయ అనుబంధ విభాగాల్లో దళారుల పాత్ర పెరిగింది. కల్తీలు, నకిలీ లను అరి కట్టాల్సిన యంత్రాంగం వ్యాపారులిచ్చే కాసులకు కక్కుర్తిపడి రైతుల ఉసురు తీస్తున్నారనే ఆరోపణలున్నాయి.**

**రాజధాని ప్రతినిధి ,(గుంటూరు) :** జిల్లాలో వ్యవసాయ అనుబంధ విభాగాలు సమన్వయంగా పని చేసి రైతుల ఆదాయాన్ని పెంచడానికి చేస్తున్న కృషి కాగితాలకే పరిమిత మవుతోంది. భూసార పరీక్షల నుంచి వ్యవసాయోత్పత్తుల అమ్మకాల వరకు వివిధ వ్యవసాయ అనుబంధ విభాగాల్లో దళారుల పాత్ర పెరిగింది. ఆయా శాఖలను సమన్వయ పర్చాల్సిన వ్యవసాయ విభాగం పూర్తిగా వైఫల్యం చెందింది. ఖరీఫ్‌కు ముందే విత్తనాల సరఫరా, రైతులు సాగు చేసే పంటలను తెలుసుకుని దానికి అను గుణంగా నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో వివిధ రకాల పంటల సమస్యలను పరిష్కరించి రైతులకు సహకాలంలో సలహాలు ఇవ్వడానికి పంటల స్థిరీకరణ కమిటీలు పడకేశాయి. అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులను ఉపయోగిస్తున్నా వ్యవసాయ, అనుబంధ శాఖలు రైతుల్లో అవగాహన కల్పించలేకపోతున్నాయి. ఆహా రోత్పత్తుల్లో విషతుల్యాలు చేరి మన పంటలకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గిపోతోంది.

### భూసారం .. నిస్సారం

భూసారి పరీక్షలు చేసి లోపాలను సవరించడానికి ప్రభుత్వం ఖరీఫ్‌కు ముందే ప్రత్యేక ప్రణాళిక తయారు చేసింది. అయితే మట్టినమూనాల ఫలితాలను ఖరీఫ్‌లో పంటలు వేసిన తరువాత కూడా జిల్లాలో వ్యవసాయశాఖ పంపిణీ చేయలేకపోయింది.

### విడుదల కాని వార్షిక ప్రణాళిక



జిల్లా, రాష్ట్రస్థాయిలో ఖరీఫ్, రబీల్లో వ్యవసాయోత్పత్తులు, సాగు విస్తీర్ణం, ఇతర అంశాలపై ప్రతి ఏటా వార్షిక ప్రణాళికను విడుదల చేసినా ఇంతవరకు విడుదల చేయలేదు.

### అందని పరపతి...

రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు చట్టభద్రత కల్పించి బ్యాంకు ద్వారా పంట రుణాలు ఇప్పించడానికి 4-5 ఏళ్ల క్రితం గుర్తింపు కార్డులను ప్రవేశ పెట్టింది. ఖరీఫ్‌కు ముందే వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి కౌలు రైతులను గుర్తించాలి. వీరికి రెవెన్యూ శాఖ ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలి. అయితే జిల్లాలో ఇలా ఎక్కడా జరగడంలేదు.

### సమన్వయం లోపం

జిల్లాలో వ్యవసాయ అనుబంధ శాఖలు సమన్వయంగా పని చేసిన సందర్భాలు లేవు. మిరపలో విత్తనాలు నకిలీవైతే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. పంట దెబ్బ తింటే ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలి. రైతులు వీరిని గుర్తించి తమ సమస్య లను తెలిపి పరిష్కారాలు తెలుసుకునే అవకాశం రావడం లేదు. క్షేత్రస్థాయిలో నీటిపారుదల శాఖ అధికారులది మరో దారిగా ఉంది. మర మ్మతులు నీరు విడుదల చేసే ముందు చేపట్టి బిల్లులు చేసుకుంటున్నారు. భూగర్భ జలవనరుల పరిశీలించి బోర్ల ద్వారా సేద్యాన్ని ప్రోత్సహించే ప్రక్రియ జిల్లాలో ఇంత వరకు చేపట్టలేదు. ఎత్తిపోతల పథకాలు సిద్ధమైనా వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేవారు లేరు.కొంత మంది సొసైటీ అధ్యక్షులు ఎరువులు అమ్మి మార్కెఫెడ్‌కు నగదు చెల్లించకుండా సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

### పైసలిస్తేనే పరికరాలు

జిల్లాలో ఆధునిక వ్యవసాయ పరికరాలు పైసలిస్తేనే రైతులకు అందుతున్నాయి. డబ్బులి వ్వకపోతే వారి పేర్లు ఆన్‌లైన్‌లో లేవని, నిధుల కొరత ఉన్నట్లు కొర్రీలు వేస్తున్నారు. వరి కోత యంత్రాలకు సుమారు రూ.15లక్షల నుంచి రూ.20 లక్షల సబ్సిడీ ఉంది. అధికారులకు రూ.2 లక్షలిస్తేనే వరి కోత యంత్రం ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని సగ భాగం ఉద్యాన పంటలుఎ రైతులకు ఇంత వరకు తైవాన్ స్ప్రేయర్లు అందలేదు.

### ఆహ్వానం కొందరికే

లాం వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖలు భేటీ కానున్నాయి. అయితే బ్యాంకులు,సహకార సంఘాలు, మార్కెటింగ్,ఫిషరీస్, సెరీకల్చర్, స్పైసెస్ బోర్డు, సీడ్స్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, భూగర్భ జలవనరులు, ట్రాన్స్‌కో, చిన్న నీటిపారుదల విభాగం వంటి ప్రధాన శాఖలను సమన్వయ కమిటీ సమావేశానికి ఆహ్వానించలేదు. వ్యవసాయశాఖ రాష్ట్ర డైరెక్టర్ ధనుంజయరెడ్డి.ఫిబ్రవరి 4న రాష్ట్రస్థాయిలో వివిధ శాఖలతో సమావేశం కానున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ జేడీ కృపాదాసు కేవలం 4-5 శాఖలతో చర్చించి 2017-18 వార్షిక ప్రణాళికను రూపొందించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు.

## డిజిటల్ స్ట్రెస్



కంప్యూటర్లకు అతుక్కుపోయే ఉద్యోగాలు చేసేవారికి మెడ, వెన్ను నొప్పి, తలనొప్పి రావటం చెప్పనక్కర్లేదు. వీటితో పాటు కళ్ల ఎక్కువగా డిజిటల్ స్ట్రెస్‌కు గురవుతున్నాయని తాజా సర్వే చెబుతోంది. ఆఫీసులో కంప్యూటర్‌లో సావాసం చేస్తూ, ఇంటికొచ్చాక కూడా ల్యాప్ టాప్, ట్యాబ్లెట్‌లను ఉపయోగించే శాతం ఎక్కువే. వీటికంటే ఎక్కువ శాతం స్మార్ట్‌ఫోన్‌కి అడిక్ట్ అవుతున్నారు. దీని వల్ల కళ దెబ్బతింటాయని నిపుణులు అంటున్నారు.మనదేశంలో ప్రతీ పది మంది యువతలో తొమ్మిది మంది రోజుకు సగటున కనీసం రెండు గంటలపాటు స్మార్ట్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారట, మొత్తానికి ఉద్యోగుల విషయానికొస్తే ఐటీ నిపుణులు మాత్రం మిగతావారికంటే, రోజుకు పదిగంటలకిపైగా సమయాన్ని కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, ఫోన్లతోనే గడుపుతున్నారట. అందుకే కళ్ల డాక్టర్ల దగ్గరకు వెళ్లేవారిలో 80 శాతం మంది ఐటీ నిపుణులే ఉంటున్నారట. ప్రపంచంలో 37 మిలియన్ల మంది అంధులుంటే మన దేశంలోనే 15 మిలియన్ల మంది ఉన్నారట. దీంతోపాటు కంటిసమస్యలతో బాధపడేవారి సంఖ్యా నానాటికీ అధికమవుతున్నాయి. అందుకే వీలైనంత వరకూ కళ్లను అతిగా డిజిటల్ స్ట్రెయిన్‌కి గురిచేయొద్దని నిపుణులు చెబుతున్నారు.

## పక్షవాతం రావడానికి ముందు..



మధుమేహం గుండెపోటుకు ఎంత కారణమో, పక్షవాతానికీ అంతే కారణమవుతుంది. అయితే, మధుమేహంతో వచ్చిన మరో కారణంగా వచ్చినా, పక్షవాతానికి అత్యవసర చికిత్సలు అవసరమవుతాయి. కాకపోతే, పక్షవాతం రాబోతున్న తాలూకు హెచ్చరికలు కాస్త ముందుగానే కనిపిస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా ఈ హెచ్చరికకలకు వెంటనే స్పందిస్తే, పక్షవాతం బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. మొదట్లో కనిపించే హెచ్చరికలు కొద్ది క్షణాలే ఉండి మళ్లీ మామూలైపోతుంది. కాక పోతే ఈ లక్షణాలు శరీరంలోని ఏ భాగంలో కనిపిస్తున్నాయి అనేదాని మీద సమస్య తీవ్రత ఆధారపడి ఉంటుంది. లక్షణాలు ఏభాగంలో కనిపించినా తక్షణమే తగుచర్యలు తీసుకోవాలి. ఇంతకూ పక్షవాత లక్షణాలు ఏమిటంటే..

- శరీరంలోని ఏదో ఒక వైపున ముఖం లేదా, భుజం, కాలు, చేయి, ఇలా ఏదో ఒక బాగం మెద్దుబారినట్లు లేదా బలహీతనంగా మారి నట్లు అనిపించడం.
- మాట్లాడటంలో ఇబ్బంది, మాటల్ని, చిన్న చిన్న వాక్యాల్ని కూడా అర్థం చేసుకోలేకపోవడం.
- దృష్టి మసకబీరడం, ఒక కంట్లోగానీ, రెండు కళ్లల్లోగానీ చూపు తగ్గిపోవడం
- మింగడంలో హఠాత్తుగా ఇబ్బంది ఏర్పడటం
- మగతగా ఉండడం, స్థిరంగా నిలబడలేకపోవడం, శరీరంలోని అవయవాలు ఒక దానికి ఒకటి సమన్వయంగా పనిచేయకపోవడం
- స్పృహ కోల్పోతున్నట్లు అనిపించడం
- శరీరాన్ని పాక్షికంగా అంటే ఏదో భాగాన్ని కదిలించలేకపోవడం
- కారణమేమిటో చెప్పలేని, తీవ్రమైన తలనొప్పి ఈ లక్షణాల్లో ఏదో ఒకటి గానీ, అంతకన్నా ఎక్కువ లక్షణాలు గానీ వచ్చి ఆ వెనువెంటనే మాయమైపోవచ్చు. రక్త ప్రసరవుతాయి. ఈ స్థితిలో వెంటనే తగిన చికిత్స తీసుకుంటే మెదడుకు దీర్ఘకాలిక నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు.

## గుణదల మాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు ప్రారంభం



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** నగరంలో ఫిబ్రవరి 9,10,11 తేదీల్లో నిర్వహించనున్న గుణదలమాత మహోత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు జరిపే నవదిన ప్రార్ధనలు మంగళవారం సాయంత్రం గుణదల పుణక్షేత్రంలో అత్యంత శక్తి ప్రపత్తులతో ప్రారంభమయ్యాయి. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, మోన్స్‌గ్నోర్ మువ్వల ప్రసాద్ ఎం. గాబ్రియేల్, ఎస్ఎస్‌సి డైరెక్టర్ ఫాదర్ వసల తోమస్ తదితరులు గణదల పుణ్యక్షేత్రం ప్రధాన ఆలయం వద్ద మరియమాత పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషన్ తెలగతోటి జోసఫ్ రాజారావు భక్తులకు సందేశమిస్తూ మరియమాత తన కుమారుడైన ఏ సుక్రీస్తును పాపుల రక్షణకై ఈ లోకానికి పంపారని. ఆమెకు గౌవించి, వేడుకుంటే దేవుని అనుగ్రహాలు తప్పక లభిస్తాయన్నారు. అనంతరం బిషన్‌తోపాటు గురువులు, మఠ కన్యలు, భక్తులు కొవ్వొత్తులు చేతబూని, జపమాలను జపిస్తూ పెద్ద సంఖ్యలో గుణదల కొండపై గుహలోగల మరియమాత విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. తొలిరోజు ప్రార్ధనల్లో వేలాది భక్తులు పాల్గొన్నారు. ఫాదర్ సింహరాయలు, అంతోని, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలకు షాక్ ..!

**న్యూఢిల్లీ :** రాజకీయ పార్టీలకు కేంద్ర బడ్జెట్ షాక్ ఇచ్చింది. రాజకీయ పార్టీల నిధుల సేకరణలో మరింత పారదర్శకతను పెంచే లక్ష్యంతో విరాళాలపై పరిమితులు విధించింది. పార్టీలు రెండు వేల రూపాయల వరకు మాత్రమే నగదు రూపంలో విరాళాలను నగదు రూపంలో కాకుండా చెక్కులు, ఆన్‌లైన్ లేదా డిజిటల్ రూపంలో మాత్రమే తిసుకోవాలని, వాటి వివరాలు వెల్లడించాలని తేల్చిచెప్పారు. కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖకు భారత ఎన్నికల రాజకీయ పార్టీలన్నీ తమ విరాళాలపై ఎప్పటికప్పుడు ఆదాయపన్ను రిటర్న్‌లు దాఖలు చేయాలని జైట్లీ సూచించారు. ఈ 11 ఏళ్ల కాలంలో జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలా మొత్తం ఆదాయంలో 69 శాతం గుర్తు తెలియని వృక్తులేయ లేదా సంస్థల నుంచి లభించినట్టు ఆ నివేదిక తెలిపింది.

## ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**తూర్పుగోదావరి :** ముమ్మిడివరం నియోజకవర్గం ఐ.పోలవరం మండలం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక రాజా స్టూడియో ఆవరణలో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికకు కోనసీమ అసోసియేషన్ గౌరవా ధ్యక్షుడు ఈసకోను గురు అధ్యక్షతన జరిగింది. గౌరవాధ్యక్షుడిగా నంబు సత్యనా రాయణ, అధ్యక్షుడిగా యువివి.కృష్ణ, ఉపాధ్య క్షుడిగా రాయుడు ధనబాబు, కార్యదర్శిగా పి.ఎనివాసరావు, అదనపు కార్యదర్శిగా పి.సత్యకుమార్, కోశాధికారిగా ఎస్.రమణ ఎన్నికయ్యారు. అమలాపురం జోన్ కన్వీనర్‌గా పివిఎస్ఎన్.రాజును ఎన్నుక న్నారు. పొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఖ్వాజా బాబు, సిహెచ్.నరేష్, దురాప్రసాద్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ చెల్లింపుల విధానం అతిపెద్ద సాంకేతిక విప్లవం

### రాష్ట్రపతి ప్రణబ్



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించే బయోమెట్రిక్ ఆధార్ చెల్లింపుల విధానం ఒక సాంకేతిక విప్లవంగా గుర్తింపు తెచ్చుకుంటుందని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అన్నారు. పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశంలో అతి తక్కువ రోజుల్లో ప్రారంభించిన 'భారత్ ఇంటల్ ఫేస్ ఫర్‌మనీ' (భీమ్) మొబైల్ చెల్లింపుల యాప్‌కు అధిక ప్రజాదరణ లభించిందని, పేదల ఆర్థిక స్వావలంబనను ఆకాంక్షించిన డాక్టర్ భీంరావ్ అంబేద్కర్‌కు ఈ యాప్ సాధించిన విజయం గొప్ప నివాళిగా ఆయన అభివర్ణించారు. దేశీయంగా రూపొందించిన భీమ్ యాప్‌ను 2016 డిసెంబరు 30న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. మొబైల్ ఫోన్‌ల ద్వారా వేగంగా సురక్షితంగా నగదు రహిత లావాదేవీలకు ఈ యాప్ తోడ్పడుతుంది. జనవరి 15 నాటికే సుమారు 1.1 కోట్ల మందికి పైగా ఈ యాపను డౌన్‌లోడ్‌లు చేసుకున్నారు. బయోమెట్రిక్ ఆధార్ చెల్లింపుల విధానం త్వరలో అమలులోకి వస్తుందని, దీనికి సంబంధించి 14 బ్యాంకులు ముందుకు వచ్చాయన్నారు.

ప్రజలు ఆధార్ నంబరు. బయోమెట్రిక్ విధానం ద్వారా నగదు చెల్లింపులు జరుపుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. డిజిధన్ అభియాన్‌కు తోడు రెండు లక్షల కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఐదు లక్షల మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, డిజిటల్ లిటరసీ (డిజిటల్ అక్షరాస్యత)ని పెంపొందిస్తామన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను నిరుపేదల ముంగిటకు తీసుకువెళ్లే లక్ష్యంతో ఇండియన్ పోస్టల్ పేమెంటు బ్యాంక్‌ను ప్రారంభించామని ఆయన వెల్లడించారు.దేశవ్యాప్తంగా 1.5 లక్షల పోస్ట్ ఆఫీసులు పోస్టల్ బ్యాంకులుగా పనిచేస్తాయని,2.5 లక్షలకు పైగా ఉన్న గ్రామ్ డాక్ సేవక్‌లు బ్యాంకింగ్ ప్రతినిధులుగా వ్యవహరిస్తారని తెలిపారు. రూ.490 కోట్లతో జాతీయ ఎస్‌సీ/ ఎస్‌టీ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రపతి ప్రసంగిస్తున్న సమయంలో పలువురు ఎంపీలు తమ సెల్‌ఫోన్లతో ఫోటోలు క్లిక్ చేస్తుండగా, సీతారాం ఏచూరి(సీపీఐ - ఎం), ఆనంద్ శర్మ(కాంగ్రెస్), రామ్‌గోపాల్ యాదవ్ (ఎస్‌పి) తీవ్రంగా చర్చిస్తూ కనిపించారు.

## రైతులకు న్యాయం చేస్తా: సీఎం

- పోలవరం డయాఫ్రమ్ పనులు ప్రారంభం
- పురుషోత్తపట్నం పథకంపై అధికారులతో సమీక్ష



పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పనులను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

**రాజధాని ప్రతినిధి ,(ఏలూరు) :** పోలవరం ప్రాజెక్టుకు డయాఫ్రమ్ వాల్ గుండెకాయ వంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన పోలవరం ప్రాంతంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ ప్రాజెక్టుకు కీలకమైన డయాఫ్రమ్‌వాల్‌తో పాటు స్పిల్‌వే వద్ద ఏర్పాటు చేసిన 48 గేట్లకు సంబంధించిన నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. చంద్రబాబు మాట్లాడుతూ ప్రత్యేక జర్మని టెక్నాలజీతో దీనిని తయారుచేస్తున్నట్టు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు ఇదేనని, భవిష్యత్తు తతరాలకు చాలా కీలకమైన ప్రాజెక్టుగా ఇది మారబోతోందని ఆయన అన్నారు. అవసరమైతే 10 రూపాయలు ఎక్కువే ఇస్తాంగానీ పోలవరం కోసం త్యాగం చేసిన రైతులకు అన్యాయం చేయబోమని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్టు తొలి లబ్ధిదారులు గోదావరి జిల్లా వాసులేనన్నారు. ఎన్ని అడ్డంగులు ఎదురైనా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతామన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు విమర్శలు చేయడాన్ని మానుకోవాలని సూచించారు. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని అక్రమంగా ఆస్తులు సంపాదించిన వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నేడు కోర్టుల చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. పెదవేగి మండలంలోని 7గ్రామాలకు సాగునీరు అందడంలేదని ముఖ్యమంత్రి కొంతమంది రైతులు తెలుపగా వెంటనే ఆయా గ్రామాలకు సాగునీరు అందేలా చూస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు తర్వాత ఉభయ గోదావరి జిల్లాల్లో సాగునీరు, త్రాగునీరుకు ఇబ్బందులు లేవని పంటలు బాగా పండుతున్నాయని చెప్పారు. వాగులు, వంకలపై చెక్ డ్యామ్‌ల ద్వారా ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలు పెంచుకోవాలని రైతులకు సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా ఉత్పత్తులు ఫిలిప్పీన్స్‌కి ఎగుమతి అవుతున్నాయని చంద్రబాబు తెలిపారు.

**డిజైన్ కారణంగా జాప్యం కుదరదు :** డిజైన్ కారణంగా పోలవరం పనులను ఆలస్యం చేస్తే కుదరదని, నిర్దేశిత కాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని సంబంధిత అధికారులను చంద్రబాబు హెచ్చరించారు. పోలవరం కాపర్‌డ్యామ్ డిజైన్లకు వారం రోజుల్లోగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. స్పిల్‌వే ఛానల్ నిర్మాణ పనులు ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలని అవసరమైతే మిషనరీలను పెంచాలన్నారు. పవర్ హౌస్, అప్రోచ్ ఛానల్, పైలెట్ ఛానల్ పనుల లక్ష్యాన్ని పూర్తిచేయాలని, పవర్ హౌస్ నిర్మాణ పనులను మే నాటికి ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు అన్ని సౌకర్యాలతో ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. పురుషోత్తపల్నం పథకంపై సమీక్ష : తూర్పుగోదావరి జిల్లాలో రూ.1638 కోట్లతో చేపట్టిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రాజెక్టు మొదటి దశలో 3500 క్యూసెక్కుల గోదావరి జలాలను ఎల్లిపోసేందుకు, రెండో దశలో ఏలేరు రిజర్వాయర్‌కు మళ్ళించటానికి ప్రతిపాదించాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శాఖ కార్యదర్శి శశిభూషణ్, ఈఎంఎం వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టరు కాటంనేని భాస్కర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఆలయాల్లో కాపునేతల పూజలు



**తూర్పుగోదావరి :** మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం పిలుపు మేరకు కాపు నేతల ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లాలో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాపుల పట్ల వ్యవహరిస్తున్న అణచివేత ధోరణి మారాలని కోరుతూ కాపు పెద్దలు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రావులపాలెం, అయినవిల్లి, కాత్రేనికోన, అనాతవరం, అంబాజీపేట, పి.గన్నవరం, రాజోలు, నగరం వంటి ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు, కాపుయువసేన ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల ఇన్‌ఛార్జ్, రాష్ట్రకార్యవర్గ సభ్యుల ఎన్.సురేష్ ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాపులకు ఏ బిసిలతో సంబంధం లేకుండా కాపులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని, కాపుల రిజర్వేషన్ల విషయంలో సిఎం చంద్రబాబు పట్టుదల వైఖరి విడనాడాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాపునాడు, కాపుయువసేన ప్రచార కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు, మురమళ్ళ శివవీరారెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాతికేయ వృత్తి కత్తి మీద సాము



**రాజధాని ప్రతినిధి,కె.వి.రమణ రావు, జంగారెడ్డి గూడెం :** పాత్రికేయ వృత్తి కత్తి మీద సాములాంటిదని, ప్రజా సమస్యలను ప్రతిబింపచేసి, పరిష్కారానికి పాత్రికేయులు ఎంతో సమాజసేవ అందిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. జాంగారెడ్డి గూడెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం పాత్రికేయులును ఘనంగా సన్మానించారు. స్థానిక మండవల్లి ఫిల్లింగ్ స్పేషన్ వద్ద పార్టీ పట్టణ అధ్యక్షులు తాతకుంట్ల రవికుమార్ అధ్యక్షతన గత 30 ఏళ్ళుగా పత్రికారంగంలో విశేష్టసేవలందిస్తున్నా ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు వాసా సత్యనారాయణ, ఏపీ యూ డబ్ల్యూజే సహాయ కార్యదర్శులుగా నియమితులైన కళారి సాయిబాబా, డీవీ ఎల్ స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ధనిశెట్టి భాస్కర్, చిలుకూరి రమేష్‌లను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. పార్టీ సీనియర్ నాయకులు తల్లాడి సత్తిపండు, మండవల్లి సోంబాబు, మాట్లాడుతూ రాబోయే రెండు సంవత్సరాల్లో విలేకరులు సహాయం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియో రిపోర్టర్లు పాల్గొన్నారు.

## విటమిన్-ఎ లోపంతో అల్జీమర్స్



స్త్రీలు ప్రెగ్నెన్సీ సమయంలో ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అంటున్నారు వైద్యులు స్వీట్ పొటాటో, క్యారెట్, ఆకుకూరలు తప్పకుండా తీసుకోవాలని, లేదంటే విటమిన్-ఏ లోపం ఏర్పడి పుట్టబోయే బిడ్డకు మెదడు సరిగ్గా ఎదగక భవిష్యత్తులో అల్జీమర్స్ బారినపడే అవకాశం ఉంటుందని పరిశోధనల్లో తేలింది. యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా పరిశోధకులు విటమిన్-ఏ లోపానికి, అల్జీమర్స్‌కు మధ్యగల సంబంధంపై పరిశోధనలు చేశారు. "గర్భిణిల్లో విటమిన్-ఎ లోపం ఉన్నట్లయితే అదిశిశువు మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. ఆ తరువాత కాలంలో అల్జీమర్స్ రావడానికి కారణం అవుతుంది" అని పరిశోధనకారులు అన్నారు. అయితే అదే సమయంలో గర్భిణులు విటమిన్-ఎ సప్లిమెంట్లు ఎక్కువగా తీసుకోవడం కరెక్ట్ కాదంటున్నారు వైద్యులు. పోషకాహారలోపం లేకుండా బ్యాలెన్స్‌డ్ డైట్ తీసుకుంటే సరిపోతుందని అంటున్నారు. బిడ్డ ఎదుగుదల అన్ని విధాల సరిగ్గా ఉండాలంటే బ్యాలెన్స్‌డ్ డైట్ తీసుకోవడం ఒక్కటే మంచి మార్గమని సూచిస్తున్నారు.

## వచ్చే నెల నుంచి ఉద్దానంకు తాగు నీటి సరఫరా

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతానికి మార్చి 1 నుంచి నూరుశాతం స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ జిల్లాలోని 7 మండలాల పరిధిలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారం దరికీ మంచినీటి సరఫరా జరగాలన్నారు. ఎన్టీఆర్ జలసిరి పథకం అమలు తీరును సచివాలయంలోని తన ఛాంబర్‌లె సీఎం మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్లోరైడ్ ప్రాంతాలను గుర్తించి అక్కడ నూరుశాతం మంచినీటిని సరఫరా చేస్తామన్నారు. అలాగే గనులను తవ్వే ప్రాంతాల్లో కూడా నీరు సరఫరా చేస్తామన్నారు. ప్రజారోగ్యం కంటే డబ్బు ముఖ్యం కాదని, ఎంత ఖర్చయినా వెనుకాడ కుండా మంచినీరు సరఫరా చేస్తామని చెప్పారు.రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక నీటి ఎద్దడి గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. వాటర్ ఆడిటింగ్‌పై కేపీఎంజీ ప్రాజెక్టు రిపోర్టును ఆమోదిస్తున్నట్లు తెలిపారు. వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. జిల్లాల వారీగా జలవనరులపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. అందుబాటులో వున్న రిజర్వాయర్లు, వాటి ద్వారా ఎంతనీరు, ఏఏ ప్రాంతాలను సరఫరా చేస్తున్నారో ఆ వివరాలతో పాటు, ప్రస్తుత నీటి పథకాల స్థితిగతులను పరిశీలించి మ్యాపింగ్‌తో ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎన్టీఆర్ జలసిరి రెండో దశ కోసం రానున్న మూడుళ్లకు లక్షా 20 వేల బోర్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో ఏడాదికి 30వేల గొట్టపు బావులు తవ్వాలని లక్ష్యంగా పెట్టుకొని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు అయ్యన్న పాత్రుడు, కిమిడి మృణాళిని ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 13న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు పరిష్కారాన్ని కోరుతూ ఫిబ్రవరి 13 న అన్ని కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని ఆయా జిల్లాల్లో అప్ గ్రేడెడ్ పోస్టుల భర్తీ, మున్సిపల్ సర్వీసు రూల్స్ సవరణలు, ఎయిడెడ్ టీచర్ల పదోన్నతులు ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

# వేప, తులసీల ఉపయోగం





మొక్క మనిషికి ప్రాణవాయువుని అందిస్తుంది. గాలిలోని కాలుష్యాన్ని తొలగించి గొప్ప ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది. మన చుట్టూ ఉండే మొక్కల్లో ఔషధ గుణాలు ఉన్నవే ఎక్కువ. ఆహారం రూపంలో తీసుకోవడానికి అనువుగా ఉన్నవీ చాలానే ఉన్నాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మనిషి రోగాల బారిన పడే అవకాశాలు చాలావరకూ తగ్గుతాయి. మన ఆరోగ్యం కోసమైనా కొన్ని రకాల ఆకులను ఆహారం రూపంలో తీసుకోవాలి. ఒకప్పుడు రోగాలు, చికిత్సలు, మందులు మాకుల గురించిన మాటలు అంతగా వినిపించేవి కావంటే అతిశయోక్తి లేదు. కారణం అప్పట్లో వారు ఔషధ మొక్కలను ఎక్కువగా పెంచేవారు, తినేవారు. తెగిన గాయాలు, కురుపులు, పుండ్లు లాంటి సమస్యలతో పాటు మలేరియా టైఫాయిడ్ లాంటి జ్వరాలకూ మొక్కలు, ఆకులనే ఉడికించి, శుద్ధి చేసి టాబ్లెట్ల రూపంలోకి తీసుకొచ్చారు. పళ్ళు తోముకునేందుకు ఒకప్పుడు వేప పుల్లలను ఉపయోగించిన విషయం అందరికీ తెలిసిందే. చాలా రకాల చర్మ వ్యాధులకూ వేపాకు మందుగా పనిచేస్తుంది. అలాగే, తులసి కూడా . తులసి ఆకులతో చేసిన టీ చాలా రకాల గొంతు సమస్యలను సమర్థవంతంగా నివారిస్తుంది. ఎన్నో చర్మ వ్యాధులు, గాయాలకు తులసి ఆకులు ముందులా చేస్తాయి. మనం మసాలాల్లో ఉపయోగించే దాల్చిన చెక్క కూడా గొప్ప ఆరోగ్య ప్రదాయిని. చాలా వేగంగా పనిచేస్తుంది. ఇది కూడా రక్తాన్ని శుద్ధి చేస్తుంది. ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. మెంతులు, మెంతకూర ఊపిరితిత్తుల్లోని ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఆరోగ్యంపై గొప్ప ప్రభావాన్ని చూపించే ఆకుల్లో కొత్తిమీర ఒకటి. ఆహారంలో మంచి మసాలాగా ఉపయోగపడే ఈ కొత్తిమీరలో ఔషధ విలువలు చాలా ఎక్కువ ఉన్నాయి. శీతాకాలం చామంతి పూలు వచ్చే కాలం. ఇందుల్లోనూ యాంటీ బాక్టీరియా గుణాలు ఉన్నాయి. జలుబుని నివారించే మందుల్లో, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌పై పోరాడే వాటిలో దీనిని ఉపయోగిస్తారు. ఒత్తిడి, ఆందోళనకు చికిత్సలోనూ, మహిళల్లో నెలసరి సమస్యలకు చికిత్స కోసం, కండరాల నొప్పులను తగ్గించేందుకు,నిద్రలేమిని దూరం చేసేందుకు కూడా దీనిని వాడతారు.

ఆరోగ్యం

# శీతాకాలంలో పెరుగు మంచిదే !



చల్లగా ఉన్నప్పుడు పెరుగు తినడం మంచిది కాదనే అపోహ చాలామందిలో ఉంది. ఇది పొరపాటు. శీతాకాలంలో పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. పెరుగులో విటమిన్లు పొటాషియం, మెగ్నీషియం, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే మంచి బాక్టీరియాను రాకుండా చేస్తుంది. తద్వారా శరీరం ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా చూస్తుంది. పెరుగుని నేరుగా తినడానికి ఇష్టపడని వారు వేరొక పదార్థాతో కలిపి తీసుకోవచ్చు. పెరుగుని ఎందుకు తీసుకోవాలో,ఎన్ని రకాలుగా తీసుకోవచ్చో తెలుసుకుందాం.



- **రోగ నిరోధక శక్తి పెరుగుతుంది :** పెరుగులో ఉండే మంచి బాక్టీరియా రోగ నిరోధక శక్తి బాగా పెంచుతుంది.
- **జలుబుని నివారిస్తుంది :** శీతాకాలంలో సాధారణంగా పీడించే సమస్య జలుబు. దీనిని పెరుగు నివారిస్తుంది. పెరుగులో ఉండే మంచి బాక్టీరియా జలుబుకి కారణ మయ్యే బాక్టీరియాపై పోరాడు తుంది. దానిని నివారిస్తుంది.
- **జీర్ణక్రియ సాఫీగా :** శరీరంలో పీహెచ్ సమతుల్యల కాపాడుకునేందుకూ పెరుగు దోహదపడుతుంది. ఇది ఎసిడిటీని నివారిస్తుంది. జీర్ణక్రిమ సాఫీగాసాగిపోయేలా చేస్తుంది.
- **ఎముకల పటిష్టత :** చల్లని వాతావరణం ఎముకలకు మంచిది కాదు. ఈ కాలంలో ఎక్కువగా ఎముకల సమస్యలూ వేధిస్తుంటాయి. ఒక్కోసారి ఎముకలు చిట్లిపోతుంటాయి. కూడా. ఇలాంటి సమస్యలు రాకుండా పెరుగు నివారిస్తుంది. ఇందులో ఉండే కాల్షియం, పాస్ఫరస్‌లు ఎముకలను పటిష్టంగా చేస్తాయి.

**ఇలా కూడా తీసుకోవచ్చు .....**

- పెరుగుని నేరుగా తీసుకోవడానికి ఇష్టపడనివాళ్ళు వేరే పదార్థలతో కలిపి వేరే రూపంలోనూ తీసుకోవచ్చు. అదెలాగంటే...
- **కర్డ్ రైస్ :** ఉడికించిన అన్నాన్ని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పెరుగు కలపండి. ఇప్పుడు ఇందులో కొంచెం మిరియాల పొడి, ఉప్పు వేసి కలపండి. ఇలా తిని చూడండి. దీని రుచి ఆకట్టుకుంటుంది. ఇంకా కాదనుకుంటే ఈ అన్నంలో తాలింపు కలుపుకోవచ్చు. పైన దానిమ్మగింజలు వేసి చూడడానికి ఆకర్షణీయంగా తయారుచేయవచ్చు.
- **కొంచెం తీపితో :** గిన్నెడు పెరుగులో ఒక టేబుల్‌స్పూన్ పంచదారను వేసి కలపండి. తీపిని ఎక్కువగా ఇష్టపడేవారు ఇలా తినవచ్చు. ఇది ఒంటికి బాగా చలవ చేస్తుంది. చిన్నచిన్న అనారోగ్యాలను దూరం పెడుతుంది.
- **పండ్లుతో :** సలాడ్ రూపంలో పండ్లతో కలిపి కూడా పెరుగుని తీసుకోవచ్చు. ఈరకంగా తీసుకుంటే అవసరమైన పోషక పదార్థాలు శరీరానికి అందుతాయి. దోస, టామాటా, ఉల్లిపోయలు, ఉప్పు, కొద్దిగా మిరియాల పొడి వేసి రైతా రూపంలోనూ పెరుగుని తీసుకోవచ్చు.

## 17న పీఎస్ఎల్వీ సీ-37 ప్రయోగం?

**శ్రీహరికోట (తడ) :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే 103 ఉపగ్రహాల ప్రయోగాన్ని ఫిబ్రవరి 17న నిర్వహించేందుకు పనులు త్వరతగతిన చేస్తున్నారు. సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ-37 ఉపగ్రహ వాహకనౌక ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. విదేశాలకు చెందిన వంద చిన్న ఉపగ్రహాలు ఇప్పటికే షార్‌కు చేరుకున్నాయి. అత్యంత పెద్దదైన కార్టోశాట్-2 సిరీస్ ఉపగ్రహంతో పాటు రెండు ఇస్రో నానో శాటిలైట్స్ బెంగళూరు నుంచి రావాల్సి ఉంది. ఇవి ఫిబ్రవరి మొదటి వారంలో షార్‌కు చేరుకుంటాయని తెలిస్తోంది.

## త్వరలో 2000 మంది పోలీసులకు బాడీ కెమేరాలు



**రాజధాని ప్రతినిధి-గుంటూరుక్రైం :** రాష్ట్రవ్యాప్తంగా 2000మంది పోలీసులకు బాడీ కెమేరాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర డీజీపీ నండూరి సాంబశివరావు తెలిపారు. తొలుత 500 బాడీ కెమేరాలను త్వరలో వినియోగిస్తామని, గుంటూరు జిల్లా నగరంపాలెం మోడల్ పోలీసు స్టేషన్ సిబ్బందికి అందరికీ కెమేరాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గుంటూరు నగరంలోని నగరంపాలెం, పాతగుంటూరులో నిర్మిస్తున్న మోడల్ పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. రిసెప్షన్‌లోని సిబ్బంది పనితీరును కొద్దిసేపు ఆసక్తిగా గమనించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఫిబ్రవరి 6వ తేదీన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పోలీసుస్టేషన్లను ప్రారంభిస్తారన్నారు. ఈ స్టేషన్లలో అంతా అదునాతన సాంకేతికతను వినియోగిస్తున్నట్లు వివరించారు. పోలీసు సిబ్బందిపైన అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఒక్కరూ సత్ప్రవర్తన, సేవాభావంతో పనిచేయాలని కోరారు. పర్యటనలో దక్షిణకోస్తా మండలం, గుంటూరు రేంజి ఐజీ ఎస్ సంజయ్, గుంటూరు రూరల్ జిల్లా ఎస్పీ కె. నారాయణనాయక్, గుంటూరు అర్బన్ జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ట త్రిపాఠ, అదనపు ఎస్పీలు భాస్కరరావు, తిరుపాల్, డీఎస్పీలు సరిత, నాగేశ్వరరావు, సీఐ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గాడ్సేకు విగ్రహాలా ?



**రాజధాని ప్రతినిధి-తిరుపతి :** దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీని కాల్చి చంపిన నాథూరామ్ గాడ్సేకు విగ్రహాలు పెట్టండని, గుడులు కట్టండని బీజేపీ ప్రభుత్వం చెప్పడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి విమర్శించారు. సీపీఐ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా మహాత్మాగాంధీ వర్ధంతిని లౌకికవాద పరిరక్షణ దినంగా పాటించారు. ఇందులో భాగంగా స్థానిక బైరాగిపట్టెడ పద్మావతి పార్కు సర్కిల్‌లో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గాడ్సే దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వచ్ఛభారత్ పేరుతో గాంధీ ఐకాన్‌తో ఓ పక్క ప్రచారం చేస్తూ మరో పక్క ఆయనను చంపిన గాడ్సేనుత పొగడటం, ఆర్ఎస్ఎస్ వారు గాడ్సే విగ్రహాలు పెడతామని చెప్పడం మతోన్మాదాన్ని రెచ్చగొట్టడమేనన్నారు. భారతదేశ లౌకికత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సీపీఐ తిప్పికొడుతుందని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ నరహంతకుడు నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు పెచ్చుమీరుతున్నాయని, ఆర్ఎస్ఎస్ వారిని ఉగ్రవాదులుగా మార్చుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి. మురళి, కె.రాధాకృష్ణ, ఎన్.డి.రవి, ఎన్.శ్రీరాములు, లక్ష్మయ్య, శశి, రత్నమ్మ, ఏఐఎస్ఎస్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి బండి చలపతి,సీహెచ్ శివకుమార్, బలరామ్, చిన్నం కాళయ్య, లక్ష్మయ్య, నాగభూషణం, నాగరాజు, మనోహర్‌రెడ్డి, శివ, కేవై రాజా,మంజుల, లక్ష్మి, నదియ, దాము, కవిత తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు, ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు

**సీపీఐ పెంపుదలతో ప్రైవేటు ఆసుపత్రులు అంగీకారం**

**మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడి**

**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు అన్నిరకాల వైద్యసేవలు అందించేందుకు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు అంగీకరించాయి. మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సిద్ధార్థ వైద్యకళాశాలలో వారితో సమావేశం నిర్వహించి చర్చలు జరిపిన మీదట అంగీకారం తెలిపినట్లు మంత్రి తెలిపారు. ఈసమావేశానికి ఎంప్యానల్‌మెంట్‌లో వున్న 367 ప్రైవేటు ఆసుపత్రులు యజమానులు హాజరయ్యారని, ఈహెచ్ఎస్ కింద ఉద్యోగులు, జర్నలిస్టులకు అన్నిరకాల వైద్య సేవలను అందించడానికి అంగీకరించారని తెలిపారు. హెల్త్ స్కీమ్‌లో ఇప్పుడిస్తున్న కన్స్యూమర్ ప్రెస్ ఇండెక్స్ (సీపీఐ) ప్రకారం 21.11శాతం పెంచినట్లు మంత్రి తెలిపారు. ఇక ప్రతి ఏడాది సీపీఐ పెరుగుతుందన్నారు. ఈహెచ్ఎస్ ఫిబ్రవరి 1 నుండి అమల్లోకి వస్తుందన్నారు.

# రాష్ట్రంలో హెచ్‌ఐవీ,క్షయ కుష్టు వ్యాధులు ఊపిరి తీస్తున్నాయ్..

**రాష్ట్రంలో ప్రమాదకరమైన** హెచ్‌ఐవీ,క్షయ కుష్టు వ్యాధులు విజృంభిస్తున్నాయి. గడిచిన రెండేళ్లలో వీటి బాధితుల సంఖ్య రాష్ట్రంలో పెరిగిపోతోంది. ఈ ప్రాణాంతక వ్యాధుల నియంత్రణలో ప్రభుత్వ నిర్లక్ష్య వ్యాధిగ్రస్తుల పాలిట శాపమవుతోంది. ఈ వ్యాధులు సోకినవారు ఆర్థికంగా చితకిపోవడమే కాకుండా..సామాజికంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఈ వ్యాధుల బాధితుల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఆరోగ్యశ్రీ,108,104 లాంటి పథకాలను నీరుగారుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఈ ప్రాణాంతక వ్యాధుల నియంత్రణకు సరైన చర్యలు తీసుకోవడంలేదు.




**రాజధాని ప్రతినిధి-అమరావతి :** రాష్ట్రంలో రెండేళ్లుగా హెచ్‌ఐవీ, క్షయ కుష్టు వ్యాధులు తీవ్రంగా ప్రబలుతున్నాయి. రాష్ట్రంలో వాధ్యల పరిస్థితిపై కుటుంబ సంక్షేమశాఖ ప్రతినెల రోగుల వివరాలను నమోదు చేసి కేపీఐ (కీ సెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్)గా గుర్తిస్తుంది. ఈ వివరాలే ఆ జబ్బుల తీవ్రతను తెలుపుతోంది. వారి గణాంకాల ప్రకారం ప్రతి నాలుగు వేల మంది హెచ్‌ఐవీ బాధితుల్లోనూ దాదాపు 500 మంది క్షయ (టీబీ) సోకిన వారు ఉన్నారు. కుష్టు (లెప్రసీ) వ్యాధిగ్రస్తులు కూడా ఏటా ఏడు వేలకుపైగా పెరుగుతుండటం అధికారులనే కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)నే నివ్వెర పోయేలా చేసింది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే క్షయ, హెచ్‌ఐవీ, లెప్రసీ బాధితుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

**లక్షకి 190 మందిలో టీబీ..**

ప్రతి లక్ష జనాభాకు 190 మందికి టీబీ సోకుతున్నట్లు ప్రభుత్వం గణాంకాల్లో తేలింది, రాష్ట్రంలో గేతడాది దాదాపు లక్ష మంది టీబీ బారిన పడ్డారు. సాధారణ మందులకు లొంగని వేలాది మంది టీబీ బాధితులు ఇప్పుడు ఎండీఆర్ (మల్టీ డ్రగ్ థెరపీ) స్థాయికి వచ్చారు. వీరు ఏళ్ల తరబడి మందులు వాడాల్సిందే. ప్రధానంగా హెచ్‌ఐవీ ఉన్న వారిలో ఎక్కువ మందికి టీబీ కూడా సోకుతోంది. 2016 డిసెంబర్ మాసంలో 4 వేల మంది హెచ్‌ఐవీ కేసులను టీబీ నిర్ధారణకు పంపగా అందులో 460 మందికిపైగా టీబీ సోకినట్టు అధికార వర్గాలు నిర్ధానించాయి. టీబీ బాధితుల్లో ఏటా 5 శాతంపైనే మృతులు చోటు చేసుకుంటున్నట్టు కూడా తేలింది.

**వెంటాడుతున్న కుష్టు**

గతకొంత కాలంగా కుష్టు వ్యాధి తగ్గినట్టే తగ్గి రెండేళ్లుగా మళ్లీ విజృంభించడం వైద్య వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించలేకపోతుండటంతో ప్రమాదస్థాయికి చేరుతోంది. మన రాష్ట్రంలో ఏటికేటికీ ఈ లెప్రసీ కేసులు పెరుగుతూండటం భయం కలిగిస్తోంది. ఇప్పటికీ ఏటా 7 వేలకు పైగా కొత్త లెప్రసీ కేసులు బయటపడుతుండటం విస్తుగొలిపే అంశం.

**ఏటేటా పెరుగుతున్న హెచ్‌ఐవీ కేసులు**

రాష్ట్రంలో ఏటా 3,500 వరకూ కొత్త హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుతం 3.48 లక్షల మంది హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోనే కాదు ఉత్తరాదిలో చాలా రాష్ట్రాలతో పోలిస్తే హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లోనే ఎకుగా ఉన్నట్టు అధికారుల సర్వేలో తేలింది. రాష్ట్రంలో 40 ఏఆర్‌టీ (యాంటీ రిట్రివల్ థెరపీ) సెంటర్లు ఉన్నాయి. హెచ్‌ఐవీ బాధితులు ఇక్కడ నమోదు చేసుకుంటే ఉచితంగా మందులిస్తారు. కానీ నిధుల లేమితో ఈ 40 కేంద్రాల్లో ఒక్కోసారి మందులు కూడా లభించలేదు. హెచ్‌ఐవీతో పాటు టీబీ సోకిన వారు కూడా ఏఆర్‌టీ సెంటర్లకే వచ్చి మందులు తీసుకెళ్లాల్సి ఉంది.

**ఐదు జిల్లాల్లో కుష్టు వ్యాధి అత్యధికం**

కుష్టు వ్యాధి అత్యధికంగా ఐదు జిల్లాల్లో ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాల్లో తేలింది. అత్యధికంగా విజయనగరం జిల్లాల్లో ప్రతి లక్షల మందిలో 13.83 మందికి కుష సోకినట్టు వెల్లడైంది. ఆ తర్వాతి స్థానం శ్రీకారుళంది. కర్నూలు, నెల్లూరు, అనంతపురం జిల్లాలు కుష్టువ్యాధి సోకిన హై ఎండెమిక్ జిల్లాలుగా ప్రభుత్వం గర్తించింది. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే కేసులు ఈ గణాంకాల్లోకి రావడం లేదు.

### హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య ఇలా..

- నెలకు 300 నుంచి 400 మందిపైనే హెచ్‌ఐవీ బాధితులు నమోదవుతున్నారు.
- ప్రతినెలా కొత్త హెచ్‌ఐవీ కేసుల్లో సుమారు 100 మంది గర్భిణులు ఉంటున్నారు.
- కొత్తగా నమోదవుతున్న కేసుల్లో 60 శాతం మహిళలే.
- ఏటా హెచ్‌ఐవీ సోకిన బాధితుల్లో 2,500 నుంచి 3,000 మంది మృతి
- హెచ్‌ఐవీ సోకిన బాధితుల్లో 10 శాతం మందికిపైనే టీబీ సోకుతోంది.

### సత్ఫలితాలివ్వని 99 డాట్

క్షయ వ్యాధి బాధితులకు ఏఆర్‌టీ సెంటర్లలోనే మందులిచ్చే కొత్త విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. 99 శాతం టీబీ సయమయ్యే వరకు ఏఆర్‌టీ సెంటర్లలో కేంద్ర ప్రభుత్వమే మందులను సరఫరా చేస్తుంది. ఇక్కడ మందులు లభిస్తున్నట్టు విస్తృత ప్రచారం కల్పించాలి. కానీ ఇప్పటివరకు 99 డాట్ అంతగా సత్ఫలితాలు ఇవ్వడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.




# అమరావతి రైల్వే కనెక్టివిటీ సర్వే పూర్తి



**రాజధాని ప్రతినిధి-విజయవాడ (గాంధీనగర్) :** ఏపి నూతన రాజధాని అమరావతికి రైల్వే కనెక్టివిటీ ప్రాజెక్టు సర్వే పూర్తైనట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. రైల్వే బోర్డు అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని వివరించారు. విజయవాడ వచ్చిన రైల్వే జీఎంకు డివిజన్ డీఆర్ఎం, ఏడీ ఆర్ఎం, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం రైల్వే అధికారులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్యకంగా కలిశారు. అమరావతికి రైల్వే కనెక్టివిటీ ఇతర రైల్వే ప్రాజెక్టులపై చర్చించినట్టు సమాచారం ఆనంతరం డివిజన్ కార్యాలయంలో డీఆర్ఎం, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అక్ష్యాలను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన అధికారులకు వివరించారు. విజయవాడ రైల్వేస్టేషన్‌ను తనిఖీలు చేసిన ఆయన పలు సూచనలు చేశారు. స్టేషన్ మేనేజర్ వీఐపీ లాంజ్‌లో నోద్ కుమార్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ అమరావతికి రైల్వే అనుసంధానం కోసం రైల్ నిగమ్ లిమిటెడ్ సంస్థతో సర్వే చేయించామన్నారు. యర్రపాలెం నుంచి అమరావతి అక్కడ నుంచి నంబూరు మీదగా సత్తెనపల్లికి రైల్వే లైన్ ఏర్పాటు కోసం రూ.2,679 కోట్ల వ్యయం అవుతందని నివేదిక అందినట్లు తెలిపారు. ఈ నివేదికను రైల్వేబోర్డు అనుమతి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రైల్వే ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. భూసేకరణ అంశంపై చీఫ్ సెక్రటరీ అన్ని జిల్లాల కలెక్టర్లుతో చర్చిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ప్రయాణీకులు భద్రతతో కూడిన సుఖవంతమైన ప్రయాణానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైళ్ళు సమయాపాలనతో రాకపోకలు సాగించేలా నూతన టెక్నాలజీ ఉపయోగిస్తున్నామన్నారు. విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వేలోనే ఈ ప్రాజెక్టు అతి ముఖ్యమైనదన్నారు. పోర్టుల ద్వారా సరకు రవాణాతో మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. విజయవాడ-వరంగల్ మధ్య మూడవ లైన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని, డబ్లింగ్, విద్యుదీకరణ పనలు పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈయన వెంట డీఆర్ఎం అశోక్‌కుమార్ ఏడీఆర్ఎం కె.వేణుగోపాలరావు, సీనియర్ డీసీఎం షిపాలి, చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఎ.ఆర్.గాంధీ, సీపీఆర్వో ఉమశంకర్,స్టేషన్ మేనేజర్ సి.హెచ్.సురేష్, ఆర్పీఎఫ్ సీఐ కర్నాటి చక్రవర్తి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

**రాజధాని ప్రతినిధి,జంగారెడ్డి గూడెం :** ఆర్య వైశ్యులకు రూ.1000 కోట్లతో ఆర్యవైశ్య కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గాదెంశెట్టి శ్రీనివాసరావు డిమండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్యుల్లో కూడా చాలా మంది పేదలున్నారని, వారి అభివృద్ధికి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్య వైశ్యులు అగ్రకులస్తులు అని పక్కన పెట్టరాదని, ఆర్య వైశుల్లో చిరు వ్యాపారాలు, చిన్న చిన్న వ్యాపారాలు కనుకొని జీవనోపాధి పొందేవారు ఎంతో మంది ఉన్నారన్నారు. ఏటా నవంబరు 1 తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించాలని డిమాండ్ చేసారు. నూతన రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఇందు కోసం జిల్లాల వారీగా ఎమ్మెల్యేలను కలసి వినతి పత్రాలు అందచేస్తామని తెలిపారు. అలాగే రాష్ట్టంలో ఆర్యవైశ్య జనాభా ప్రాతిపదికన నియామక పదవులు, శాసనమండలి పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నుదురు మాటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు చిన్ని రామ సత్యనారాయణ, జిల్లా మా అధ్యక్షులు శీమకుర్తి కోటేశ్వరరావు, కర్పూరం నారాయణ రావు, జల్లేపల్లి వైకుంఠరామ్ పాల్గొన్నారు.



**తూర్పుగోదావరి :** ముమ్మిడివరం నియోజకవర్గం పోతుకుర్రులో జనవరి నెల 27 నుండి 30వ తేది వరకు శ్రీశ్రీశ్రీ వీరగనికమ్మ అమ్మవారు మరియు వీరభద్రుల సంబర మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. 30వ తేది ఉదయం 10గంటల నుండి అన్నసమారాధన, రాత్రి శూలాల సంబరం, బాణాసంచాలతో ఊరేగింపు జరిగింది. ఈ సంబర మహోత్సవాలు మునుకోటి భీమరాజు, శ్రీమతి దేవుడమ్మల ఆధ్వర్యంలో జరిగాయి.

## విశ్వ సుందరి ఐరిస్ మిట్టెనారె



**ఫ్రాన్స్ :** ఫ్రెంచ్ యువతి మొట్ట మొదట సారిగా మిస్‌యూనివర్స్ టైటిల్‌ను గెలుచుకుంది. మిస్‌యూనివర్స్ టైటిల్‌ను గెలవడంతో ఫ్రెంచ్ ప్రజల ఆనందం మిన్నంటింది. 1953 నుండి ఇప్పటి వరకు ఇదే తొలి ఫ్రెంచ్ మిస్‌యూనివర్స్ టైటిల్. ఐరిన్ మిట్టెనారె ఒక టెలివిజన్ షోలో ఈ టైటిల్ గెల్చుకుంది. ఉత్తర ఫ్రాన్స్‌లోని లిల్లీకు చెందిన ఐరిన్ డెంటల్ సర్జరీ చదువుతోంది.

ఈ కాంపిటేషన్‌ను యు.ఎస్.ఎ. లో టివి మాధ్యమంలో ప్రచారం కానుంది. పోటీ ముగిసిన తరువాత మిట్టెనారె మాట్లాడుతూ నేను ఎప్పుడు క్రోన్‌ను టచ్ చేస్తూ ఉండేదాన్ని. ఇప్పుడు టైటిల్ గెలుచుకోవటం, క్రోన్ నా తలపై పెట్టుకోవటం చాలా ఆనందంగా ఉంది అని ఒక సమావేశంలో చెప్పారు. ఫైనల్‌రౌండ్‌లోకి చేరిన 6గురులో తొలి రన్నరప్ గా మిస్ హైతి, రెండవ రన్నరప్‌గా మిస్ కొలంబియాగా నిలిచారు. రెఫ్యూజీల గురించి అడుగగా ఫ్రాన్స్ తమ బోర్డర్‌ను క్లోస్‌చేసుకోవటం తమ ఇష్టమని అయితే ఇమ్మిగ్రేంట్స్ రావటవల్ల ఉన్న ఉపయోగాలను వివరించి అందాల తార మిస్ మిస్‌యూనివర్స్ టైటల్‌ను కైవశం చేసుకంది.

# 75 ఏళ్ల స్వప్నం సాకారం చేస్తాం

- 2018 డిసెంబరుకు పోలవరం నిర్మాణం పూర్తికి సి.ఎం. సంకల్పం
- ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం
- ప్రాజెక్టుల తాజా అంచనా వ్యయం రూ.40 వేల కోట్లు సాకారమవుతున్న 75 ఏళ్ల స్వప్నం



స్పిల్‌వే కాంక్రీటు పనులను భూమి పూజచేసి.చంద్రబాబు ప్రారంభిస్తున్న దృశ్యం



**అన్నంరెడ్డి సుబ్బారావు, రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం :** బహుళార్ధ సాధక పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన మొత్తం పనులను 2018 డిసెంబరు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మహా సంకల్పం చేపట్టారు. ఆ కార్యచరణలో భాగంగానే గత డిసెంబరు 30న ప్రాజెక్టు పనులలో ప్రధానమైన స్పిల్‌వే నిర్మాణానికి సంబంధించిన కాంక్రీటు పనులను ఆయన భూమి పూజచేసి ప్రారంభించారు. మరో కీలకమైన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పనులకు కూడ చంద్రబాబు ఈ నెల 1 న భూమి పూజ చేసి ప్రారంభించారు. ప్రాజెక్టులలో కీలకమైన రిజర్వాయరు ఎర్త్‌కమ్‌రాక్ ఫిల్ డామ్‌కు పునాదిగా ఈ డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులో మూడవ ప్రధాన కట్టడమైన 960 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణం పనులు ప్రారంభ కావలసి ఉంది. ఈ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏ.పి. జెన్‌కో నిర్మిస్తోంది.

### 75 ఏళ్ల స్వప్నం సాకారం

పోలవరం ప్రాజెక్టును రూ.2660 కోట్లు అంచనా వ్యయంతో 1976లో ప్రతిపాదించారు. 1981 మే 19న నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య రామయ్య పేట వద్ద శంకుస్థాపన చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు 1941-42 కాలంలోనే గోదావరి నదిపై సాగునీటి ప్రాజెక్టును పోలవరానికి ఎగువన నిర్మించాలనే ఆలోచన నీటి పారుదల శాఖ నిపుణులకు వచ్చింది. 1942-44 మధ్య కాలంలో ప్రాజెక్టు ప్రతిపాదన రూపుదిద్దుకొంది. 1946లో " శ్రీ రామ పాదసాగర పథకం " పేరుతో ధవళేశ్వరం ఆనకట్టకు 42. కిలోమీటర్ల ఎగువన పోలవరం సమీపంలోని మహానందీశ్వరస్వామి కొండకు ఆనుకొని ఇరువైపుల సాగునీటి ప్రాజెక్టు నిర్మించటానికి రూ.129. కోట్లు అంచనా వ్యయంతో ప్రాజెక్టు నివేదికను ఇంజనీర్లు అందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి భారీ వ్యయం, నిధుల సమస్య, ఇతర రాష్ట్రాలతో ముడిపడి ఉన్న సమస్యల కారణంగా దానిని ప్రక్కన పెట్టారు. ఆ తర్వాత 1976 లోనే భారీ సాగునీటి పథకం మళ్లీ తెరపైకి వచ్చి మళ్లీ సర్వే జరిపారు. 1983 లో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రాజెక్టు పేరును " తెలుగు గోదావరి జలసాగరం " గా మార్చారు. 1946 లో ప్రతిపాదించిన శ్రీరామపాద సాగర పథకం నిర్మాణ ప్రతిపాదించిన శ్రీరామ పాద సాగర పథకం నిర్మాణ ప్రతి పాదిత ప్రాంతానికి మహా నందీశ్వరస్వామి మెట్టుకు 2. కిలోమీటర్ల ఎగువన ప్రస్తుత పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. 2004 వరకు ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాలు పెరుగుతూనే ఉన్నాయి. కాని పథకం నిర్మాణ కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్ సీఎం అయిన తర్వాత ఇందిరాసాగర్ ప్రాజెక్టుగా పేరు మార్చి ' జలయజ్ఞం ' పథకంలో కుడి, ఎడమ ప్రధాన కాల్వల నిర్మాణ తవ్వకాల పనులు చేపట్టారు. పదేళ్లు గడిచినా ప్రధాన కాల్వల తవ్వకాలు, వంతెనలు నిర్మాణాలు పూర్తికాలేదు. ఎక్కడి కక్కడ భూసేకరణ వివాదాలతో పనులు నిలిచిపోయాయి. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యు.పి.ఏ. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. కాని నిధులు కేటాయించలేదు.

### పెరుగుతున్న అంచనా వ్యయం

2010-11లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.16010.45 కోట్లు కాగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిన అంచనా వ్యయం ప్రతిపాదనలు రూ. 40 వేలు కోట్లు.2010-11 నాటి అంచనా వ్యయం ప్రతిపాదనల్లో నీటి పారుదల ప్రాజెక్టు పనులకు రూ.12,294.40 కోట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణానికి రూ.3716.05 కోట్లు ఖర్చు కాగలవని రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. కేంద్రంలో ఎన్.డి.ఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టుకు ఇచ్చిన మొత్తం నిధులు రూ.2916.54 కోట్లు, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.రూ.3247.23 కోట్లుగా లెక్కలు చెపుతున్నాయి. 2010-11. అంచనాల ప్రకారం చేసిన ఖర్చుకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రావలసి ఉంది. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే 2014-15 లో సవరించిన అంచనా వ్యయంలో నీటి పారుదల (స్పిల్‌వే, ఎర్త్‌కమ్ రాక్ ఫిల్ డామ్, కుడి, ఎడమ ప్రధాన కాల్వల) పనులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం సహాయం ఉంటుందంటున్నారు. అయితే 2014-15 గణాంకాల ప్రకారం సవరించిన అంచనాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇంకా పంపాల్సి ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి పంపిన తాజా అంచనా వ్యయం ప్రతిపాదనలలో పేర్కొన్న రూ.40 వేలు కోట్లులో రూ.28 వేలు కోట్లు భూసేకరణ, పునరావాసాల చెల్లింపులకే ఖర్చు అవుతుందని అంటున్నారు. 2014 జూలై నుంచి 2016 మార్చి వరకు కుడి ప్రధాన కాల్వ తవ్వకు, నిర్మాణాలు పూర్తి చేయటం, పట్టి సీమ ఎత్తి పోతల పథకం నిర్మించి గోదావరి జలాలను కుడి కాల్వ ద్వారా కృష్ణానది జలాల్లో కలిపి నదుల అనుసంధానాన్ని పూర్తి చేయటానికి చంద్రబాబు ప్రాధాన్యం ఇచ్చి విజయం సాధించారు. 2016 మార్చి 13 నుంచే సీఎం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనుల పై ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణ, నిరంతర నిఘా పెట్టారు. ఆగష్టులో భారీ డంపర్లు, ఎస్కిలేటర్లు వంటి భారీ యంత్రాలను రప్పించి వాటితో ప్రాజెక్టు స్పిల్‌వే పనులతో మట్టి తవ్వకం పనులను చంద్రబాబు ప్రారంభించారు. అప్పుడే ప్రాజెక్టులో ఎప్పటికి ఏ పనులు పూర్తి చేయాలనే విషయమై అధికారులకు నిర్ధిష్ట తేదీలతో కార్యాచరణ ప్రణాళికకు నిర్దేశించారు. 2018 చివరి కీలక జలాశయం, స్పిల్‌వే నిర్మాణాలు పూర్తి చేసి, జలాశయాన్ని నింపి కాల్వల ద్వారా గోదావరి జలాలు పారించటానికి ప్రణాళికలు రూపొందించారు. 2018 డిశంబరు నాటికి ప్రాజెక్టు మొత్తం పనులు పూర్తి చేయాలన్న కార్యాచరణను కాంట్రాక్టు కంపెనీలకు, ఇంజనీర్లకు నిర్దేశించారు.ఎర్త్‌కమ్ రాక్ ఫిల్ డామ్ చివరి నుంచి 1054.40 మీటర్లు పొడవున150.అడుగుల ఎత్తుతో స్పిల్ వేను నిర్మిస్తారు. స్పిల్ వేకు 16 మీటర్లు వెడల్పు, 20 మీటర్లు ఎత్తు గల 48 గేట్లను ఏర్పాటు చేస్తారు. 17 లక్షల క్యూబిక్ మీటర్లు సిమెంటు కాంక్రీటును వినియోగించే స్పిల్‌వే నిర్మాణం పనులను గత డిశంబరు 30న భూమి పూజ చేసి శాస్త్రోకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. స్పిల్ వేకు అమర్చే 48 గేట్లను కూడా ప్రాజెక్టు ప్రాంతంలోనే తయారు చేయటానికి ఏర్పాటు జరిగింది. స్పిల్‌వే కాంక్రీటు పనులు 2017 సెప్టెంబరు నాటికి, గేట్లు అమర్చిన పనులు 2018 మార్చి నాటికి పూర్తి కావాలని లక్ష్యం నిర్దేశించారు. రిజర్వాయరు డ్యాం నిర్మాణంలో కీలకమైన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పనులను ఫిబ్రవరి 1న సీఎం ప్రారంభించనున్నారు. నదిలో వంద మీటర్లు లోతు ఆవిష్కరించనున్న పునాది (డయాఫ్రమ్ వాల్ ) పనులకు 1.2 లక్షల సి.యం.టి.ల సిమెంటు కాంక్రీటును ఉపయోగిస్తారు. ఈ పునాది (డయాఫ్రమ్ వాల్) గోడ నిర్మాణం పనులు 2018. ఏప్రిల్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఎర్త్‌కమ్ రాక్ ఫిల్ డ్యాంచ చివర నిర్మించే స్పిల్ వేకు ఎగువన ఎప్రోచ్ ఛానల్, దిగువన స్పిల్ ఛానల్, దాని వెంబడి పైలట్ ఛానల్ నిర్మాణాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయటానికి యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. ఎగువన, దిగువన నిర్మించే రెండు కాపర్ డ్యామ్‌ల పనులను 2018 మే నెలాఖరుకు పూర్తి చేయాని లక్ష్యం నిర్ణయంచారు. నదిలో డ్యామ్ కాంక్రీటు పనులను ఈ ఏడాది నవంబరు ఆఖరుకు పూర్తి చేయాలని నిర్దేశించారు. ఎర్త్ కమ్ రాక్ డ్యామ్ నిర్మాణం పనులను 2018 డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ లోగానే గ్రావిటీ ద్వారా కుడి, ఎడమ కాలువలకు 2018 మే నెల ఆఖరుకు విడుదల చేయాలని సంకల్పించారు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఎ.పి. జెన్‌కో నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్టు పనులను 25 విభాగాలుగా విభజించి నిర్దేశిత సమయంలో నిర్మాణాలు పూర్తి చేయాలని కార్యాచరణ లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించింది. కుడి ప్రధాన కాల్వ మొత్తం 174. కిలో మీటర్లు పొడవునా నిర్మాణం పూర్తయింది. తూర్పు గోదావరి,విశాఖ జిల్లాల్లో ఎడమ ప్రధాన కాల్వ 150. కిలో మీటర్లు తవ్వాల్సి ఉంది. ఈ పనులను కూడ వేగంవంతం చేసింది ప్రభుత్వం. బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టు పూర్తియితే 7.20 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుంది.540 గ్రామాలకు, అక్కడ నివసించే 28.50 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుంది. కృష్ణానదికి 80. టి.యం.సి.లు విశాఖ పట్టణానికి 23.44 టి.యం.సి.లు నీరు సరఫరా అవుతుంది. ఒడిసా రాష్ట్రానికి 5. టి.యం.సి.లు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి 1.5 టి.యం.సి.ల నీరు సరఫరా అవుతుంది. ఫిబ్రవరి 1న ప్రారంభమయ్యే డయాఫ్రమ్ వాల్ (పునాది రోడ్) ను మొత్తం 1750 మీటర్లు పొడవున నిర్మిస్తారు. రెండు ఫేస్‌లుగా చేపట్టే పునాది గోడను ఈ సీజన్‌లో 800 మీటర్లు పొడవున నిర్మిస్తారు. మిగిలిన భాగాన్ని వచ్చే సీజన్ లో నిర్మిస్తారు. వంద మీటర్లు పొడవైన గైడ్ వాల్ నిర్మించడానికి అనువుగా ఏర్పాట్లు జరుతున్నాయి. ఆంధ్రుల 8 దశాబ్దాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టు 2019 నాటికి పూర్తియితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక ముఖ చిత్రం మారిపోతుందనటంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి 28 విభాగాల పనితీరును ఎప్పటికప్పుడు సీఎం డ్యాష్ బోర్డులో ఉంచుతుండటంతో ముఖ్యమంత్రి పనుల పురోగతిని అనుక్షణం సమీక్షిస్తున్న అధికారులను కాంట్రాక్టు కంపెనీలను పరుగులు పెట్టిస్తున్నారు.

ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన 370 గ్రామాల ముంపునకు గురవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లోనే 220 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితులయిన ప్రజలు, రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పన జరుగుతోందని అధికారులు చెపుతున్నారు.

## కేంద్రంలో ఎన్.డి.ఏ. రాష్టంలో తెలుగు దేశం ప్రభుత్వాలు రాకతో కదలిక

రాష్ట్ర విభజన తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ నాయకత్వంలో ఎన్.డి.ఏ. ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టాయి. అప్పటి నుంచి పోలవరం ప్రాజెక్టు పనులకు మహర్దశ పట్టింది. కేంద్ర మంత్రి మండలి మొదటి సమావేశంలోనే ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఏడు ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్ నివాసం చేస్తూ ఆర్డినెన్స్ తీసుకురావటం, వెనువెంటనే పార్లమెంటులో రాష్ట్రపతి ఆమోదం పొందటంతో ప్రాజెక్టు నిర్మాణానికి మొదటి అడ్డంకి తొలగించి, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినందున ప్రాజెక్టు నిర్మాణానికయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని కూడ కేంద్ర పాలకులు ప్రకటించటంతో, నిధుల సమస్య కూడ తొలగి రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట కలిగింది. ప్రాజెక్టు నిర్మాణానికి, నా బోర్డు నుంచి నిధులు మంజూరు చేయించి ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దానిలో భాగంగానే తొలివిడతగా గత డిశంబరు 27న రూ.1981 కోట్లు నిధులను కేంద్ర రాష్ట్రానికి విడుదల చేసింది.



పోలవరం ప్రాజెక్టు ఎం.ఏ.పి.

## సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్న ఏపీ రైతు సంఘం



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని, సమగ్ర జాతీయ వ్యవసాయ విధానాన్ని రూపొందించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు పి రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. జయంతీఘోష్, స్వామినాధన్, రామచంద్రారెడ్డి కమిటీలు కూడా రైతులు ఆత్మహత్యలు జరుగుతున్నట్లు నిర్ధారించాయన్నారు. అయినప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మహత్యల నివారణకు ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణం బ్యాంకులతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపి రైతులకు రుణాలు సకాలంలో అందేవిధంగా చూడాలన్నారు.వ్యవసాయరంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నేతలు డిమాండ్ చేశారు.

## మహిళా చైతన్యం

ఐద్వా జాతీయ ప్రధానకార్యదర్శి, దావలే



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** మహిళలను ద్వితీయ స్థాయి పౌరులుగా భావించడం వల్లే హింస పెరుగుతోందని, చట్టాలున్నా వాటిని అమలు చేసేవారు కూడా ఎక్కువ మంది పురుషులే కావడంతో ప్రయోజనం లేకుండా పోతోందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మిరియం దావలే అన్నారు. మహిళలు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందని ఉద్భోధించారు "మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు- పరిష్కారాలు" అనే అంశంపై స్వాతంత్ర్య సమరయోధుల భవన్‌లో ఐద్వా రాష్ట్ర శాఖ నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆకస్మికంగా పెద్ద నోట్ల రద్దుకు పాల్పడి, సామాన్యులను కష్టాలపాలు చేశారని విమర్శించారు. నోట్లరద్దును బ్లాక్ మనీ, దొంగనోట్లు, టెర్రరిజాన్ని అరికట్టడానికని చెప్పారని, ఇప్పటి వరకు ఎంత నల్లధనాన్ని అరికట్టారో చెప్పాలన్నారు. పెద్దల నల్లధనం అంతా తెల్లధనంగా మారిపోయిందని విమర్శించారు. బీజేపీ, కార్పొరేట్ శక్తులు కలిపి ఈ దేశాన్ని ఏలుతున్నాయని, భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు ఎదురు కాక తప్పదన్నారు. స్త్రీలు కుటుంబ పోషణకు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ వల్ల మనకు తెలియకుండానే నష్టపోతామన్నారు. మనువాద బీజేపీ, సంఘ్ పరివార్ శక్తుల ఆగడాల వల్ల మహిళలు మరిన్ని కష్టాలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఆలయాలకు, దర్గాలకు వెళ్ళడం మహిళల హక్కు అన్నారు. దీనిపై మనం పోరాడకపోతే బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీలు మహిళలు ఇలాగే వుండాలనే ముద్ర కూడా వేస్తాయన్నారు. వాస్తవాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. కాలేజీ, ఫ్యాక్టరీ ఎక్కడయినా స్త్రీలకు రక్షణ ఉండాలన్నారు. ఇటువంటి అనేక సమస్యలపై మహిళల్లో చైతన్య కల్పించాలన్నారు. ఈ సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి, రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, ఉప అధ్యక్షురాలు కె. స్వరూపరాణి, జిల్లా నగర కార్యదర్శులు శ్రీదేవి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల అభివృద్ధి సంక్షేమమే మా లక్ష్యం



**రాజధాని ప్రతినిధి,(గుంటూరు) :** ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం సామాజిక వర్గ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనారిటీల ఆర్థిక సంస్థ అధ్యక్షుడు ఎం.డి.హిదాయత్ అన్నారు. గుంటూరు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మాట్లాడుతూ ఆదాయం లేని మసీదుల్లో పని చేస్తున్న ఇమాం, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని తెలిపారు. ఇమాంలకు నెలకు రూ.5 వేలు, మౌజన్‌లకు రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించనున్నామన్నారు. ఫిబ్రవరి 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పది వేల మంది ఇమాం, మౌజన్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. అప్పుల్లో ఉన్న ప్రతి మసీదు నిర్వహణ ఖర్చులకు రూ.88 వేలు చొప్పున మంజూరు చేశామన్నారు గౌరవ వేతనాలు తీసుకుంటే మసీదులు వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వస్తాయనే అపోహాలు నమ్మొద్దని, ఇమాం, మౌజన్ పేర్లు మాత్రమే నమోదు చేసుకుంటారని వెల్లడించారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 15 వేల మందికి రూ.70 కోట్ల రాయితీని విడుదల చేశామని చెప్పారు. ఫిబ్రవరి నెలాఖరుకు బ్యాంకర్ల సహకారంతో రుణాలు పంపిణీ చేసి యూనిట్లు గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిబ్రవరి మూడోవారంలో గుంటూరులో మెగా ఉపాధి మేళాను నిర్వహించి వేల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వివరించారు. మదర్సాల ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తామన్నారు. దుల్హన్ పథకం కింద 2016లో గుంటూరు జిల్లాలో 1,628 మంది లబ్ధిపొందారని వివరించారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీల ఆర్థిక సంస్థ పాలకమండలి సభ్యుడు లాల్‌వజీర్, మైనారిటీల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## మృత్యుకుహరంగా మంచులోయ

### కశ్మీర్‌లో మరో ఐదుగురు జవాన్ల మృతి



**శ్రీనగర్ :** వారంతా 56 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఐదుగురు వీర జవాన్లు, ఉత్తర కశ్మీర్‌కుప్వారా జిల్లా మచ్చిల్ సెక్టార్‌లో విధులు నిర్వర్తిసున్నారు. వారం రోజులుగా మంచు వర్షంతో 'చిల్లాయ్ కలాన్' బీభత్సం సృష్టిస్తున్నా వెరవకుండా తమ బాధ్యతల్లో అంతకంతకూ పెరిగిపోతున్న మంచు వర్షం మధ్య వీరంతా తమ పోస్టుకు వెళుతుండగా ఒక్కసారిగా మంచులో కూరుకుపోయారు. సహాయక సిబ్బంది వెంటను అక్కడికి హెలికాప్టర్లలో చేరుకున్నారు. మంచు దిబ్బలను తొలగించి జవాన్లను వెలికి తీశారు. సైనికులంతా తీవ్ర గాయాలకు గురై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే. ప్రాణాలు దక్కుతాయ్, అయితే శని, ఆదివారాల్లో వాతావరణం ఏమాత్రం అనుకూలించక పోవడంలో వారిని తరలించ లేకపోయారు. ఎట్టకేటకు కాస్త అనుకూలించడంతో ఐదుగురు జవాన్లను చికిత్స కోసం శ్రీనగర్ బేస్ ఆస్పత్రికి తరలించారు. అయితే సహాయక సిబ్బంది కృషి ఫలించలేదు. ఈ ఐదుగురు జవాన్లు ఆస్పత్రిలో చికిత్సపొందుతూనే ప్రాణాలు విడిచారు. మంచులో కూరుకుపోవడంతో గత ఆరు రోజుల్లో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల సంఖ్య 20 (ఓ ఆఫీసర్‌సహా) కి చేరింది, కశ్మీర్ లోయలో ఇదే తరహాలో ఐదుగురు సాధారణ పౌరులూ మరణించారు.

### ముగిసిన 'చిల్లాయ్ కలాన్'

కశ్మీర్‌లోయను మంచు తుఫానుతో ఉక్కిరిబిక్కిరి చేసిన 'చిల్లాయ్ కలాన్' కాలం బై బై చెప్పేసింది. అయినా శ్రీనగర్ సహా పలు ప్రాంతాలను చలి వీడలేదు. పలు ప్రాంతాల్లో దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. వాతావరణం మబ్బుపట్టి ఉండటంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏటా డిసెంబరు 21 నుంచి జనవరి 30 వరకు గల చలికాలాన్ని కశ్మీర్‌లో 'చిల్లాయ్ కలాన్'గా వ్యవహరిస్తారు. ల్లో అక్కడ తీవ్రచలితోపాటు మంచు కురుస్తుంది. అయితే. ఈ సారి గత రెండు దశాబ్దాల్లో లేని విధంగా మంచు వర్షం రికార్డయింది.

## గిరిజన ప్రాంతాల్లో బుల్లి సిలెండర్లు

### 1.57 లక్షల కుటుంబాలకు 'దీపం' కనెక్షన్లు

**రాజధాని ప్రతినిధి ,(అమరావతి) :** గిరిజన ప్రాంత ప్రజలకు 5 కేజీల గ్యాస్ సిలెండడర్లను దీపం పథకం కింద మంజూరు చేస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా దీపం పథకం కింద గ్యాస్ అందించి..కిరోసిన్ వాడకం తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడున్న 14.5 కేజీల సిలెండర్లు తీసుకెళ్లడం భారంగా ఉందనే ఉద్దేశంతో 1,57,443 కుటుంబాలకు దీపం పథకం ద్వారా చిన్న సిలెండర్లు అందించనుంది. ఇందుకోసం 'ప్రత్యేక అభివృద్ధి నిధి' నుంచి రూ.15 కోట్లు, గిరిజన సబ్‌ప్లాన్ నుంచి రూ.30 కోట్లు ఖర్చు చేయనుంది ఫిబ్రవరిలోనే ఈ బుల్లి సిలెండర్లను పంపిణీ చేయాలని గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకాదర్శి ఆర్పీ సిసోడియా విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బుల్లి సిలెండర్లకు రీఫిల్ చార్జీ రూ.330 చెల్లించాల్సి ఉంటుంది.

## కృష్ణపట్నంలో పతంజలి ఫుడ్ పార్క్

త్వరలో శంకుస్థాపన : బాబా రందేవ్



కృష్ణపట్నం పోర్టులో మాట్లాడుతున్న బాబా రాందేవ్

**నెల్లూరు :** కృష్ణపట్నం పోర్టు కేంద్రంగా దేశంలోనే అతి పెద్ద ఫుడ్ పార్కు ఏర్పాటు కానుంది. బాబా రాందేవ్ నిర్వహణలోని పతంజలి ఆయుర్వేద్ ఈ ఫుడ్ పార్కు ఏర్పాటు చేయనుంది. కృష్ణపట్నం పోర్టును సందర్శించిన రాందేవ్ ఈ విషయం ప్రకటించారు. కృష్ణపట్నం పోర్టులో పరిశ్రమలను ప్రోత్సహించే సుహృద్భావ వాతావరణం తమ కెంతో నచ్చిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఉన్న 15 ఏళ్ల మైత్రీబంధం, కృష్ణపట్నం పోర్టు నిర్వహణ నైపుణ్యం..... దక్షిణ భారతదేశంలో పతంజలి వ్యాపార విస్తరణకు కృష్ణపట్నం పోర్టును కేంద్రంగా ఎన్నుకునేందుకు దోహదం చేశాయని చెప్పారు. ఫుడ్‌పార్క్ స్థాపన నిర్ణయం త్వరలోనే కార్యరూపం దాల్చుతుందని తెలిపారు. పోర్టు యాజమాన్యంతో చర్చించి శంకుస్థాపన తేదీని నిర్ణయిస్తామన్నారు. శంకుస్థాపన చేసిన తేదీ నుంచి ఏడాదిలోగా తమ ఫుడ్ పార్కులో ఉత్పత్తి ప్రారంభమవుతుందని రాందేవ్ వివరించారు. వ్యాపారాని కంటే ప్రజల ప్రయోజనాలే ప్రధానంగా అతి పెద్ద విజన్‌తో పోర్టు ఛైర్మన్ చింతా విశ్వేశ్వరరావు పయనిస్తున్నారని ప్రశంసించారు.

### తిరుమల తిరుపతి దేవస్థానంతో కలిసి గో సంరక్షణ

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)తో కలిసి గో సంరక్షణ, సంవర్ధన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పతం జలి ఆయుర్వేద్ సిఇఒ ఆచార్య బాలకృష్ణ తెలిపారు. అధిక పాల దిగుబడి ఇచ్చే ఆవులను అభివృద్ధి చేసే దిశగా పరిశోధనలు చేస్తున్నట్టు వివరించారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించి రైతులు ప్రయోజనం పొందే కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నామన్నారు. ఆఫ్ లోగ్ జల్దీ శుభ్ సమాచార్ సునాయేంగే.. అంటూ ముక్తాయింపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు డైరెక్టర్ చింతా శ్రీధర్, సిఇఒ అనిల్ ఎండ్లూరి, పిఆర్ హెడ్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## 42 వేసవి ప్రత్యేక రైళ్లు

**రాజధాని ప్రతినిధి ,(గుంటూరు) :** వేసవీ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా 42 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నెంబర్ 07115 హైదరాబాద్ - కొచ్చువేలి ప్రత్యేక రైలు ఫిబ్రవరి 4, 11, 18 ,25, మార్చి 4,11,18,25, ఏప్రిల్ 1,8,15,22,29,మే 6, 13,20,27 జూన్ 3, 10,17,24 తేదీల్లో (శనివారం) రాత్రి 9 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్, నల్లగొండ, పిడుగురాళ్ల మీదుగా గుంటూరుకు చేరుకొంటుంది. అనంతరం తెనాలి, ఒంగోలు, నెల్లూరు,గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, అంబూర్, వనియంబాడి, జోలార్‌పెట్టాయి, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, కోయంబత్తూరు, పాలక్కాడ్, ఓటప్పాలెం, త్రిసూర్, అలువా, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, తిరువళ్లా, చెంగనూరు, కయాంకులం, కొల్లం మీదగా వేకువజామున 3.20 గంటలకు కొచ్చువేలి చేరుకొంటుంది. నెంబర్ 17116 కొచ్చువేలి హైదరాబాద్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 6,13,20,27, మార్చి 6, 13, 20, 27, ఏప్రిల్ 3,10,1,24,మే 1,8,15,22,29, జూన్ 5,12,19,26,(సోమవారం) తేదీల్లో రాత్రి 8.15 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై వేకువజాముమ 3.30 గంటలకు హైదరాబాద్ చేరుకొంటుంది. ఈ రైళ్లలో ఒక ఏసీ టూటైర్, రెండు ఏసీ త్రీటైర్, 10 స్లీపర్‌క్లాస్, రెండు ఎస్ఎల్ఆర్ కోచ్‌లు ఉంటాయి.

## ఘనంగా కాశీవిశ్వేశ్వరుని కల్యాణం

**తూర్పుగోదావరి :** అల్లవరం మండలం కొమరగిరిపట్నంలోని బాలత్రిపురసుందరీ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య భక్తుల శివనామ సర్మరణతో అత్యంత ఘనంగా జరిగింది. అమలాపురం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, పిఎస్ఇఎస్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు-శేషవేణి దంపతులతో అర్చకులు కల్యాణం నిర్వహించారు. వేద పండితుడు కొత్తలంక లక్ష్మణేశ్వరస్వామి ఆధ్వర్యంలో బాదంపూడి ఫణిశర్మ బ్రహ్మత్వాన బాలత్రిపురసుందరీ-కాశీవిశ్వేరుల కల్యాణం జరిగింది. ఆలయ చైర్మన్ మెట్ల నరసింహంతో పాటు గ్రామస్తులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బాలయోగి తపో ఆశ్రమాన్ని సందర్శించిన విదేశీయులు

**తూర్పుగోదావరి :** కోనసీమలో ప్రసిద్ధి చెందిన ముమ్మిడివరం భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని విదేశీ యాత్రికుల బృందం సందర్శించింది. ఫ్రాన్స్ దేశానికి చెందిన ప్యాట్రిక్, స్విట్జర్లాండ్‌కు చెందిన మెరికోల ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, బెల్జియం దేశాలకు చెందిన 30 మంది విదేశీ యాత్రికుల బృందం తపో ఆశ్రమాన్ని సందర్శించారు. భారతదేశంలో ఆధ్మాత్మికంగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను ఈ బృందం సందర్శిస్తూ ముమ్మిడివరం చేరుకుంది. శ్రీ భగవాన్ పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకుని అక్కడ ధాన్యం చేసుకున్నారు. బాలయోగీశ్వరుల విశిష్టతను ప్యాట్రిక్ సందర్శకులకు వివరించారు. ఆధ్యాత్మికంగా, మానసికంగా ఈ తపో ఆశ్రమంలో ప్రశాంతత ఉంటుందని ఆయన వివరించారు. విదేశీ యాత్రికులకు తపో ఆశ్రమ కమిటీ, బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు ఆతిధ్యం ఇచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.వెంకటరమణ, ఎం.మార్కండేయులు, కె.రామకృష్ణ, బి.శివనాగరాజు, చినసుబ్బారావు, సత్యనారాయణ తదితరులు ఇక్కడ ఆలయ విశిష్టతను వివరించారు.

## బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి స్నానాలు



**తూర్పుగోదావరి :** కోనసీమ పరిధి కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి అమావాస్య ప్రతి ఏటా పుష్యమాసంలో అమావాస్య తిథినాడు చొల్లంగి స్నానాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరుపుతారు. కోనసీమలో పలు ప్రాంతాల్లో చొల్లంగి జరిగినప్పటికి బ్రమ్మ సమేధ్యానికి మాత్రం ప్రత్యేకత ఉంది. ఈ బ్రమ్మ సమేధ్యం కాట్రేనికోనకు 12కి.మీ. దూరంలో సముద్ర తీరంలో ఉంది. ఈ ప్రదేశంలో బ్రహ్మేశ్వరుడు, కాలభైరవుడు, దుర్గాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, గణపతి కొలువుతీరి ఉన్నారు. ప్రతి ఏటా చొల్లంగి అమావాస్య ముందురోజే భక్తులు చొల్లంగి చేరుకుంటారు. రాత్రి సమయంలో భక్తులు భజనలు, పురాణ కాలక్షేపాలతో గడిపి ఉదయాన్నే సముద్ర స్నానంచేసి బ్రహ్మేశ్వరుడిని పూజిస్తారు. సంతానంలేని మహిళలు రాత్రి సమయంలో బ్రహ్మేశ్వరుని ఆలయంలో గడుపుతారు. అలా నిద్రించిన మహిళలకు స్వప్నంలో బ్రహ్మేశ్వరుడు కనిపిస్తే వారు తప్పక గర్భవతులు అవుతారని కథనం. అమావాస్య నాటి ఉదయం సముద్రం నుండి సూర్యభగవానుడు ఉదయించడంతో భక్తులందరూ తన్మయత్వం పొందుతారు. ఇక్కడికి వచ్చే భక్తుల కోసం ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లి దేవబ్రాహ్మణ అన్నసత్రం ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేస్తారు.

## సోలార్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ప్రారంభించిన హోంమంత్రి



**రాజధాని ప్రతినిధి, కోనసీమ-అమలాపురం :** కోనసీమ కేంద్రమైన అమలాపురం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో సోలార్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇక నుండి అమలాపురం పట్టణంలో ఏవిధమైన ట్రాఫిక్ సమస్యలకు అంతరాయ ఏర్పడదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలను పాటించడం వలన ప్రమాదాల జరగవని అన్నారు. ఏవిధమైన అనర్థాలు జరగకుండా సోలార్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థలో వెబ్ కేమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని వలన గడియార స్తంభం సెంటర్ చుట్టూ ఉన్న పరిసరాలపై నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, ఆర్డీవో జి.గణేష్‌కుమార్, ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కర్రి దత్తుడు, పెచ్చెట్టి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## జయరామ్ మోటార్ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌పై అవగాహన




**రాజధాని ప్రతినిధి, కోనసీమ-అమలాపురం :** జయరామ్ మోటారు ఆధ్వర్యంలోడ్రైవింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారులపై వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలను ఎలా నివారించువచ్చు అనే అంశంపై పట్టణానికి చెందిన జయరామ్ హీరో హోండా షోరూమ్ యాజమాన్యం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మోటారు సైకిల్ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, కుడుపూడి చిట్టబ్బాయి ప్రారంభించారు. కంపెనీ సేల్స్ మేనేజర్ యోగానంద్ మాట్లాడుతూ ప్రయాణీకులు రోడ్లపై వెళుతున్న సమయంలో సిగ్నల్స్ వ్యవస్థను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టవచ్చుని ఆయన సూచించారు. నూతనంగా మార్కెట్‌లోకి విడుదలైన హీరో అచీవర్ వాహనాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ అధినేత వంకాయల రాజా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, సిద్ధివినాయక మెకానిక్ యూనియన్ అధ్యక్షులు గుద్దటి రెడ్డినాయుడు, సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీను, ఏఎంసి ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి, ఆశెట్టి ఆదిబాబు, వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గా ఏర్పాటుకు స్థలం కేటాయించండి

**ఎంపి ఆసదుద్దీన్ లేఖను కలెక్టర్‌కు అందించిన బాజిత్‌బాష**



**రాజధాని ప్రతినిధి,గుంటూరు :** గుంటూరు నగరంలో ముస్లింల కోసం ఈద్గా ఏర్పాటు చేయాలని కోరుతూ మైనార్టీ నాయకుడు ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షులు బాజిత్‌బాషాలు జిల్లా కలెక్టర్ ను కోరారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు సుబాని తో పాటు ఎంఐఎం పార్టీ నేతలు కలెక్టర్ కాంతిలాల్ దండే ను కలిసారు. ఆల్ ఇండియా మజ్లిస్ పార్టీ అధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసి కూడా గుంటూరు నగరంలో ఈద్గా ఏర్పాటు కు ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతు రాసిన లేఖను జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే కు కలిసి అందించారు. ఈ సందర్భంగా మాజీశాసనసభ్యులు మాజీ ఎమ్మెల్యే నంబూరు సుబాని మాట్లాడుతూ గుంటూరు నగరంలో సుమారు 2.50 లక్షల ముస్లిం జనాభా ఉన్నారని అన్నారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం ఈద్గాలో ప్రార్ధనలు నిర్వహించడానికి ఎటువంటి స్థలం కేటాయించలేదని అన్నారు. పవిత్రమైన పండుగ దినాల్లో ప్రార్ధనలు నిర్వహించుకునేందుకు ఎటువంటి ఈద్గా స్థలం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గుంటూరు నగర ముస్లింల కోసం ఈద్గా ఏర్పాటు కు 5 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే కు విజ్ఞప్తి చేశారు. గుంటూరు నగర ఎంఐఎం పార్టీ అధ్యక్షులు బాజిత్‌బాష మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని ప్రాంతం అయిన గుంటూరు నగరంలో ఈద్గా కు ప్రభుత్వ స్థలం లేకుండా పోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్రంలో అత్యంత ముస్లిం జనాభా ఎక్కువగా కలిగిన గుంటూరు నగరంలో ఈద్గా ఏర్పాటు కు అన్ని రాజకీయ పార్టీల నుండి వినతులు వస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి ఈద్గా కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రభుత్వ ఖాజి ముఫ్తి జావిద్, మైనార్టీ నాయకులు అమీన్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జీ రహీమ్, ఎంఐఎం నాయకులు ఫజల్ అహ్మద్ అలీఖాన్,తదితరులు పాల్గొన్నారు.

# నశీర్ అహమ్మద్‌కు జాతీయ అవార్డు



గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన సుప్రసిద్ధ చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత శ్రీ సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు 'లోకబంధు సద్భావనా సమ్మాన్' జాతీయ అవార్డు లభించింది. గత రెండు దశాబ్దాలుగా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పరిశోధిస్తూ వెలుగులోకి రాని విశిష్ట సమాచారాన్ని వెలికి తీసి వందలాది వ్యాసాలు, పదమూడు పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించడం ద్వారా తెలుగు ప్రజలకు అలనాటి చారిత్రక సమాచారాన్ని అందజేస్తున్న నశీర్ అహమ్మద్ నిరంతర కృషికి గుర్తింపుగా 'లోకబంధు సద్భావనా సమ్మాన్' ను ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాజధాని లక్నోకు చెందిన 'లోకబంధు రాజ్ నారాయణ్ కే లోగ్' ట్రస్ట్ ప్రకటించింది. జనవరి 29న లక్నోలో జస్టిస్ రాజేంద్రనాథ్ సచ్చార్ సమక్షంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో 'లోకబంధు రాజ్ నారాయణ్ కే లోగ్' చెందిన డాక్టర్ అఖిలేష్ సక్సేనా, ప్రముఖ రచయిత సామాజిక కార్యకర్త, ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ నశీర్ అహమ్మద్ తన చరిత్ర గ్రంథాల ద్వారా మతసామరస్యాన్ని, భారత దేశంలోని విభిన్న జనసముదాయాల మధ్యనున్న స్నేహ-సౌభ్రాతృత్వ వాతావరణాన్ని మరింత పటిష్టం చేయడానికి, 'భిన్నత్వంలో ఏకత్వం-ఏకత్వంలో భిన్నత్వం' అంతసూత్రంగా సాగుతున్న భారతీయ జనసముదాయాలలోని సద్భావనను మరింతగా బలోపేతం చేయడానికి 20 ఏండ్లుగా సాగిస్తున్న కృషికి గుర్తింపుగా 'లోకబంధు సద్భావనా సమ్మాన్' ప్రదానం చేసినట్టు 'లోకబంధు రాజ్ నారాయణ్ కే లోగ్' ట్రస్ట్ ప్రకటించింది.

# వైభవంగా చొల్లంగి తీర్ధం



**తూర్పుగోదావరి :** సముద్ర తీరాన ప్రతి ఏటా చొల్లంగి అమావాస్య రోజున లక్షలాది జనంతో కిటకిటలాడుతుంది. సముద్ర ఘోషలో భక్తుల సందడి నెలకొంటుంది. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామంలో 300 ఏళ్ళుగా జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చొల్లంగి శ్రీఆంజనేయస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ కాశి గోవిందరాజు, దేవస్థానం ఈవో ఏవి.దుర్గాభవాని ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ దేవాలయానికి పెద్ద చరిత్ర ఉంది. శ్రీమంత్రాలయ రాఘవేంద్రస్వామివారి మొదటి అవతారం వ్యాసరాయలవారు ఒకసారి ఉత్తరాది యాత్రకు ఈ మార్గాన ప్రయాణిస్తుండగా వారికి స్వప్నంలో హనుమంతుడు కనిపించి చొల్లంగిలో తాను భూమిలో ఉన్నానని పైకి తీసి పూజించమని చెప్పడంతో అక్కడ ఒక ఆలయం ఏర్పడింది. కొంతకాలంగా మళ్లీ అది శిథిలమై స్వామి విగ్రహం భూమిలో మరుగున పడింది. మరికొంత కాలం తరువాత దేవరకొండ వ్యాసరావు పంతులుకి స్వామి కలలో కనిపించి తనును పైకితీసి ఆలయం నిర్మించాల్సిందిగా కోరారు. అలా స్వామి కోరిక మేర ఆలయ నిర్మాణం జరిగింది. ఈ ప్రాంతంలో శ్రీవేంకటేశ్వరుని ఆలయం, చంద్రుడు ప్రతిష్ఠించిన శ్రీసోమేశ్వరాలయం ఉన్నాయి. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే శ్రీసోమేశ్వరాలయంలో స్మార్త శైవాగమన పద్దతిలో, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైష్ణవి పద్దతిలో, శ్రీఆంజనేయస్వామి ఆలయంలో మధసంప్రదాయంలో పూజలు జరుగుతాయి. ఈ ప్రదేశంలో ఏకకాలంలో మూడు రకాల సంప్రదాయ పూజలు జరగడం కనిపిస్తుంది.

# అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసిన డిప్యూటి సీఎం



**రాజధాని ప్రతినిధి, అమలాపురం :** అమలాపురం పరిధిలో అనధికారికంగా ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని రాష్ట్ర ఉపముఖ్యంత్రి మరియు హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీ కౌన్సిల్‌లో ఇటీవలే ఈ ఫ్లెక్సీల గురించి చర్చిండం జరిగినా ఈ విషయంపై రెవెన్యూ మరియు మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుండి అమలాపురం పట్టణంలో ఏ ఫ్లెక్సీ ప్రదర్శించినా ముందస్తుగా సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. లేనిచో దీనిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించడం లేదా జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అమలాపురం పరిధిలో ఫ్లెక్సీలను ముఖ్యంగా గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం చుట్టూ ఇష్టారాజ్యంగా పెడుతున్నారని, దీని వలన పలు అనర్థాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. హోర్డింగులు ఈవిధంగా ఉండిపోవడం వలన ప్రజలపై జారిపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇక నుండి ఏవిధమైన ఫ్లెక్సీలను అయినా అనుమతి లేకుండా ప్రదర్శించరాదన్నారు. ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన నాటి నుండి మూడు రోజులు పాటు మాత్రమే ఫ్లెక్సీల ప్రదర్శనకు అనుమతి అని, మూడు రోజులు దాటితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఫ్లెక్సీలో వారి పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలన్నారు. మూడు రోజులు ప్రదర్శన అనంతరం వారు స్వచ్ఛందంగా ఫ్లెక్సీలను తొలగించాలి. లేనిచో సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం జరుగతుందని హోంమంత్రి పేర్కొన్నారు.

## గాంధీజీ వర్ధంతి..
## ఘన నివాళులు

**రాజధానిప్రతినిధి ,కోనసీమ-జిఎన్.రావ్ :** మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అమలాపురం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్దనున్న మహాత్ముని విగ్రహానికి పూలమాలలవేసి నివాళులు అర్పించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు.ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం నేతలు కొమ్మూరి సుభాష్, ఎండూరి రమణకుమార్, వరదా చరణ్‌కుమార్, వైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండూరి నాగేశ్వరరావు, నంబూరి మూర్తిబాబు, వరదా సూరిబాబు, నంబూరి నరేష్, మాజేటి పుల్లేశ్వరరావు, అప్పన వీరన్న తదితరులు పాల్గొన్నారు. ముమ్మిడివరంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ లంకతల్లెమ్మ ఆలయం సెంటర్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సాధనకు గాంధీ చేసిన సేవలు, పోరాటాన్ని జాతి ఎన్నటికి మరువలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స జగ్గపరాజు, గోదశి నాగేశ్వరరావు, మానేపల్లి సత్యనారాయణ, గణేశుల బ్రహ్మానందం, పి.ఉదయ్‌భాస్కర్‌వర్మ, వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అల్లవరం మండలపరిషత్ కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో చింతా ఝాన్సీలక్ష్మీగౌరి, వైస్‌ఎంపిపి అడపా ఉమాసుందరి, ఎంపిడివో వి.శాంతామణి తదితరులు పాల్గొన్నారు. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ ఉన్నత పాఠశాలలో గాంధీ వర్ధంతి సందర్భంగా జడ్పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ మహాత్ముని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శిరంగు రాజా, చీకట్ల సత్తిబాబు తదితరలు పాల్గొన్నారు.

## కోనసీమ అభివృద్ధి సాధన సమితి నూతన కమిటి



**రాజధాని ప్రతినిధి, అమలాపురం ప్రతినిధి :** కోనసీమ అభివృద్ధి సాధన సమితి సమావేశం ఆర్‌వి.నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి సత్యానందం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా బండి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఆనాల ధర్మారావు, మోకా వెంకటసుబ్బారావు, గాడి సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా కముజు గంగాధరరావు, ప్లానింగ్ కార్యదర్శి ఎస్.ఆదిత్యకిరణ్, కార్యదర్శిగా వాడపల్లి సూరిబాబు, కోశాధికారిగా అడ్డగళ్ళ సాయిరామ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా విశేష సేవలు అందించిన ఆర్‌వి.నాయుడును ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సంస్థ గౌరవాధ్యక్షుడిగా ఆర్‌వి.నాయుడును ఎంపిక చేశారు.

## అంతర్వేది లక్ష్మీనరసింహుని పరకామణి రూ.13.30లక్షలు

**రాజధాని ప్రతినిధి, కోనసీమ-జిఎన్.రావ్ :** తూర్పుగోదావరి : కోనసీమలో ప్రసిద్ధి చెందిన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పరిధిలోని పలు ఆలయ హుండీలను సహాయ కమిషనర్ చిక్కాల వెంకటరావు, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించారు. లక్ష్మీనరసింహుని ఆలయంలో ప్రధాన హుండీ ద్వారా రూ.12,56,688, గుఱ్ఱాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.30,044. అన్నదాన పథక ఆదాయం రూ.16,710. డాలర్లు రూ.33,500తో కలసి మొత్తం రూ.13లక్షల 30వేల 942 ఆదాయం వచ్చింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ సేవా కమిటీ అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు, ట్రస్టుబోర్డు సభ్యుడు వీరా మల్లిబాబు, తిరుమాని ఆచార్యులు, శంకరగుప్తం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా సత్యనారాయణరెడ్డి



**రాజధానిప్రతినిధి ,కోనసీమ-జిఎన్.రావ్ :** వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 103వ గవర్నర్‌గా అమలాపురం పట్టణానికి తేతలి సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈయన 2006 నుండి 2016 వరకు వాకర్స్ క్లబ్‌లో వివిధ స్థాయిలో పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

## కాపు కార్పోరేషన్ ద్వారా కాపులకు ప్రత్యేక పథకాలు : యర్రా



**రాజధానిప్రతినిధి ,కోనసీమ-జిఎన్.రావ్ :** కాపు కార్పోరేషన్ ద్వారా కాపు అనుబంధ కులాలకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని కాపు కార్పోరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాలరాయుడు తెలిపారు. అమలాపురం టిటిడిసిలో జరిగిన శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ యర్రా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు. కాపు కార్పోరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ కన్సల్‌టెంట్ రమేష్‌కుమార్, రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్లామిక్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు సానుకూల స్పందన



**రాజధాని ప్రతినిధి,గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో ఇస్లామిక్ రీసెర్చ్ కల్చరల్ మరియు కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు కు కేంద్ర మైనార్టీ మంత్రిత్వ శాఖ నుండి సానుకూల లభించిందని గుంటూరు జిల్లా వ్యవసాయమార్కెటింగ్ కమిటి డైరెక్టర్ మాజీ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యాక్షులు షేక్ షంషుపీర్ జాదా అన్నారు. లాలాపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాదా మాట్లాడుతూ గుంటూరు నగరంలో రూ. 2 లక్షల రూ. 50 వేల మంది ముస్లింలు ఉన్నారని అన్నారు. ప్రతి సంవత్సరం ముస్లింలు పండుగలకు ప్రార్ధనలు జరుపుకోవడానికి ఈద్గా లేకుండా పోయిందని అన్నారు. ఇస్లామిక్ రీసెర్చ్ సెంటర్ కోసం రాజధాని నగరంలో 25 ఎకరాల స్థలం మరియు గుంటూరు నగరంలో ఈద్గా ఏర్పాటు కోసం 5 ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ కేంద్ర మైనార్టీ మంత్రిత్వ శాఖ మరియు విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు లకు లేఖ వ్రాసినట్లుగా చెప్పారు. దీనికి ఆయా మంత్రిత్వ శాఖల నుండి రాష్ట్ర మైనార్టీ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక అధికారి పరిశీల నిమిత్తం లేఖ వచ్చిందని అన్నారు. అదే విధంగా బిజేపి పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు సైతం సానుకూలంగా స్పందిస్తూ జిల్లా కలెక్టర్ కు పరిశీలిన నిమిత్తం పంపించారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా పేష్ ఇమామ్‌లు మౌజన్ లకు గౌరవ వేతనం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## అభిమానులకు మెగా న్యూస్

### చిరంజీవి– పవన్ కళ్యాణ్ డైరక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్.. కాంబినేషన్‌లో సినిమా

ప్రేక్షకులకు అమితానందాన్ని కలిగించే కాంబినేషన్‌లో భారీ సినిమా ప్రకటను టి. సుబ్బరామిరెడ్డి ప్రకటించడం ఆశామాషీ విషయం కాదు. మరో నిర్మాత అశ్వనీదత్ కలిసి ఈ సినిమా నిర్మిస్తాం అంటున్నా సినిమా పట్టాలు ఎక్కేదాకా నమ్మలేం. ఎందుకంటే త్రివిక్రమ్ వరుసగా మూడు సినిమాలు చేయాల్సి వుంది. అలాగే పవన్ మూడు సినిమాలు చేయాల్సి వుంది. మెగాస్టార్ రెండు సినిమాలు చేయాల్సి వుంది. వాటి తరువాతనే ఈ సినిమా... అంతవరకు ప్రేక్షకులు ఓపిక పట్టవల్సిందే...

ఈ సినిమాకు 200 కోట్లలో రేంజ్ వుంటుంది. ఎందుకంటే ఈ ముగ్గురి క్రేజీ కాంబినేషన్ అలాంటిది కదా? ప్రస్తుతం పవన్‌కల్యాణ్ 2019 కాల్ షీట్లు లేవు. ఆపైనే నిర్మాణం ..అంతవరకు అభిమానులు ఆగవలసిందే..

# మాస్ ఎంటర్‌టైనర్ 'నేను లోకల్'

సహజనటనతో దూసుకుపోతున్న నాని వరుస హిట్లతో దూకుడుమీదున్నాడు. తాజాగా నేను లోకల్ అంటూ మళ్లీ వెండి తెరమీదకొచ్చాడు. త్రినాథరావు డైరెక్షన్లో దిల్ రాజు నిర్మాణంలో వచ్చిన ఈ సినిమాలో కీర్తిసురేష్ హీరోయిన్ గా నటించింది. దేవీ శ్రీప్రసాద్ సంగీతం. నేను లోకల్ సినిమా నాని ఖాతాలో మరో హిట్ ను జోడించిందో లేదో చూద్దాం.

**కథ :** బాబు(నాని) ఆడుతూపాడుతూ ఉల్లాసంగా తిరిగే ఓ కాలేజ్ స్టూడెంట్. బాధ్యతలేవీలేని బాబు, లవ్ ఎట్ ఫస్ట్ సైట్ లో కీర్తి(కీర్తి సురేష్)తో లవ్ లో పడతాడు. అయితే, బాబు ఇచ్చే సర్ప్రైజ్ లకు ఇబ్బందిపడ్డా మొత్తానికి బాబుతో లవ్ లో పడుతుంది కీర్తి. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. కీర్తి ప్రేమ విషయంలో బాబు అనేక ఇబ్బందుల్లో పడతాడు. వీటన్నిటినీ ఎదుర్కొని కీర్తి లవ్ ని బాబు ఎలా సక్సెస్ చేసుకుంటాడు అనేదే కథ.

**విశ్లేషణ :** సినిమా చూసిన తర్వాత కేవలం నానిని ద ృష్టిలో పెట్టుకునే డైరెక్టర్ కథను అల్లాడనిపిస్తోంది. సినిమా మొత్తం నాని ఒంటిచేత్తో కథనడిపాడు. మొదటి సగభాగం ఎక్కడా బోర్ అనిపించదు. ముఖ్యంగా పాటలు, టెక్నికల్ వాల్యూస్ విషయంలో సినిమా ఆకట్టుకుంటుంది. ఇక ఇంటర్వెల్ ఎపిసోడ్ సినిమాని పీక్ స్టేజ్ కి తీసుకెళ్తుంది.

రెండో భాగం వచ్చేసరికి కథలో కొత్తదనం లేదనిపించినా నానినటన, కామెడీ టైమింగ్ ఆడియన్స్ కు సినిమా బోర్ అనిపించదు. కొన్ని సీన్లు మాత్రం సాగదీతగా అనిపించాయి. అయితే, క్లైమాక్స్ ముందు మాత్రం ఆడియన్స్‌నుఇ ఆకట్టుకుంటుంది. సినిమా చివరిలో ఎమోషనల్, హార్ట్ టచింగ్ సన్నివేశాలు సినిమాకే హైలైట్ గా నిలిచి రక్తి కట్టించాయి. మొత్తంగా నేను లోకల్ సినిమా కథ సింపుల్ గా అనిపించినప్పటికీ డైరెక్టర్ కథనాన్ని ఆసక్తికరంగా మలిచాడనే చెప్పాలి. స్క్రీన్ ప్లే, డైలాగ్స్ సినిమాకు హైలైట్. ఇక, మ్యూజిక్, కెమెరా, ప్రొడక్షన్ వాల్యూస్ బావున్నాయి. మొత్తంమీద సినిమాని త్రినాథరావు ఆసక్తికరంగానే తెరకెక్కించాడని చెప్పొచ్చు.

**నటీనటుల పనితీరు :** నాని నటన, కామెడీ టైమింగ్ మాస్ ప్రేక్షకుల్ని బాగా అలరించాయి. హీరోయిన్ కీర్తి సురేష్, అందం, అభినయం లవ్ ట్రాక్ కు మంచి మార్కులు పడేలా చేయగా, కీర్తి నటన సూపర్బ్ అనిపించింది. సచిన్ ఖేదేకర్, పోసాని క ృష్ణమురళి, ఈశ్వరి రావు నటన సినిమాకు కీలకంకాగా, మిగతా నటీనటులంతా వాళ్లపరిదిమేరకు మెప్పించారు. నేను లోకల్ ఒక పూర్తిస్థాయి మాస్, రొమాంటిక్ ఎంటర్ టైనర్, నాని మ్యాజిక్, కీర్తి సురేష్ నటన సినిమాను బాక్సాఫీస్ దగ్గర నిలబెడతాయనే చెప్పాలి.




సినిమా

## ఉత్తరాఖండ్‌లో రాజకీయ 'బాహుబలి'

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరాఖండ్ కాంగ్రెస్ పార్టీ 'బాహుబలి'ని వాడుకుంటోంది. సోషల్ మీడియా పరిధి విస్తరణలో భాగంగా రాజకీయ పార్టీలు ఆ దిశగానే ఎక్కువ కసరత్తు చేస్తున్నాయి. సినిమాటిక్ దారిని ఎంచుకున్న అక్కడి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం ఏకంగా 'బాహుబలి' సినిమా ఇమేజ్ ని వాడేసుకుంది. ఓపెనింగ్ సాంగ్ ఆడియో మీద వీడియోను మార్చి చేసిన ప్రయోగం ఇప్పుడు ఇంటర్నెట్‌లో అదరగొడుతోంది. ప్రభాస్ ప్లేస్ లో సీఎం హరీష్ రావత్, మిగతా పాత్రల్లో మోదీ, అమిత్ షా లాంటి పొలిటికల్ పర్సనాలిటీలను ప్రవేశపెట్టిన ఈ వీడియో మంచి పాపులారిటీ కొట్టేసింది.

– ఖాన్



## అధికారంలోకి వస్తే కర్ఫ్యూ



**లక్నో :** భారత సర్వోన్నత న్యాయస్థానం మతం, కులం ఆధారంగా ఓట్లు అడగకూడదని తెలిపినప్పటికీ బీజేపీకి చెందిన ఆ రాష్ట్ర ఎమ్మెల్యే సురేష్ రానా తాము అధికారం లోకి వస్తే మూడు జిల్లాలలో కర్ఫ్యూ విధిస్తా మన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కై రానా, దేవ్‌చంద్, మొంరాదాబాద్ జిల్లాలలో అధిక శాతం ముస్లింలు ఉన్నారు. ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రానా వ్యాఖ్యలు ముస్లింల మనోభావాలను దెబ్బ తీసేలాగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ఒక బాధ్యతామైన బీజేపీ ఉపాధ్యక్షపదవిలో ఉన్న రానా ఇలాంటి వ్యాఖ్యలు చేయటం సమంజసం కాదని ప్రతిపక్షాలు మండి పడుతున్నాయి.

## మైనార్టీ ఉపకార వేతనాలు

**రాజధాని ప్రతినిధి– అమరావతి :** మైనారిటీల విద్యార్థినీ, విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేస్తోంది. ప్రతి సంవత్సరం ఈ స్కాలర్‌షిప్పుల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవచ్చు. ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీలు కూడా ఈ స్కాలర్‌షిప్పును పొందవచ్చు. వివరములకు apsmfe.com ను పరిశీలించండి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి వివిధ కోర్సుల్లో యువతకు వృత్తి ఉద్యోగాల శిక్షణ నిస్తోంది.. ఆసక్తి గల అభ్యర్థులు apsmfe.com వెబ్‌సైట్‌లో వృత్తి,విద్యా కోర్సుల కోసం సంప్రదించగలరు. మొబైల్ ఫోన్ రిపేర్ , డి.టి.పి, ఆఫీసు అసిస్టెంటు, మెకానికల్, ఆటోగ్యారేజ్, కంప్యూటర్ హార్డ్‌వేర్, కస్టమర్ రిలేషన్,సోషల్ టెక్నీషియన్‌కు దరఖాస్తులు కోరుతున్నారు.

## మహిళల వృత్తి శిక్షణ కార్యక్రమాల ప్రామాణాలు, మౌలిక సదుపాయాలు

### ఆర్థిక సంస్థ డైరక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవి వెల్లడి



**అన్నంరెడ్డి సుబ్బారావు, రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం :** రాష్ట్రంలోని 13 జిల్లాల పేద యువతులు మహిళల ఆర్థికాభివృద్ధికి, ఉపాధి వృత్తి శిక్షణకు ఆయా జిల్లాలలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాల ద్వారా అమలు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల పరిశీలనలో రెండు ఎక్స్‌ఫర్ట్ కమిటీలను ఆంధ్రప్రదేశ్ మహిళా కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ పాలకవర్గం నియమించిందని పాలకవర్గం డైరెక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవి చెప్పారు. పాలకవర్గం సమావేశం అమరావతి దగ్గర గల ఉండవల్లిలోని కార్పోరేషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షత జరిగినట్లు విలేకర్లకు తెలిపారు. శిక్షణ కేంద్రాలలో జరిగే శిక్షణ కార్యక్రమాల ప్రామాణాలను మహళా నాణ్యమైనవిగా రూపొందించటానికి శిక్షణ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు పెంచటానికి అవసరమైన సిఫారసులను ఈ ఎక్స్‌ఫర్ట్ కమిటీలు రూపొందిస్తామని మేఘలాదేవి తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల జోన్‌కు సంబంధించి ఎక్స్‌ఫర్ట్ కమిటీకి తాను చైర్‌పర్సన్ ఉంటానని ఆమె వివరించారు.రాష్ట్రంలోని 13 జిల్లాలో 5 వేల మంది కాపు,బలిజ, ఒంటరి, తెలగా కులాలకు చెందిన పేద యువతులు, మహిళలకు వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటానికి ఎ.పి. కార్య వెల్ఫేర్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ సమకూర్చిన రూ.6 కోట్లు రూపాయలు నిధులతో ఎం.పి. మహిళల సహకార సంస్థ యాజమాన్యంలోని 13 జిల్లాలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

# ట్రంప్ దుందుడుకు చర్యలు

ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక ప్రపంచదేశాలు అమెరికా గురించి రాసుకోవడానికి ఇకపై బోల్డు వార్తలు ఉన్నాయి. అలాగే అమెరికా వార్తా పత్రికల ఇకపై రీములు కొద్దీ రాసుకోవచ్చు. ఎందుకంటే దుందుడుకు జాత్యాహంకారి, మతోన్మాది ట్రంప్ గురించి ఆయన అప్రజాసామ్విక చర్యలు, రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు ఎంతరాసినా తక్కువే... ఏడు ముస్లిం దేశాల ప్రజలను దేశంలోకి నాలుగు నెలలపాటు దేశంలోకి అనుమతించకుండ ట్రంప్ కార్యనిర్వహక ఉత్తర్వుపై జనవరి 28న సంతకం చేయడంతో అధ్యక్షుడి అసలురూపం బయటకు వచ్చింది. దీన్ని ప్రపంచ దేశాలన్నీ ముక్త కంఠంతో ఖండించాయి. ఈ నిర్ణయం దేశ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని మహిళాన్యాయమూర్తి ఎన్ డొనెల్లి నిరసిస్తూ ట్రంప్ ఆంక్షలను తాత్కాలికంగా నిలిపి వేశారు. ఆమెకు న్యాయశాస్త్రంలో చాల అనుభవం ఉంది. మిగతా ఫెడరల్ జడ్జిలు కూడా ఆమెకు మద్దతుగా నిలిచారు. ఇదే సమయంలో ట్రంప్ పై నిరసనలు జ్వాలలు రేగాయి.

**అటార్నీ జనరల్స్ ఖండన**

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏడు ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం డెమాక్రాట్లు, జనరల్స్ సంయుక్తంగా ఖండించారు. కాలిఫోర్నియా, న్యూయార్క్ లతో సహా 16 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ వలసలను నిరోధించే చట్టాన్ని వ్యతిరేకించారు.

**బ్రిటన్ హెచ్చరిక**

తమ దేశ పౌరులకు ఇబ్బందికలిగితే జోక్యం చేసుకుంటామని బ్రిటన్ స్పష్టం చేయగా, స్వదేశంలోనూ, విదేశంలోనూ తమ దేశ పౌరుల హక్కులను, స్వేచ్ఛన పరిరక్షిస్తామని జాతి ఆధారంగా విభజన, విద్వేషాలకు దిగడం చాలా పొరపాటని ఆదేశ విదేశాంగ కార్యదర్శి జోరిస్ జాన్సన్ ట్విటర్‌లో తెలిపారు.

**ట్రంప్ నిర్ణయం తప్పు : స్వీడన్**

ట్రంప్ నిర్ణయం తప్పని స్వీడన్ ఉపప్రధాని, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డీడియర్ బుర్ఖాల్టర్ విమర్శించారు. అమెరికా తప్పుదారిలో నడుస్తోందన్నారు. యుద్ధం కారణంగా ఏర్పడ్డ క్లిష్టపరిస్థితుల్లో పొరుగు దేశాలనుంచి వలస వచ్చే వారిని మానవత్వంతో అన్నిదేశాలు ఆహ్వానించాలన్న జెనీవా సదస్సు నిర్ణయాన్ని బుర్ఖాల్టర్ గుర్తు చేశారు.

**డచ్ ప్రధాని ఖండన**

యుద్ధ ,హింసోన్మాదం నేపథ్యంలో దేశాన్ని వదిలే శరణార్థులకు వారికి నచ్చిన చోట ఉండే హక్కు ఉందన్నారు. మతాల పేరుతో శరణార్థుల వ్యవస్థను అమెరికా అవమానిస్తుందన్నారు.

**ముస్లింలను అవమానించడమే : ఇరాన్**

ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశాలు ప్రపంచంలోని ముస్లిం సమాజాన్ని అవమానిస్తున్నారనడానికి స్పష్టమైన సంకేతాలని ఇరాన్ ధ్వజమెత్తింది. ఈ ఆదేశాలపై జర్మనీ అధ్యక్షురాలు ఏంజిలా మెర్కల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. యుద్ధంలో జరిగే దేశాల నుంచి ఆశ్రయం కోరుతూ వచ్చేవారికి ఆశ్రయం కల్పించడం ఓ బాధ్యతని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్‌మార్క్ అరియాల్ట్ అన్నారు.

**అటార్నీ జనరల్‌పై వేటు**

ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి సహకరించడం లేదన్న కారణంతో తాత్కాలిక అటార్నీ జనరల్ (న్యాయ శాఖ అధిపతి) సలే యాట్స్‌ను పదవి నుంచి తొలగించారు. 'అమెరికన్ల ప్రయోజనం కోసం జారీ అయిన కార్యనిర్వాహక ఉత్తర్వులను సమర్థించకుండా ఆమె(సలే యాట్స్) విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారు. అందుకే ఆమెను పదవినుంచి తొలిగించాం'అని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. వర్జీనియా అటార్నీగా పనిచేస్తోన్న డనా బౌంటేను నూతన (తాత్కాలిక )అటార్నీ జనరల్‌గా నియమించారు. జనవరి 30 రాత్రి ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ముస్లిం దేశాలపై ట్రంప్ జారీచేసిన ఉత్తర్వులను ఫెడరల్ కోర్టులు నిలిపివేసిన నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ న్యాయశాఖ వాదనలు వినిపించాల్సిఉంది. అయితే సలే యాట్స్ మాత్రం ట్రంప్ నిషేధ నిర్ణయానికి అనుకూలంగా వాదించబోనని మొండిపట్టుదల ప్రదర్శిస్తూ, ట్రంప్‌ను సమర్థించవద్దంటూ సహచర లాయర్లకు లేఖలు కూడా రాశారు. అటార్నీ జనరల్ పదవిలోఉండి ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఒబామాచేత నియమితురాలైన అధికారులు మా పనికి అడుగడుగునా అడ్డుపడుతున్నారు'అని సలే యాట్స్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు.

**భయమొద్దు : టెక్ దిగ్గజాలు**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన పనికి మొత్తం ప్రపంచ నివ్వెరపోతుండగా ఇప్పటికే అమెరికాలో ఉన్న వలసదారులు వణికిపోతున్నారు. ముఖ్యంగా వివిధ ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తున్న ముస్లింలు బెంబేలెత్తిపోతున్నారు. ఆయా కంపెనీల్లో పనిచేస్తున్న ముస్లింలలో చాలామంది ట్రంప్ ప్రస్తుతం నిషేధం విధించిన దేశానికి సంబంధించిన దేశాల వారు ఉండటమే అందుకు కారణం.

ప్రపంచంలోనే ప్రముఖ టెకీ సంస్థలుగా ఉన్న గూగుల్, ఆపిల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్, లింక్‌డిన్‌వంటి సంస్థలు ట్రంప్ చర్యలను తీవ్రంగా ఖండించడమే కాకుండా తమ సంస్థల్లో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులకు అండగా నిలుస్తున్నారు.

**గూగుల్.....**

ఇప్పటికే వీసాగానీ, గ్రీన్ కార్డుగానీ ఉన్న ఏడు నిషేధిత దేశాలకు చెందిన ఉద్యోగస్తులు ఎవరైనా ఉంటే వారు తమ ప్రయాణాలు రద్దు చేసుకోవాల్సిందిగా గూగుల్ టెక్ 30 సంస్థ వారికి తెలియజేసింది. నిషేధం ఎత్తివేసే వరకు అమెరికా వెలుపల తిరిగే పనులెవరూ పెట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు.




**ఆపిల్ కంపెనీ సీఈవో టిమ్‌కుక్...**

తన ఉద్యోగస్తుల గురించి తీవ్ర ఆందోళన చెందుతూ కుక్ ఈ మెయిల్ ద్వారా తన ఉద్యోగస్తులకు ఒక లేఖ విడుదల చేశారు. వలసదారుల సహాయం లేకుండా ఆపిల్ ఇంత స్థాయికి చేరుకోదని, ట్రంప్ పాలసీని తాము అంగీకరించబోమని మీరేం భయపడొద్దని వారికి భరోసా ఇచ్చారు.

**అమెజాన్...**

మరో ఆన్‌లైన్ వ్యాపార దిగ్గజం అమెజాన్ తన ఉద్యోగస్తులకు ఒక ఈమెయిల్ పంపించింది. ట్రంప్ కొత్త ఆదేశాల ప్రభావానికి గురైన తమ వారికి అండగా ఉంటామని, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చి పనిచేసిన వారి వల్లే తమ సంస్థ ఇంతగా అభివృద్ధి చెందిందని.. అమెజాన్‌ను గొప్పగా తీర్చిదిద్దిందని పేర్కొంటూ ఎవరూ భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చింది.

**ఫేస్‌బుక్...**

ఇక ఫేస్ బుక్ సీఈవో ట్రంప్ నిర్ణయం వచ్చిన రోజే వ్యతిరేకిస్తూ, తన జీవితం ఈరోజు ఇంత అద్భుతంగా ఉందంటే అది ఇమ్మిగ్రేషన్ వచ్చిన వారి కష్టం వల్లే అంటూ ఆయన పేర్కొన్నారు. శరణార్థులకు మనం ఎప్పుడూ తలుపులు తెరిచేఉంచాలని, వారికి సహాయం అందించాలని అన్నారు. శ్రామికశక్తిపై ప్రభావం పడితే సొంత దేశ ప్రజలను వారి కుటుంబాలను ఎలా రక్షించుకుంటామని ప్రశ్నించారు. తమ కంపెనీలో పనిచేసే నిషేధ దేశాల ముస్లింలకు లీగల్ పరంగా కావాల్సిన సహాయం చేస్తామని చెప్పారు.

**10 వేల మంది శరణార్థులను నియమించుకుంటాం స్టార్‌బక్స్ సీఈవో ప్రకటన**

ముస్లిం మెజారిటీ దేశాల నుంచి శరణార్థుల రాకను నిషేధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీచేసిన ఉత్తర్వులను కార్పొరేట్ దిగ్గజాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రానున్న ఐదేళ్లలో 75 దేశాల్లో 10వేలమంది శరణార్థులను తమ ఉద్యోగులుగా నియమించుకోవాలనుకుంటున్నామని స్టార్‌బక్స్ కంపెనీ సీఈవో హొవార్డ్ షల్ట్జ్ ప్రకటించారు. వివిధ దేశాల్లో అమెరికా సైన్యం అభ్యర్థన మేరకు భద్రతా దళాలకు దుబాసీలుగా, సహాయక సిబ్బందిగా సేవలు అందించిన వ్యక్తులకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యమిస్తానని ఆయన తెలిపారు. ఒబామా హెల్త్ కేర్ ప్రజాబీమా పథకాన్ని ట్రంప్ తొలగించడంతో కంపెనీ ఉద్యోగులకు తామే ఆరోగ్యబీమా అందిస్తామని షుల్ట్జ్ స్పష్టం చేశారు. షుల్ట్జ్ గతంలోనూ పలు అంశాలపై గట్టిగా గళమెత్తి పతాక శీర్షికలకు ఎక్కారు.

**ట్రంప్ నిర్ణయాలు లాభమా ? నష్టమా ?**

అమెరికా 45 అధ్యక్షుడిగా ట్రంప్ చేపట్టనున్న విధానాలు, వివిధ పరిపాలనా సంస్కరణలు మన దేశాన్నికూడా ప్రమాదంలోకి నెట్టనున్నాయా? వివాదాస్పద నిర్ణయంతో ముస్లిందేశాలకు గట్టి షాకిచ్చిన ట్రంప్ మన మార్కెట్లను, ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయనున్నాడా? అనే చర్చ మార్కెట్ నిపుణులను ఆలోచనలో పడవేసింది. అయితే భారతీయ మార్కెట్లపై తక్కువ ప్రభావం ఉండనున్నట్టు మార్కెట్ విశ్లేషకులు అంచనా. లోయర్ ఫిస్కల్ రేటు, కరెంట్ ఖాతా లోటుతో బలంగా ఉన్న భారతీయ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విధానాలు పనిచేయలేవని దేశీయంగా తటస్థమని నోమురా ఫైనాన్షియల్ సర్వీసెస్ విశ్లేషకుని అంచనా. బలమైన ఆర్థిక వ్యవస్త, తక్కువ అంతర్జాతీయ వ్యాపారం కారణంగా ఇతర మార్కెట్లతో పోలిస్తే సాంకేతికంగా బలంగా ఉన్నట్టు చెప్పారు. టీపీపీలో ఒప్పందంలో ఇండియా భాగస్వామ్యం లేనందున అమెరికా చేపట్టిన వ్యాపార రక్షణాత్మక చర్యల ప్రభావం చాలా పరోక్షంగా ఉండనున్నట్టు చెప్పారు. అయితే కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలు భారతీయ సాఫ్ట్ వేర్ సంస్థలకు కొంత నష్టమేనని తెలిపింది. అమెరికా సరిహద్దు పన్ను పెరుగుదల ఔషధ తయారీ, టెక్స్ టైల్స్, జెమ్స్ అండ్ జ్యుయల్లరీ, ఆటో ఉత్పత్తులను దెబ్బతీసే అవకాశం ఉందన్నారు.ట్రంప్ నిర్ణయాలతో చైనా, హాంగ్ కాంగ్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, మలేసియా లాంటి దేశాలు తీవ్రంగా ప్రభావితం కానున్నట్టు తెలుస్తోంది.




**ఆగని నిరసన సెగలు**

**వాషింగ్టన్ :** ప్రపంచవ్యాప్తంగా డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలపై నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఏడు ముస్లిం దేశాల నుంచి వలస వచ్చిన వారిని 4 నెలలపాటు బహిష్కరించాలని ట్రంప్ కార్యానిర్వాహక ఆదేశాన్ని అమెరికాతోపాటు, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా లాంటి దేశాలన్నీ నిరసించాయి. మతాలను బట్టి వివక్ష చూపడం హేయమని నాయకులు తెలిపారు. సిరియా నుంచి వచ్చిన శరణార్థులను అధికారులు విమానాశ్రయం నుంచి బయటకు అనుమతించకపోవడంతో నిరసనలు హోరెత్తుతున్నాయి. యూఎస్ గ్రీన్ కార్డు దారులు, ద్వంద్వ పౌరసత్వాలు కలిగిన వారిని దేశవాసులుగా గుర్తించాలంటూనే, ఏడు ముస్లిం దేశాల ప్రజలను మాత్రం అమెరికాలో కాలు పెట్టనిచ్చేదిలేదంటూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు అయోమయానికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా నిరాకరించిన శరణార్థులను కెనడా, ఇటలీలు ఆహ్వానించాయి. ఇటలీలోని చర్చి అధికారులు 41 సిరియా శరణార్థులను ఆహ్వానించారు. శరణార్థులను ఆహ్వానించిన ఆఫ్రికా దేశాల వారిని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియా గుటెరస్ ప్రశంసించారు. అమెరికా నిర్ణయాలపై ఖండనలు పెరిగిపోతున్నాయి. ఆయన నిర్ణయాలతో యుద్ధ భయాలు పెరిగి పోయి, మానవాళి అంతానికి చేరుతుందనే భయం ఏర్పడుతోందని మానవతావాదులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాక్ పార్లమెంట్ ప్రతీకార చర్యలకు పాల్పడుతూ అమెరికా పౌరులను దేశం నుంచి బహిష్కరిస్తోంది.57 దేశాల ఇస్లామిక్ సహకార సంస్థ ట్రంప్ ఆదేశాలపై హెచ్చరికలు జారీ చేస్తూ అమెరికా ఉగ్రవాదులను తయారు చేస్తోందని ఆగ్రహం వెలిబుచ్చింది.

– బోస్

**మైక్రోసాఫ్ట్....**

ప్రస్తుతం ఈ కంపెనీ నడుపుతున్న భారతీయ అమెరికన్ సత్య నాదెళ్ల కూడా ట్రంప్ పాలసీని వ్యతిరేకించారు. ఆయన తన ఉద్యోగులకు అండగా నిలిచి వారికి లీగల్ పరమైన సహాయం అందిస్తామని అన్నారు. నిషేధానికి గురైన దేశాలకు చెందిన 76మంది ఆయన సంస్థలో ఉన్నట్లు తెలిసింది. సత్యానాదెళ్ల కూడా భారత్ నుంచి వలస వెళ్లిన వ్యక్తే.

### 24 గంటలు ఆహారం నీళ్లు లేకుండా ఉన్నారా?

### ట్రంప్‌కు సూటి ప్రశ్న



**దమాస్కస్ (సిరియా) :** ఈ ప్రశ్న వేసింది ఎవరోకాదు సిరియా బాలిక ఏడేళ్ల వయసు కలిగిన బనా అల్‌బెద్. ఒక తాజా వీడియోలో అమెరికా అద్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రశ్నిస్తూ సిరియాలోని అలెప్పోలో తన జీవితంపై ట్వీట్ చేయడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. '24 గంటలపాటు నీరు, ఆహారం తీసుకోకుండా మీరెప్పుడైనా ఉన్నారా..? సిరియాకు చెందిన చిన్నారులు, శరణార్థుల గురించి ఆలోచించండి' అని ట్విట్టర్‌లో అల్‌బెద్ ప్రశ్నించింది. బయటి దేశ ప్రజలు (చెడు ఉద్దేశ్యాలతో) చెడ్డవారనే దృష్టితోనే వారి వలసలపై నిషేధం విధించానని ట్రంప్ వాధించిన నేపథ్యంలో అల్‌బెద్ ట్వీట్‌లో స్పందిస్తూ ' నేను ఉగ్రవాదినా ...? అని ప్రశ్నించింది. ఇదిలా ఉండగా సిరియా చిన్నారులకు సాయాన్ని అభ్యర్థిస్తూ ట్రంప్‌కు గత నెలలో బనా అల్‌బెద్ ఒక లేఖ కూడా రాసింది. ' సిరియా యుద్ధంలో ఛిద్రమవుతున్న చిన్నారుల్లో నేనొకరిని' అని పేర్కొన్న లేఖను ఆమె తల్లి బీబీసీకి పంపింది. బాంబు దాడులతో అలెప్పోలోని తాను చదివే పాఠశాలను ధ్వంసమైందని, తన స్నేహితులు కొంతమంది మరణించారని ట్రంప్‌కు వివరించింది. 'ప్రస్తుతం నేను టర్కీలో ఉన్నా, బయటకు వెళ్లి ఉత్సాహంగా గడపాలనుకుంటున్నా. స్కూలుకు కూడా వెళ్లాలని ఉన్నప్పటికీ ఇంకా వెళ్లని పరిస్థితి. అందుకే మీతో సహా ప్రతి ఒక్కరికి శాంతి అనేది ప్రధానం.' సిరియా చిన్నారుల కోసం మీరు ఏదోకటి చేయాలి. కారణం వారు మీ పిల్లల్ని ఇష్టపడతారు, మీ మాదిరిగా శాంతిని కోరుకుంటారు' అని పేర్కొంది. సిరియాతో సహా ఏడు ప్రధాన ముస్లిం దేశాల నుంచి వలసలపై నిషేదాన్ని విధిస్తూ ట్రంప్ ఇటీవల ఎగ్జిక్యూటివ్ ఆదేశాలపై సంతకం చేశారు. అయితే ఈ చర్య ప్రయాణీకులతో పాటు అమెరికా వ్యాప్తంగా ప్రజలను ఆందోళనకు గురి చేసింది. కాగా తన ఇల్లు ధ్వంసమవడంతో సహా అలెప్పోలో యుద్ధ పరిస్థితులపై నిరంతరం ట్వీట్లు చేస్తుండటంతో సెప్టెంబర్ 2016 నుంచి ఇప్పటి వరకు 3 లక్షల 66 వేల మందికిపైగా ఫాలోయిర్స్‌ను అల్‌బెడ్, ఆమె తల్లి ఫతేమాలు పొందారు.

# ప్రత్యేక 'ప్రేమంటే' ఇదేనా ?

- మంగళగిరి ఎయిమ్స్‌కు నిధులు నాస్తి
- కావలసింది రూ.4247 కోట్లు ఇచ్చింది కేవలం రూ.610.02 కోట్లు
- ఇవీ కేంద్ర విద్యాసంస్థల స్థితి

'ఆంధ్ర ప్రదేశ్ మాకు ప్రత్యేకం... ఇతర రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందే వరకు అండగా నిలుస్తాం.. విభజన హామీల్లో అడిగినవీ, అడగనివీ కూడా ఇస్తున్నాం..' ఇవీ కేంద్రమంత్రులు వివిధ సందర్భాల్లో మన రాష్ట్రం పట్ల ప్రేమను ఒలకబోస్తూ చేసే వ్యాఖ్యలు. కేంద్రం తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వీరి హామీలు ఆవిరైపోయాయి. కేంద్రం ప్రకటించిన నిధులతో కేంద్ర విద్యాసంస్థలకు కనీసం ప్రహరీగోడల నిర్మాణాలు కూడా సాగవు.



రాష్ట్రానికి మంజూరైన 9 కేంద్ర విద్యాసంస్థల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.4247 కోట్లు అవసరం అవుతుందని అంచనా. అయితే గడచిన మూడేళ్లలో కేంద్రం సమకూర్చింది కేవలం రూ. 610.02 కోట్లు మాత్రమే. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014 ప్రకారం డజనుకు పైగా కేంద్ర విద్యా సంస్థలను నవ్యాంధ్రలో ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఆయా విద్యా సంస్థలకు సమకూరుస్తున్న నిధులను పరిశీలిస్తే సొంత భవనాలతో పూర్తిస్థాయిలో ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది. కేంద్రం 2015 సంవత్సరం నుండి వరుసగా 9 విద్యా సంస్థలను రాష్ట్రానికి కేటాయించింది. వీటిలో కొన్ని ప్రైవేటు భవనాలు, సంస్థల్లో కొనసాగుతుండగా, మరికొన్ని నిధుల లేమితో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. కేంద్రం ఇదే విధంగా నిధులను సమకూరిస్తే పదేళ్లయినా కూడా పూర్తి కావని విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల స్థితిగతులు ఈ విధంగా ఉన్నాయి.

**ఎయిమ్స్, మంగళగిరి :** ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు గుంటూరు జిల్లా మంగళగిరిలో గత 2015 డిసెంబరు 19 వ తేదిన కేంద్రమంత్రి జేపీ నడ్డా శంకుస్థాపన చేశారు. మంగళగిరి టీబీ శానిటోరియంలో 247 ఎకరాల్లో రూ. 1618 కోట్ల వ్యయంతో ఎయిమ్స్ నిర్మాణాన్ని చేపట్టి మూడేళ్లలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇక్కడ 960 పడకల ఆసుపత్రితో పాటు సంప్రాదాయ వైద్యం, ఆయుర్వేదం, యునానీ వంటి వైద్య సేవలను అందచేస్తామన్నారు. అయితే దీనికి గడిచిన రెండు బడ్జెట్లలోనూ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

**పెట్రోలియం విశ్వవిద్యాలయం, విశాఖపట్నం :** విశాఖపట్నం జిల్లా అనకాపల్లి వద్ద 150 ఎకరాల్లో రూ. 650 కోట్ల వ్యయంతో పెట్రోలియం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు 2016 సంవత్సరం మే 27 వ తేదిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌ను ఢిల్లీలో ఆవిష్కరించారు. దీనిని హెచ్‌పీసీఎల్,ఐఓసీఎల్, ఓఎన్‌జీసీ, ఓఐల్ వంటి సంస్థల సహకారంతో నిర్వహించాల్సి ఉంటుంది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సదస్సులో కొన్ని ఆయిల్ కంపెనీలతో ఏపీ ప్రభుత్వం పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని నిర్మాణానికి 2017-18 బడ్జెట్‌లో రూ. 140.02 కోట్లను కేటాయించారు.

**ఐఐఎస్ఈఆర్, తిరుపతి :** దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (ఐఐఎస్ఈ ఆర్)ను కూడా కేంద్రం రాష్ట్రానికి మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ కేంద్రాలు భోపాల్, మొహాలీ, పూణె, కోల్‌కత, తిరువనంతపురంలలో మాత్రమే ఉన్నాయి. తిరుపతిలో ఏర్పాటు చేస్తే దక్షిణాదిలో రెండో కేంద్రం వచ్చినట్లవుతుందని అంతా సంబరపడ్డారు. దీనికి 2015 సంవత్సరం మార్చి 28న కేంద్రమంత్రి స్మృతి ఇరానీ శంకుస్థాపన చేశారు. తిరుపతి సమీపంలో 250 ఎకరాల స్థలంలో 4 ఏళ్ల వ్యవధిలో దీనికి నిర్మించాలని తలపెట్టారు. ప్రసుత్తం శ్రీరామ ఎడ్యుకేషనల్ సొసైటీ భవనంలో ఈ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. దీని నిర్మాణ వ్యయం రూ.1500 కోట్లు కాగా ఈ మూడేళ్ల కాలంలో రూ.113 కోట్లే మంజూరు చేశారు.

**ఐఐఎం, విశాఖపట్నం :** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ (ఐఐఎం) విశ్వవిద్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం 240 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దీనిని కూడా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ 2015 జనవరి 17 వ తేదిన శంకుస్థాపన చేశారు. తాత్కాలికంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని కొనసాగుతున్న దీనికి కూడా శాశ్వత భవనం లేని పరిస్థితి . ఈ కేంద్రం ఏర్పాటుకు రూ.900 కోట్ల అంచనా వ్యయం కాగా కేంద్రం ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.83 కోట్లను కేటాయించారు.

**ఐఐటీ,తిరుపతి :** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ని రేణిగుంట సమీపంలోని ఏర్పేడు వద్ద నిర్మించాలని నిర్ణయించారు. చదలవాడ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో కృష్ణతేజ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో తాత్కాలికంగా 2015 ఆగష్టు 5 వ తేది నుండి తరగతులను ప్రారంభించారు. శాశ్వత భవనాలు నిర్మాణానికి రూ.700 కోట్ల అంచనా వ్యయం కాగా మూడేళ్లలో రూ.108 కోట్ల మంజూరు చేశారు. ఇంకా ఈ విశ్వ విద్యాలయం భూసేకరణ దశలోనే ఉండడం గమనార్హం.

**ఎన్ఐటీ, తాడేపల్లిగూడెం :** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)ని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేయాలని భావించారు. దీనిని 176 ఎకరాల స్థలంలో రూ.400 కోట్ల వ్యయంతో రెండేళ్ల వ్యవధిలో పూర్తిచేస్తామని 2015 ఆగష్టు 20 వ తేదీన శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ప్రకటించారు. ప్రసత్తం దీనిని తాడేపల్లిగూడెం సమీపంలోని పెద్దతాడేపల్లిలోని శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగిస్తున్నారు. దీని నిర్మాణానికి 2015 బడ్జెట్‌లో రూ.40 కోట్లు,2016లో 50 కోట్లు మంజూరు చేసిన కేంద్రం ఈ ఏడాది మొండి చెయ్యి చూపించింది.

ట్రిపుల్ ఐటీ, కర్నూలు : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ, డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ)ని కర్నూలులో 151 ఎకరాల్లో రూ. 747.77 కోట్ల వ్యయంతో నిర్మించాలని నిర్ణయించారు. తొలి నుండి ఈ కేంద్రం బాలారిష్టాలను చవిచూస్తోందనడానికి నిధుల కేటాయింపులే నిదర్శనం. దీని కోసం 2015 బడ్జెట్‌లో రూ.3 కోట్లు, 2016 లో రూ.20 కోట్లు, 2017 లో రూ.30 కోట్లను మంజూరు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హడావిడి పుణ్యమాని దీనిని తమిళనాడులోని కాంచీపురంలోని ఐఐటీడీఎంలో తాత్కాలికంగా తరగతులను ప్రారంభించారు. అయితే ఇంతవరకూ సొంత భవన నిర్మాణానికి నోచుకోలేదు.

**కేంద్ర విశ్వ విద్యాలయం , అనంతపురం :** కేంద్ర విశ్వ విద్యాలయాన్ని అనంతపురంలో నిర్మించాలని నిర్ణయించారు. అయితే స్థలాన్ని సేకరించాల్సి ఉన్న దీని నిర్మాణానికి రూ.500 కోట్ల అంచనా వ్యయం అంచనా వ్యయం కాగా 2015 బడ్జెట్ కోటి రూపాయలు, 2016 లో రూ.10 కోట్లు కేటాయించి ఈ ఏడాది విస్మరించారు. తాత్కాలికంగా కేంద్రం విశ్వ విద్యాలయాన్ని జేఎన్‌టీ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగించాలని నిర్ణయించారు.

**గిరిజన విశ్వవిద్యాలయం, విజయనగరం :** రాష్ట్రంతోపాటు పెరగనున్న ఒడిశాకు చెందిన గిరిజనులను ఉద్దేశించి గిరిజన విశ్వవిద్యాలయాన్ని విజయనగరంలో ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఇందుకు 550 ఎకరాల స్థలం అవసరం అవుతుందని లెక్కకట్టారు.

ఈ స్థలాన్ని కేంద్రమంత్రి పి. అశోక గజపతిరాజు తన కుటుంబ సభ్యులకు సంబంధించి భూముల నుండి కేటాయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. నిర్మాణ వ్యయం రూ.300 కోట్లు కాగా 2016 బడ్జెట్‌లో రూ.2 కోట్లు, 2017 లో రూ.10 కోట్లు కేటాయించి చేతులు దులిపేసుకున్నారు. ఇదిలా ఉంటే కేంద్రాన్ని నిధులకోసం ఒత్తిడి చేయని చంద్రబాబు నాయుడు నోబుల్ ప్రైజులు తెచ్చుకున్నవారికి రూ. 100 కోట్లు బహుమతిని అందిస్తానని తిరుపతి సైన్స్ కాంగ్రెస్‌లో ప్రకటించడం కొసమెరుపు.

\- ఖాన్

## బడ్జెట్ కుస్తీ ఇలా...

బడ్జెట్ అనగానే చాలామంది లెక్కలో కదా ! అనుకుంటారు. కానీ ఈ మూడక్షరాల వెనుక ఆరునెలల కృషి దాగుంటుంది. ఎంతో కసరత్తు, లెక్కకు మించి భేటీలు. ఆద్యంతం గోప్యత. అబ్బో చాలా తతంగమే ఉంటుంది. అదేంటో మీరు చూడండి.

**ఆగస్టు చివర్లో...** రానున్న ఆర్థిక సంవత్సరంలో ఏయే రంగానికి ఎంత ఖర్చు పెట్టాలన్న కసరత్తు మొదలవుతుంది. దేశంలో మొత్తం జనాభా తమ తిండి కోసం ఏడాది అంతా ఎంత ఖర్చు చేస్తున్నారో దాదాపు ఆంత మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్టు కేటాయిస్తుంది.

**సెప్టెంబరు చివర్లో...** తమకు కావాల్సిన నిధులపై వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు ఆర్థికశాఖతో చర్చల్లో తలమునకలవుతారు.

**అక్టోబర్ :** ముసాయిదా బడ్జెట్ కాపీలను అధికారులు ఆర్థిక మంత్రికి నివేదిస్తారు. ఈ ముసాయిదా పత్రాలన్నీ నీలం రంగులో ఉంటాయి.

**నవంబర్ :** పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాలకు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు ఆర్థికమంత్రిని కలసి తమ సమస్యలను సలహాలను, సూచనలను అందజేస్తారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి ఆందరి వాదనలు వింటారుగానీ ఎవరికీ నిర్దిష్టమైన హామీ ఇవ్వరు.

**ముద్రణ ప్రక్రియ :** బడ్జెట్‌కు సంబంధించిన అన్ని వివరాలను అత్యంత రహస్యంగా ఉంచేందుకు జనవరి నుంచి ఆర్థికమంత్రిత్వ శాఖ కార్యాలయాల్లోకి జర్నలిస్టుల ప్రవేశాన్ని విషేధిస్తారు.

**ఫోన్ ట్యాపింగ్ :** బడ్జెట్ ప్రతిపాదనలు ఏమాత్రం లీక్ కాకుండా చూసే బాధ్యతను ఇంటెలిజెన్స్ విభాగం చూసుకుంటుంది. ఇందుకు కొందరు ఉన్నతాధికారుల ఫోన్లను సైతం ట్యాప్ చేస్తుంటుంది.

**సందర్శకులపై మూడో కన్ను :** ఆర్థిక కార్యాలయానికి వచ్చే సందర్శకులపై సీసీటీవీ ఎప్పటికప్పుడు నిఘూ ఉంటుంది. ఈ కెమెరాల పరిధిని దాటి వారు కనీసం కుర్చీలపై కూర్చోవ డానికి కూడా అనుమతి ఉండదు.

**జనవరి చివర్లో :** బడ్జెట్ పత్రాలను తయారు చేసే 'ప్రింటింగ్ ప్రెస్' సిబ్బందిని ఎవరితో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంచుతారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులు ఎల్లప్పడూ అందుబాటులో ఉంచుతారు.

**ఆహారంపై ఎంత జాగ్రత్తో :** ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందికి అందించే తిండిపై ఆత్యంత జాగ్రత్త తీసుకుంటారు. ఏ ఆహారాన్నైనా పరీక్షించిన తర్వాతే వారికి ఇస్తారు.

**అత్యవసర సమయాల్లో :** ముద్రణ విభగంలో పనిచేసే సిబ్బంది ఎవరైనా అత్యవసరంగా బయటకు వెళ్లాల్సిన పరస్థితి వస్తే.. సదరు వ్యక్తి వెంట ఓ ఇంటెలిజెన్స్ అధికారి, ఓ పోలీసు ఉంటారు. వారు అనుక్షణం ఆయనను నీడలా అనుసరిస్తారు.

**ఫిబ్రవరి 28/29...** సాధారణంగా ఈ రోజుల్లోనే ఉదయం 11 గంటలకు ఆర్థికమంత్రి పార్లమెంటుకు బడ్జెట్టు సమర్పిస్తారు. సభలో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి, ప్రధానికి బడ్జెట్ గురించి వివస్తారు. బడ్జెట్‌ను లీక్ చేసిన జర్నలిస్టులకు దేశద్రోహం కేసు నమోదు చేసేవారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాత్రం ప్రజాభిప్రాయం కోసం బడ్జెట్‌ను వెబ్‌సైట్‌లో పెట్టేవారు.

## పంజాబ్, గోవాల్లో
# పోల్స్ మాటేంటి?

**పంజాబ్:** నోట్ల రద్దు తర్వాత దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమరానికి తెరలేసింది. పంజాబ్, గోవాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. పంజాబ్‌లోని 117 స్థానాలకు, గోవాలోని 40 స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరగనుంది. పంజాబ్‌లో 1.98 కోట్ల మంది ఓటర్లు 1,145 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. కాంగ్రెస్ మొత్తం సీట్లలో పోటీ చేస్తుండగా, ఆమ్ ఆద్మీ పార్టీ 112 స్థాన్లాల్లో, లోక్ ఇన్సాఫ్ 5 స్థానాల్లో బరిలో ఉంది. అధికార శిరోమణి అకాలీ దళ్ 94 చోట్ల, దాని మిత్రపక్షం బీజేపీ 23 చోట్ల పోటీ చేస్తున్నాయి. ఇక 11 లక్షల మంది ఓటేయనున్న గోవాలో 250 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 34 స్థానాల్లో పోటీ చేస్తున్న బీజేపీ మిగిలిన 5 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు మద్దతిస్తోంది. కాంగ్రెస్ 48 స్థానాల్లో అద ృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఆప్ 38 సీట్లలో, మహారాష్ట్రవాదీ గోమంత్ పార్టీ(ఎంజీపీ) 28 సీట్లలో బరిలో ఉన్నాయి.









# విజృంభిస్తున్న స్వైన్‌ఫ్లూ

- రుయా ప్రత్యేక వార్డులో ఏడుగురికి చికిత్స
- జిల్లాలో ఇప్పటికే ముగ్గురు మృతి
- వ్యాక్సిన్లు, మాస్కుల కొరత



**తిరుపతి:**

చిత్తూరులో జిల్లాలో స్వైన్‌ఫ్లూ వైరస్ లక్షణాలు బయట పడటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాజాగా తిరుపతిలోని రుయా, స్విమ్స్ హాస్పిటల్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. మొత్తం ఏడుగురు చికిత్స పొందుతున్నట్టు వైద్యాధి కారులు వెల్లడించారు. రుయా ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. తిరుపతి సొర్లగుంట మారుతీ నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ స్విమ్స్‌లో కన్ను మూయడంతో మృతుల సంఖ్య 3కు చేరింది. రోజూ నలుమూలల నుంచి వెంకన్న దర్శనం కోసం తిరుమల తరలివస్తున్న భక్తులకు ముందస్తు చర్యల్లో భాగంగా రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ వద్ద స్వైన్‌ఫ్లూ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ల ఏర్పాటుతో పాటు మాస్కులు పింపిణీ చేయాలని వైద్యనిపుణులు కోరుతున్నారు.

రెండు వారాల క్రితం చిత్తూరు జిల్లా ఐరాల మండలం చుక్క వారిపల్లెకు చెందిన వ్యక్తి స్వైన్‌ఫ్లూ వ్యాధితో వేలూరు సీఎంసీలో చికిత్స పొందారు. గత నెల 16 న అతని భార్యకు స్వైన్‌ఫ్లూ సోకడంతో సీఎంసీలో చికిత్స పొందుతూ మరణించింది. వైఎస్ఆర్ జిల్లా రాజంపేట మెళవారిపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో రుయా ఆస్పత్రిలో చేరడంతో వైద్యులు రక్తపరీక్ష అనంతరం స్వైన్‌ఫ్లూ సోకినట్టు నిర్ధారించడంతో రుయా ఐడీహెచ్ బ్లాక్‌లో ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారు. రాజంపేటకు చెందిన మరో మహిళ కూడా రెండు రోజుల క్రితం రక్తపరీక్షలో స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఉన్నట్టు నిర్ధారణ అయినప్పటికీ ఆస్పత్రి వైద్యులు,సిబ్బందికి తెలియకుండా వెళ్ళిపోయినట్లు సమాచారం.

తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చిన మలేషియాకు చెందిన ప్రవాస భారతీయులు యోగీశ్వరికి స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఆమె వారం రోజుల క్రితం మలేషియా నుంచి చెన్నై చేరుకున్నారు. అక్కడ వివిధ ప్రాంతాల్లో పర్యటించిన సమయంలో యోగేశ్వరికి జ్వరం, జలుబుతో అనారో గ్యానికి గురయ్యారు. ఈ పరిస్థితుల్లో తిరుమల శ్రీ వారి దర్శనానికి వచ్చిన ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో రుయా ఆసుపత్రికి తరలించారు. రక్త పరీక్ష అనంతరం స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు తేల్చారు. రుయా ఆస్పత్రిలో స్వైన్‌ఫ్లూ వ్యాధిగ్రస్తులకు సేవవుల అందించేందుకు సిబ్బంది భయ పడుతున్నట్టు సమాచారం. ప్రధానంగా స్వైన్‌ఫ్లూ వ్యాక్సిన్‌లు, మందులు అందుబాటులో లేకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. కొందరు రోగుల సహాయ కులు సొంత డబ్బుతో ఎన్ -95 మాస్కులు, వ్యాక్సిన్లను కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

## రాయపూడిలో హెల్త్‌కార్డుల పంపిణీ

**రాజధాని ప్రతినిధి,తుళ్లూరు :** రాజధానినగర పరిధిలోని 27గ్రామాల ప్రజలకు ఉచిత హెల్త్‌కార్డుల పంపిణీని ఎ.పి సి.ఆర్.డి.ఏ చురుగ్గా చేపడుతోంది రాజధానిగ్రామాల్లో 2014డిసెంబరు 8,నాటికి నివసిస్తూన్న వారికి అమరావతి నగర పౌరులుగా గుర్తింపుపొందిన వారికి మొత్తం ,28,044 హెల్త్‌కార్డులను ఇవ్వాల న్నది లక్ష్యంతో కాగా ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ,గ్రామ సభల్లో వాటిని పంపిణీ చేస్తున్నారు, రాయపూడిగ్రామాల్లో ఎ.పి సీఆర్‌డి,ఎ వారు ఇప్పటికిరాయపూడిలో 6 గ్రామ సభల్లు పెట్టి 900 హెల్త్ కార్డులు అందజేస్తున్నట్లు సీఆర్‌డీఏ వారు తెలిపారు.












Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan, Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18